thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 328 | కరీంనగర్ మంగళవారం, 3 ఫిబ్రవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌తో కలిసి పనిచేస్తాం

బీజింగ్ : సరిహద్దుల వద్ద శాంతి, సుస్థిరత నెలకొల్పేందుకు భారత్‌తో కలిసి పనిచేసేందుకు తమ సైన్యం సిద్ధమని చైనా ప్రకటించింది. రెండు దేశాల సైనిక భవిష్యత్ సంబంధాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఝూంగ్ జియావోగాంగ్ స్పందిస్తూ ఈ విషయం చెప్పారు. అత్యంత పురాతన నాగరికతలు కలిగి ఉన్న ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన స్థానాలను ఆక్రమించాయన్నారు. ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.




## మున్సిపల్ ఎన్నికల్లో మంత్రులకు బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి మంత్రులకు బీఫారాలు అందచేశారు. బాగా పనిచేసే వారికి, పార్టీకి తొలి నుంచి కష్టపడిన వారికి బీఫారాలు అందచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంత్రులు నేతలకు రేపు ఉదయం బీఫారాలను అందచేస్తారు. రాష్ట్రంలో ఏడు కార్పొరేషన్లు, 117మున్సిపాలిటీలకు సంబంధించిన నామినేషన్ల ఎన్నిక ప్రక్రియ పూర్తయిన సంగతి తెలిసిందే. అయితే అభ్యర్థులకు పార్టీ గుర్తులు కేటాయించాలంటే వారికి పార్టీ నుంచి బీఫారాలు అందచేయాల్సి ఉంటుంది.

**వివక్ష చూపకుండా...** అయితే అధికారంలో ఉండటంతో ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. తమకు బీఫారాలు అందచేయాలని నేతలపై వారు వత్తిడి తెస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో నేతల మధ్య విభేదాలు కూడా బీఫారాలు ఇవ్వడంలో వివక్ష చూపుతారని గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ బాధ్యతలను మంత్రులకు అప్పగించారు. ఆ యా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ కోసం కష్టపడి పనిచేసిన వారికి ప్రధమ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.



# ఇజ్జత్ కా సవాల్..!

## కమలనాథుల అంతర్మథనం..

### పట్టణ ప్రాంతాల ప్రజలు ఆదరిస్తారా? పంచాయతీ ఎన్నికల ఫలితాలు రిపీట్ అవుతాయా?

అందరి దృష్టి ఎంపీలు, ఎమ్మెల్యేల వైపే హాట్ టాపిక్ గా మారిన పురపోరుహైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు బీజేపీకి ఇజ్జత్ కా సవాల్ గా మారనున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో ఏ మాత్రం ప్రభావం చూపని ఆ పార్టీ మున్సిపాలిటీ ఎన్నికల్లో ఏ మేరకు సీట్లు సాధిస్తుందనేది హాట్ టాపిక్ గా మారింది. ఉత్తర తెలంగాణలో పట్టున్న కమలం పార్టీ దానిని ఈ ఎన్నికల్లో నిలుపుకొం టుందా..? అన్నది హాట్ టాపిక్ గా మారింది. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఆ పార్టీ సాధించిన సీట్లు హాట్ టాపిక్ గా మారాయి. రాష్ట్రంలో 12,702 పంచాయతీలకు ఎన్నికలు జరగగా.. కేవలం 710 సర్పంచ్ స్థానాలను మాత్రమే బీజేపీ గెలుచుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీకి 7.527 స్థానాలు దక్కగా.. 3,511 సర్పంచ్ స్థానాలతో బీఆర్ఎస్ రెండో ప్లేస్ లో నిలిచింది. బీజేపీ తమకు పట్టణ ప్రాంతాల్లో బలం ఉందని చెబుతూ ఉంటుంది. ఈ సారి రా ష్టంలోని 116 పట్టణాలు, ఏడు కార్పొరేషన్లలోని పాలక వర్గాలకు జరగనున్న ఎన్నికల్లో ఆ పార్టీ ఎన్ని పట్టణాల్లో పాగా వేస్తుందనేది హాట్ టాపిక్ గా మారింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడిజిల్లాల్లో బలమైన పార్టీగా బీజేపీ ఎదిగింది. ఇక్కడి పట్టణాల్లో 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్, కామా రెడ్డి, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్, గోషామ హల్ సెగ్మెంట్లలో బీజేపీ విజయం సాధించింది. ఇందులో ఆదిలాబాద్, నిజామాబాద్ రెండు జిల్లా లకు సంబంధించినవే ఏడు అసెంబ్లీ స్థానాలున్నాయి. ఆ తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో నిజామాబాద్, బాద్, ఆదిలాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్. కరీంనగర్. మల్కాజ్ గిరి, చేవెళ్ల, మహబూబ్ నగర్, సికింద్రాబాద్, మెదక్ ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో బలాన్ని పెంచుకోగలిగింది. ఆ తర్వాత జరిగిన గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ సత్తా చాటింది. అయితే పంచాయతీల వద్దకు వచ్చే సరికి చతికిలపడిపోయింది. దీంతో ప్రస్తుతం జరగబోయే బల్దియా ఎన్నికల్లో పరిస్థితి ఎలా ఉండబోతోందనేది అంతు చిక్కడం లేదు. ఒక వేళ పంచాయతీ ఎన్నికల ఫలితాలే రిపీట్ అయితే ఎలా అన్న సందేహాలు పార్టీ కేడర్ ను వెంటాడుతున్నాయి.

# నేరాలు చేస్తాం.. ప్రశ్నించవద్దంటే ఎలా?

## కేసీఆర్ కుటుంబంపై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో తాము పనిచేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి పురస్కారాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. "నిజాం పాలకులకు వ్యతిరేకంగా రావి నారాయణరెడ్డి పోరాటం చేశారు. నాడు ప్రజల కష్టాలు, రాచరిక పోకడలు, అరాచక చర్యలపై పోరాడారు. 500 ఎకరాల భూమిని పేదలకు పంచి ఆదర్శంగా నిలిచారు. స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుంది. ప్రజల తిరుగుబాటు సాయుధ పోరాటంగా మారుతుందని ఆయన చాటి చెప్పారు. 60 ఏళ్లు వచ్చేసరికి రాజకీయ పదవీ విరమణ చేసిన గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి. ప్రజల నుంచి తిరస్కారం పొందినా.. నేటి నేతలకు పదవీ వ్యామోహం పోవడం లేదు. తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబం అనుభవించింది. వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల వ్యాపారాలు మీకెలా వచ్చాయి..? బీఆర్ఎస్ నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేశారు. నేరాలు చేస్తాం.. పశ్నించవద్దని మీరెలా అంటారు? అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదు" అని సీఎం స్పష్టం చేశారు. రావి నారాయణ రెడ్డి నేషనల్ అవార్డు పొందడం ఎంతో గొప్పదిగా భావిస్తానని అవార్డు గ్రహీత జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. రావి నారాయణ రెడ్డి నిత్య చైతన్య స్ఫూర్తి అని కొనియాడారు. సొంత ఆస్తులను ప్రజలకు పంచిన మహానుభావుడని ప్రశంసించారు.

**తమకు తాము జాతిపతి అనుకోవడం విడ్డూరం: రేవంత్...** తెలంగాణలో కేసీఆర్, బీఆరెస్‌పై సీఎం రేవంత్ రెడ్డి తాజాగా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. జాతిపిత అని కొందరు తమను తాము ప్రకటించుకోవడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. కొంతమంది ఉద్యమకారులమని చెప్పుకుంటున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. చిన్న నోటీసులు ఇస్తే జాతిపితకు నోటీసులా అంటూ ప్రశ్నించడం సరైంది కాదని చెప్పారు. గాంధీజీ పదవులను త్యాగం చేసి ప్రాణాలు విడిచారని గుర్తు చేశారు. ఇప్పుడు జాతిపితమని చెప్పుకునేవారు ఏం చేశారో చెప్పాలని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమాన్ని ఏకం చేసి నడిపించిన ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారుడు కాదా అని ప్రశ్నించారు. ఆయన్ను తలుపులు బద్దలు కొట్టి అరెస్టు చేసింది మీ పాలనలోనే జరిగిందని గుర్తు చేశారు. తమను మాత్రం అలా అరెస్టు చేయలేదని చెప్పారు. నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారని తెలిపారు. రావి నారాయణ రెడ్డి లాంటి వారు తెలంగాణ కోసం సర్వం కోల్పోయారని రేవంత్ రెడ్డి అన్నారు. పదవులు, వేలకోట్ల ఆస్తులు సంపాదించిన వారు ఉద్యమకారులు ఎలా అవుతారని ప్రశ్నించారు. ప్రజలు తిరస్కరించినప్పుడు అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రజలే తప్పు చేశారని చెప్పడం ప్రజాస్వామ్య లక్షణం కాదని అన్నారు. అక్రమ మార్గం ఎంచుకున్న వారు విచారణ ఎదుర్కోవాల్సిందే అని అంబేద్కర్ చెప్పారని గుర్తు చేశారు. శిబు సోరెన్ లాంటి వారు కూడా విచారణ ఎదుర్కొన్నారని ఉదాహరణ ఇచ్చారు. మనమంతా దైవాంశ సంభూతులు కాదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో తప్పు చేసినవారు విచారణను ఎదుర్కోవాల్సిందే అని తేల్చి చెప్పారు. చివరగా, చట్టప్రకారం విచారణ కొనసాగుతుందని, ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరికీ ఒకే నిబంధనలు వర్తిస్తాయని ఆయన తెలిపారు.






# ఇక అమెరికా డామినేషన్‌కు బ్రేక్?

## డాలర్‌ను గోల్డ్‌తో కొడుతున్న భారత్, చైనా!

బంగారం, వెండి ధరల్లో ఇటీవలి పెరుగుదల గాలికి జరగలే దు. మార్కెట్లో రోజువారీ ధరల పెరుగుదల కేవలం డిమాండ్ లేదా ఊహాగానాల ఫలితం కాదు. దీని వెనుక ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మార్పు ఉంది, ఇది భవిష్యత్తులో మన జేబులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఇది ఒక పెద్ద మార్పును సూచిస్తుంది, దీనిని ఆర్థిక నిపుణులు "డీ-డాలరైజేషన్" అని పిలుస్తారు. సరళంగా చెప్పాలంటే ప్రపంచం ఇప్పుడు US డాలర్ చిక్కు నుండి విముక్తి పొందడానికి ప్రయత్నిస్తోంది. ఈ ధోరణి కొనసాగితే దశాబ్దాలుగా డాలర్ బలంపై ఆధారపడిన సూపర్ పవర్‌గా అమెరికా ఇమేజ్ శాశ్వతంగా మసకబారుతుంది.

**విదేశీ మారక నిల్వల్లో బంగారం పెరుగుదల...** ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులు ఇప్పుడు డాలర్ విలువ కలిగిన కాగితపు ముక్కలకు బదులుగా గట్టి బంగారంపై ఆధారపడుతున్నాయి. బాండ్ల అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెద్ద ఎత్తున బంగారం కొనుగోలు చేయడానికి ఉపయోగిస్తున్నారు. భారతదేశ విదేశీ మారక నిల్వలలో బంగారం వాటా చారిత్రాత్మక గరిష్ట స్థాయి 15 శాతం కంటే ఎక్కువకు పెరిగింది. 2021, 2025 మధ్య భారతదేశం 126,000 కిలోగ్రాముల బంగారాన్ని కొనుగోలు చేసింది. చైనా మరింత దూకుడుగా వ్యవహరించింది, నాలుగు సంవత్సరాలలో 350,000 కిలోగ్రాముల కంటే ఎక్కువ బంగారాన్ని తన ఖజానాలో సేకరించింది. ఈ మార్పుకు రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో జరిగిన ఒక సంఘటన కూడా కారణం. అమెరికా రష్యా డాలర్ నిల్వలను స్తంభింపజేసినప్పుడు, డాలర్ ఇకపై సురక్షితం కాదని ప్రపంచం మొత్తం గ్రహించింది. అమెరికా తన కరెన్సీని ఎప్పుడైనా ఆయుధంగా ఉపయోగించవచ్చు. కానీ ఎవరూ బంగారాన్ని స్తంభింపజేయలేరు. అందుకే అనిశ్చితి సమయాల్లో ప్రతి దేశం బంగారాన్ని నిల్వ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది, తద్వారా కష్ట సమయాల్లో ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు.

**అమెరికా ఆధిపత్యానికి ముప్పు...** డాలర్ విశ్వసనీయత క్షీణించడం అమెరికాకు నిద్రలేని రాత్రులు ఇస్తోంది. గత ఏడాది కాలంలో డాలర్ విలువ 11 శాతం పడిపోయి, నాలుగు సంవత్సరాల కనిష్ట స్థాయికి చేరుకుంది.

అమెరికా ఫస్ట్‌ను సమర్థించే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇది పెద్ద దెబ్బ. డాలర్ కాకుండా ఇతర కరెన్సీలలో వ్యాపారం చేసే దేశాలు తీవ్ర ఆంక్షలను ఎదుర్కొంటాయని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. దీనిని అమెరికా ప్రయోజనాలకు వ్యతిరేకంగా కుట్రగా ఆయన భావిస్తున్నారు.




## కోఠి కాల్పుల కేసు.. పోలీసులను తప్పుదోవ పట్టించిన నిందితులు

హైదరాబాద్, ఫిబ్రవరి 2: హైదరాబాద్‌లోని కోఠి ఎస్‌బీఐ ఏటీఎం వద్ద జరిగిన కాల్పుల కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనలో నిందితులు చాలా తెలివిగా వ్యవహరించి.. పోలీసులనే తప్పుదోవ పట్టించేలా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. గత శనివారం ఉదయం బ్యాంక్ ఏటీఎంలో రూ.6 లక్షల నగదు డిపాజిట్ చేయడానికి వెళ్లిన రిన్షద్ అనే వ్యక్తిపై ఇద్దరు దుండగులు తుపాకీతో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో రిన్షద్ కాలికి బుల్లెట్ తగలడంతో గాయపడ్డారు. అనంతరం దుండగులు.. బాధితుడి స్కూటీపైనే నగదుతో ఉడాయించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి.. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నాలు చేపట్టారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా.. దుండగులు స్కూటీపై కాచిగూడ వైపు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అయితే నిందితులు ఘటన జరిగిన రోజంతా పలు ఆటోలు మారుతూ సిటీలోనే తిరుగుతూ టైంపాస్ చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ రోజు హైదరాబాద్ నుంచి బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద స్కూటీని వదిలేసి, స్టేషన్ లోపలికి వెళ్లినట్టు నటించిన దుండగులు.. పోలీసులను తప్పుదోవ పట్టించారు. రైలు ఎక్కి పారిపోయారని ఊహించేలా దారి మళ్లించి ఉడాయించారు. కానీ.. నిందితులు రైల్వే స్టేషన్ లోపలికి వెళ్లకుండా సమీపంలోని ఓ డీమార్ట్ వద్ద దుస్తులు మార్చుకుని మరో వేషంలో బయటకు వచ్చినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో బయటపడింది. అక్కడి నుంచి ఆటో తీసుకుని చాంద్రాయణగుట్ట వైపు వెళ్లారు. ఘటన జరిగిన వెంటనే ట్రైన్‌లో వెళితే పట్టుబడతామని ఊహించిన నిందితులు.. ప్లాన్ మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఒకరోజు గడిచాక సిటీ వదిలి నార్త్ స్టేట్స్‌కు వెళ్లి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. నెట్‌వర్క్ డేటా, సీసీటీవీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. దుండగుల కాల్పుల్లో గాయపడిన బాధితుడు రిన్షద్.. ప్రస్తుతం ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



## స్క్రీనింగ్ కమిటీ సిఫారసు మేరకే బీఫామ్స్

హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికలపై టీపీసీసీ ఎన్నికల కమిటీ చర్చించింది. జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, నేతలు చర్చించారు. స్క్రీనింగ్ కమిటీ సిఫారసు మేరకే బీఫామ్స్ ఇవ్వాలని ఈ భేటీలో నిర్ణయించారు. ఈ కమిటీ సిఫారసు చేసిన జాబితాను ఆమోదిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు.

## తాడిచర్ల-1 బొగ్గు గనులను తెలంగాణకు కేటాయించాం: కిషన్‌రెడ్డి

దిల్లీ: తాడిచర్ల – 1 బొగ్గు గనుల విషయంలో కేంద్రం స్పష్టత ఇచ్చింది. 2015 ఆగస్టు 31న తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థకు కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాజ్యసభలో వెల్లడించారు. 2019 మార్చిలో ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఆమోదం తర్వాత.. 2020 జూన్ నుంచి బొగ్గు గనుల కేటాయింపుల ప్రక్రియ మారిందని తెలిపారు. వ్యాపారపరమైన కార్యకలాపాలకు ఉపయోగించే గనులన్నింటినీ వేలం ద్వారానే కేటాయించాలని ఉన్నత స్థాయి కమిటీ కీలక సూచన చేసిందని చెప్పారు. ప్రత్యేక, తప్పని పరిస్థితిలోనే బొగ్గు మంత్రిత్వ శాఖ నేరుగా కేటాయించాలని ఉన్నత స్థాయి కమిటీ స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు రాజ్యసభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తాడిచర్ల-2 గనులు ఇంకా ఎవరికీ



కేటాయించలేదని సమాధానంలో పేర్కొన్నారు.

## రెండేళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలి: రామచందర్‌రావు



హైదరాబాద్: కాంగ్రెస్ అనేక మోసపూరిత వాగ్దానాలు చేసిందని.. అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. బూటకపు హామీలు.. మోసపూరిత వాగ్దానాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఛార్జ్‌షీట్ విడుదల చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో రామచందర్‌రావు మాట్లాడారు. “గ్యారెంటీల పేరుతో ఓట్లు పొందారు తప్పితే ప్రజలకు చేసిందేమీ లేదు. రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి. కేంద్రం నుంచి వచ్చే నిధుల కోసం మాత్రమే మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదు. విద్య, వైద్యాన్ని నిర్లక్ష్యం చేశారు. నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.4వేల భృతి ఎక్కడికి పోయింది..?. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదు. కేంద్రం నుంచి వచ్చే పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయి” అని అన్నారు.

## హైదరాబాద్ నుంచి బెంగళూరు 2 గంటల్లో వెళ్లొచ్చు: అశ్వినీ వైష్ణవ్

దిల్లీ: హైస్పీడ్ కారిడార్‌తో తెలంగాణ, ఏపీ, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. తెలంగాణలో రైల్వే అభివృద్ధి పనులకు రూ.5,454 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. హైస్పీడ్ రైళ్లు తెలంగాణ, ఏపీకి గేమ్ ఛేంజర్‌గా మారుతాయని వెల్లడించారు. “హైదరాబాద్ నుంచి చెన్నై, పుణె, బెంగళూరుకు 3 హైస్పీడ్ రైళ్లు రానున్నాయి.

దీంతో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చు. పుణెకు 1.55 గంటల్లో, చెన్నైకి 2.55 గంటల్లో చేరుకోవచ్చు. హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కి.మీ వేగంతో పరుగులు పెడతాయి” అని మంత్రి వివరించారు.







పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్సులో ఉన్న 12 వేర్వేరు ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతోన్న దాడులకు బాధ్యత వహిస్తూ.. బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటన వెలువరించింది. పాక్ దళాలపై దాడి చేసింది తమ విభాగానికి చెందిన ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లేనని వెల్లడించింది. వీరిలో 24 ఏళ్ల ఆసిఫా మెంగల్ అనే యువతి చేసిన దాడిలో పాక్ సిబ్బంది సహా 50 మంది మృతి చెందినట్లు తెలిపింది. మరో ఆత్మాహుతి బాంబర్ దాడిలోనూ అనేకమంది ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంది. అయితే ఆ బాంబర్ పేరును మాత్రం వెల్లడించలేదు. బలోచిస్థాన్ అంతటా భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని ‘హీరోఫ్’ పేరుతో రెండో దశ ఆపరేషన్‌ను ప్రారంభించనున్నట్లు బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఆదివారం పేర్కొంది. ఈ విషయంపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. ఆత్మాహుతి దాడుల్లో ఇద్దరు మహిళా నేరస్థులు పాల్గొన్నట్లు గుర్తించామన్నారు. ఈ దాడులపై బలోచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగతీ స్పందించారు. పాకిస్థాన్ భద్రతా దళాలు 40 గంటలుగా ఉగ్రవాద ఏరివేత చర్యలు కొనసాగిస్తున్నాయని.. ఇందులోభాగంగా ఇప్పటివరకు 190 మందికి పైగా వేర్పాటువాదులను మట్టుబెట్టాయని వెల్లడించారు. స్థానిక పౌరుల వేషధారణలో ఉన్న బలోచ్ రెబల్స్ పాఠశాలలు, బ్యాంకులు, మార్కెట్లు, ఆసుపత్రులలోకి ప్రవేశించి కాల్పులకు తెగబడుతున్నారని పాక్ మిలిటరీ తెలిపింది. ఏదైనా నగరం లేదా వ్యూహాత్మక స్థావరాన్ని స్వాధీనం చేసుకోవడానికి బలోచ్ రెబల్స్ ప్రయత్నాలు చేస్తున్నారని.. అయితే వాటిని తమ దళాలు సమర్థవంతంగా తిప్పికొడుతున్నాయని పేర్కొంది.




హైదరాబాద్: కేసీఆర్‌కు సిట్ నోటీసులను నిరసిస్తూ ఆదివారం రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు కదిలారని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మళ్లీ ఉద్యమ రోజులు గుర్తుకొచ్చాయని చెప్పారు. పార్టీ క్యాడర్‌కు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో పాలనా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని కేటీఆర్ అన్నారు. మేడారం జాతర ఏర్పాట్లలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. దావోస్ ఒప్పందాల ద్వారా వచ్చిన పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. “కేసీఆర్ నందినగర్ వస్తే అధికారికంగా 900 మంది పోలీసులను పెట్టారు. అనధికారికంగా ఆ సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుంది. హైదరాబాద్‌లో పట్టపగలే కాల్పులు, దోపిడీ ఘటనలు జరుగుతున్నాయి. యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ కొనసాగుతోంది. నల్లమలసాగర్ విషయంలో తెలంగాణ ప్రయోజనాలను తాకట్టుపెడుతున్నారు. రాష్ట్రానికి నష్టం జరుగుతోంది. సింగరేణి బొగ్గు కుంభకోణం అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పష్టమైన సమాధానం లేదు. సీబీఐ, సిట్టింగ్ జడ్జి విచారణ కోరుతుంటే ఎందుకు వెనక్కిపోతున్నారు? కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శాఖాపరమైన కమిటీ వేసి చేతులు దులిపేసుకున్నారు. ఈ వ్యవహారంలో సృజన్‌రెడ్డి కాల్ డేటా బయటకు తీస్తే అన్నీ బయటకు వస్తాయి. బీఆర్ఎస్ నిలదీస్తుంటే దృష్టి మరల్చేందుకు సిట్‌ల పేరిట విచారణలు చేస్తున్నారు. పైశాచిక ఆనందం కోసం కేసీఆర్‌ను అంతసేపు కూర్చోబెట్టారు. ప్రజలకు ఒక్కొక్కటి అర్థమవుతున్నాయి.

**ఒక్కొక్కటి తేలిపోతున్నాయి...** ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదట్నుంచీ చెబుతున్న అబద్ధాలు ఒక్కొక్కటిగా తేలిపోతున్నాయి. మొదట వ్యాపార వేత్తలు, ఆ తర్వాత సినీ తారలు అన్నారు. ఇప్పుడు ఏమీ లేదని అంటున్నారు. ప్రభుత్వం ఇకనైనా పాలనపై దృష్టి పెట్టాలి. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన ఖర్మ మాకేముందని కేసీఆర్ స్పష్టంగా చెప్పారు. ఇవాళ రేవంత్ రెడ్డికి సమాచారం ఎలా వస్తుందో.. నాడు కేసీఆర్ ప్రభుత్వానికి కూడా అలాగే వచ్చింది. కాంగ్రెస్ పెద్దలు ఇకనైనా అసత్య ప్రచారం మానాలి. సజ్జనార్ జడ్జి కాదు.. ఆయన తీర్పు ఇస్తే ఎలా? అక్రమం అన్నది అభియోగం మాత్రమే.. తేల్చాల్సింది కోర్టులు. బీఆర్ఎస్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఎక్కడికక్కడే జరుగుతుంది. పెద్ద సమావేశాలు, రోడ్ షోలు ఉండవు. మంచి ఫలితాలు సాధిస్తాం.

**60 సార్లు దిల్లీ వెళ్లిన సీఎం సాధించిందేంటి?...** కేంద్ర బడ్జెట్‌లో పేదలు, రైతు కూలీలకు ఉపయోగపడే ఉపాధి హామీని కుదించారు. ఎరువుల రాయితీ, ఆహార రాయితీతో పాటు స్వచ్ఛ భారత్‌కు నిధులు కూడా తగ్గించారు. వ్యాక్సిన్లు, బల్క్ డ్రగ్స్, ఫార్మాకు హైదరాబాద్ కేంద్రం అయితే.. బయో ఫార్మా తయారీకి రూ.పది వేల కోట్లు కేటాయించి తెలంగాణకు రూ.10 కూడా కేటాయించలేదు. దిల్లీకి 60 సార్లు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి సాధించిందేంటి? రెండు పార్టీల నుంచి 8 మంది చొప్పున ఎంపీలు గెలిచినా రాష్ట్రానికి కలిగిన ప్రయోజనం సున్నా. తెలంగాణకు భాజపా ఇచ్చేది ఇదేనా? హై స్పీడ్ రైల్ కారిడార్ కేటాయించామని గొప్పగా చెబుతున్నారు. తెలంగాణ భౌగోళికంగా దేశానికి మధ్యలో ఉంది.. కారిడార్ హైదరాబాద్ మీదుగా వెళ్లక తప్పదు. ప్రత్యేకంగా ఇచ్చినట్లు చెప్పడం హాస్యాస్పదం” అని కేటీఆర్ అన్నారు.

## కేటీఆర్ వ్యాఖ్యలు నియంత్రృత్వం, రాచరికపు పోకడలకు నిదర్శనం: కవిత




హైదరాబాద్, ఫిబ్రవరి 2 : మాజీ మంత్రి కేటీఆర్ టార్గెట్‌గా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శలు చేశారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం మీడియాతో కవిత మాట్లాడారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎవరు నిలబడ్డ కారు గుర్తుపై ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారని ప్రస్తావించారు.

**చెడ్డ వాళ్లకి ఓటు వేయాలా..** చెడ్డ వాళ్లకి ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారా అని ప్రశ్నించారు. కేటీఆర్ మాటలు నియంతృత్వం, రాచరికపు పోకడలకు నిదర్శనమని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో కులం కాదని.. గుణం చూసి ఓటేయాలని పిలుపునిచ్చారు. పైసలు కాదని.. పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. మంచి అభ్యర్థులు ఏ పార్టీ నుంచి పోటీ చేసిన ఓటు వేయాలని కోరారు. తెలంగాణ జాగృతి తరఫున మంచి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తున్నారని కవిత పేర్కొన్నారు.

**రేవంత్‌రెడ్డితో హరీశ్‌రావు కుమ్మక్కు..** రేవంత్‌రెడ్డితో హరీశ్‌రావు కుమ్మక్కు అయి.. నాటకాలాడుతున్నారని కవిత విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఫెయిర్‌గా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై కేసీఆర్‌ని సిట్ విచారణకు పిలిచిందని ప్రస్తావించారు. ఈ కేసులో సిట్ విచారణకు పిలిస్తే ఎవరైనా పోక తప్పదని కవిత స్పష్టం చేశారు.

**బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం..** కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మోదీ సర్కార్ అన్యాయం చేసిందని కవిత విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. గంజాయి ముఠా దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీ ఫీజు సొంతంగా కట్టుకున్నారా..? ప్రభుత్వ సొమ్ముతో కట్టారా అని ప్రశ్నించారు.

రేవంత్‌రెడ్డి ఈ విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి ఎన్ని ఎంఓయూలు చేసుకున్నారని నిలదీశారు. ఫేక్ కంపెనీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకుందని ఆక్షేపించారు. కాంగ్రెస్ ఫేక్ ఎంఓయూలపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. ఫేక్ ఏంఓయూలపై జాగృతి పోరాటం చేస్తుందని కవిత పేర్కొన్నారు.

**ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు అమెరికా తన ప్రయత్నాలను వేగవంతం చేసింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. సంఘర్షణ ముగించే దిశగా పురోగతి సాధిస్తున్నామన్నారు. వైట్‌హౌస్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ , రష్యా అధినేత పుతిన్‌ల గురించి మాట్లాడుతూ.. ‘వారు ఒకరినొకరు ద్వేషించుకుంటున్నారు. ఇది మా ప్రయత్నాలను కష్టతరం చేస్తుంది. కానీ, మేము ఒక పరిష్కారానికి చాలా దగ్గరగా ఉన్నామని భావిస్తున్నా. యుద్ధం ముగింపునకు మంచి అవకాశం ఉందని నేను అనుకుంటున్నా’ అని ట్రంప్ అన్నారు. తీవ్రమైన శీతాకాల పరిస్థితుల వల్ల ఉక్రెయిన్ రాజధాని కీవ్, ఇతర నగరాలపై దాడులను తాత్కాలికంగా ఆపేయాలని పుతిన్‌ను కోరినట్లు ట్రంప్ ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే. దానికి రష్యా అంగీకరించిందని కూడా వెల్లడించారు. ఇదిలాఉండగా.. దాదాపు నాలుగేళ్లుగా కొనసాగుతున్న యుద్ధం ముగించే లక్ష్యంలో భాగంగా రష్యా జెలెన్‌స్కీని మాస్కోకు రావాలని ఆహ్వానించింది. పుతిన్ సహాయకుడు యూరి ఉషాకోవ్ మాట్లాడుతూ.. జెలెన్‌స్కీ సమావేశానికి అంగీకరిస్తే మాస్కోలో ఆయనకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తమ ఆహ్వానాన్ని అంగీకరిస్తే.. ఆయన భద్రతకు రష్యా హామీ ఇస్తుందని అన్నారు.**



# సాగేగుణం గల టంగ్‌స్టన్ ఆవిష్కర్త విలియం డి.కూలిడ్జ్

## - ఫిబ్రవరి 3...విలియం డి.కూలిడ్జ్ వర్ధంతి

విలియం డి.కూలిడ్జ్ ( అక్టోబరు 23 1873 – ఫిబ్రవరి 3 1975 లేది అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త. సాగే గుణం కలిగిన టంగ్‌స్టన్ ఆవిష్కర్త. ఆయన ఎ-కిరణం యంత్రాలపై అనేక ప్రయోగాలు చేశారు. ఆయన జనరల్ ఎలక్ట్రిక్ రీసెర్చ్ లాబొరేటరీకి డైరక్టర్ గా పనిచేశారు, కార్పొరేషన్ కు ఉపాధ్యక్షునిగా కూడా ఉన్నారు. ఆయన "సాగేగుణం గల టంగ్‌స్టన్"ను అభివృద్ధి చేయడంలో ప్రసిద్ధి పొందారు. ఈ టంగ్‌స్టన్ విద్యుత్ బల్బులలో ముఖ్యమైన భాగం. కూలిడ్జ్ మసాచుసెట్స్ యందలి హడ్సన్ సమీపంలోని ప్రదేశంలో జన్మించారు. ఆయన 1891 నుండి 1896 లో మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) లో చేరే వరకు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివారు. లాబొరేటరీ అసిస్టెంట్ గా పనిచేసిన సంవత్సరం తరువాత ఆయన జర్మనీలో ఉన్నత విద్యను అభ్యసించడానికి వెళ్లారు. అక్కడ డాక్టరేట్ను పొందారు. ఆయన 1899 నుండి 1905 వరకు ఎం.ఐ.టి వద్ద రసాయన శాస్త్ర విభాగంలో గల ఆర్థర్ ఎ నోయ్స్ వద్ద రీసెర్చ్ అసిస్టెంట్ గా పని చేశారు.

**సాగే గుణం గల టంగ్‌స్టన్...** కూలిడ్జ్ 1905 లో కొత్త పరిశోధనా ప్రయోగ శాలలో జనరల్ ఎలక్ట్రిక్స్ సంస్థ వద్ద పరిశోధకునిగా పని చేయుటకు వెళ్లారు. అక్కడ ఆయన అనేక ప్రయోగాలను నిర్వహించారు. ఆయన పరిశోధన విద్యుత్ బల్బులలో ఫిలమెంటుగా ఉపయోగించే లోహంగా "టంగ్‌స్టన్" ఉపయోగించుటకు దోహద పడింది. ఆయన టంగ్‌స్టన్ లో సాగేగుణం గలదానిని అభివృద్ధి చేశారు. ఈ పరిశోధన ఫలితంగా విద్యుత్ బల్బులోని ఫిలమెంటును సులువుగా తీగలుగా మలచవచ్చు. దానిని టంగ్‌స్టన్ అక్షైడు ద్వారా శుద్ధి చేయవచ్చు. 1911 మొదట్లో "జనరల్ ఎలక్ట్రిక్" ఈ క్రొత్త రకం ఫిలమెంట్ తో బల్బులను మార్కెట్ లో విడుదల చేసింది. దీని ఫలితంగా ఆ సంస్థకు ముఖ్యమైన ఆదాయ వనరుగా ఈ బల్బుల అమ్మకం దోహద పడింది. ఆయన 1913 లో ఆయన క్రొత్త ఆవిష్కరణకు పేటెంట్ (ఖా.1,082,933) కొరకు దరఖాస్తు చేసి పొందారు. అదే విధంగా 1928 లో యు.ఎస్. లోని కోర్టు తాను తయారుచేసిన 1913 లోని పేటెంట్ విలువైన ఆవిష్కరణగా గుర్తించింది.

**X-కిరణ నాళం అభివృద్ధి...** 1913 లో ఆయన కూలిడ్జ్ నాళాన్ని ఆవిష్కరణ చేసారు. అభివృద్ధి చెందిన కాథోడుతో కూడిన ఎ-కిరణ నాళం అనేక ఎక్స్ - కిరణ యంత్రాలలో ఉపయోగించడం వలన శరీరంలో చాలా అంతర భాగాలలో ఉన్న కాన్సర్ కణతులను కూడా కచ్చితంగా గుర్తించుటకు తోడ్పడింది. ఈ కూలిడ్జ్ నాళంలో



టంగ్‌స్టన్ను ఫిలమెంట్ గా ఉపయోగిస్తారు. ఇలా ఉపయోగించుట వైద్యరంగంలోని రేడియాలజీ విభాగంలో ప్రముఖ అభివృద్ధికి దోహద పడింది. ఈ నాళం సంబంధిత ప్రాథమిక డిసైన్ ను ప్రస్తుతం కూడా ఉపయోగిస్తున్నారు. ఆయన మొట్ట మొదటి భ్రమణం చేసే ఆనోడు X-కిరణ నాళాన్ని ఆవిష్కరణ చేశారు. ఆయన 1913 లో యు.ఎస్. పేటెంట్ కోసం దరఖాస్తు చేసి 1916 లో పొందారు. 1914 లో అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ఆయనను రమ్‌ఫోర్డ్ ప్రైజ్ తో సత్కరించింది. 1927 లో అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ ఎడిసన్ మెడల్ ను పొందారు. ఈ మెడల్ ఆయన ప్రకాశించే విద్యుత్ కాంతి, ఎ-కిరణాలు కళ సేవల" కు పొందారు. 1926 లో హోవార్డ్ ఎన్. పోట్స్ మెడల్, 1927 లో లూయిస్ ఇ.లెవీ మెడల్1939 లో ఫారడే మెడల్, 1944 లో ఫ్రాంక్లిన్ మెడల్ , 1975 లో నేషనల్ ఇన్వెంటర్స్ హాల్ ఆఫ్ ఫేమ్ కు ఎంపిక కాబడినారు. ఈ ఎంపిక ఆయన తన 101 వ సంవత్సరంలో మరణించుటకు కొన్ని రోజుల ముందుగా న్యూయార్క్ లోని షెనెక్టడీలో పొందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# భారీ సైజులో బడ్జెట్...అప్పులు తప్పవా ?



కేంద్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి 53.5 లక్షల కోట్ల రూపాయల అంచనాలతో బడ్జెట్ ని రూపొందించింది. అయితే ఈ ఆర్థిక సంవత్సరం రాబడులు కేంద్ర ఖజానాకు చేరేది చూస్తే మొత్తం రాబడులు 36.5 లక్షల కోట్ల రూపాయలుగా ఉంటాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఇందులో కేంద్ర నికర పన్ను రాబడులు 28.7 లక్షల కోట్ల రూపాయలు వస్తాయని అంచనా వేశారు.

**లోటు ఎంతంటే :** ఇక అంచనా మొత్తానికి రాబడులకు మధ్య 17 లక్షల కోట్ల అంతరం కనిపిస్తోంది. దాంతో ఈ తేడాను ఎలా భర్తీ చేస్తారు అన్న చర్చ అయితే సాగుతోంది. అప్పులు తీసుకుంటారా లేక ఇతర మార్గాలు ఉన్నాయా అన్నది కూడా ఆలోచిస్తున్నారు. ఎందుకంటే 17 లక్షల కోట్లు అంటే దేశంలో నలభై శాతం పైగా రాష్ట్రాల వార్షిక బడ్జెట్ తో సమానంగా ఉంటోంది.


**కేంద్ర మంత్రి ఏమన్నారంటే :** ఇక బడ్జెట్ గురించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, స్థూల మార్కెట్ రుణాలు 17.2 లక్షల కోట్ల రూపాయలుగా ఉంటాయని తెలిపారు. అయితే మొత్తం ఆర్థిక వృద్ధికి మద్దతుగా నిర్మాణాత్మక సంస్కరణలకు పెద్ద ప్రోత్సాహం అందించడానికి ఈ బడ్జెట్ ని రూపొందించామని చెప్పారు. ఈసారి మొత్తం మూలధన వ్యయ కేటాయింపు 12.2 లక్షల కోట్ల రూపాయలుగా గా ఉందని, అది జీడీపీలో 4.4 శాతమని గుర్తు చేశారు. ఇక గత 10 సంవత్సరాలలో ఇదే అత్యధికమని కూడా ఆమె అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన 4.4 శాతం కంటే తక్కువగా, 2026-27లో ద్రవ్యలోటు జీడీపీలో 4.3 శాతంగా ఉంటుందని ప్రభుత్వం ఆశిస్తున్నట్లుగా సీతారామన్ తెలిపారు.

**వృద్ధి రేటు వేగం :** ఈ బడ్జెట్ ద్వారా ప్రభుత్వం వృద్ధి వేగాన్ని కొనసాగించడానికి ఆర్థిక వ్యవస్థకు మార్గాన్ని సుగమం చేస్తూ ప్రోత్సాహాన్ని అందిస్తోందని అన్నారు. ఉత్పాదకత ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి అవసరమైన ఒక వాతావరణాన్ని సృష్టించే లక్ష్యంతో, ప్రధానంగా ప్రభుత్వం నిర్మాణాత్మక సంస్కరణలతో పర్యావరణ వ్యవస్థ ను నిర్మించడంపై కేంద్రం దృష్టి సారిస్తోందని ఆమె అన్నారు. అలాగే 21వ శతాబ్దం పూర్తిగా సాంకేతికతతో నడుస్తోందని, సామాన్యులకు ప్రయోజనం చేకూర్చేలా సాంకేతికతను తీసుకువస్తున్నామని చెప్పారు. ప్రతి నగరానికి సంవత్సరానికి వేయి కోట్ల రూపాయలు ఇస్తున్నామని ప్రధానంగా టైర్ 2 మరియు టైర్ 3 నగరాలపై దృష్టి పెట్టనున్నట్లుగా ఆర్థిక మంత్రి

**వీటి పైనే ఫోకస్ :** ఇక దేశంలో ఎలక్ట్రానిక్ రంగం గురించి కూడా కేంద్రం ఫోకస్ పెడుతోందని అన్నారు. నలభై వేల కోట్ల రూపాయలతో ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీ పథకం భారతదేశం స్వయం సమృద్ధి సాధించడానికి అతి పెద్ద ప్రోత్సాహమని ఆమె చెప్పారు. అలాగే అరుదైన ఖనిజాల కారిడార్ గురించి బడ్జెట్ లో ప్రస్తావించామని గుర్తు చేశారు. భారతదేశం తన సొంత వనరులతో తన అవసరాలను తీర్చగలిగేలా అరుదైన ఖనిజాల కారిడార్లను ఏర్పాటు చేస్తున్నట్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని ఆమె అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఖనిజాలను గుర్తించి వెలికితీయగలిగితే, ఇతర దేశాల వనరులపై భారత్ ఆధారపడటం పూర్తి స్థాయిలో తగ్గుతుందని ఆర్థిక మంత్రి అన్నారు. అరుదైన ఖనిజాల కారిడార్లు భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద మార్పును తీసుకువస్తాయని ఆశాభావం ఆమె వ్యక్తం చేస్తున్నారు.

# నిశ్శబ్ద సేవకులు: భారత ఆరోగ్య వ్యవస్థను మోస్తున్న మహిళా వైద్యులు

## ఫిబ్రవరి 3...జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం




వైద్యం మానవ సమాజంలో అత్యంత విశ్వసనీయమైన సేవా రంగం. ప్రాణాన్ని కాపాడే ఈ వృత్తిలో సేవా దృక్పథం ఎంత ముఖ్యమో, సానుభూతి కూడా అంతే కీలకం. ఆ సానుభూతికి సహజ ప్రతిరూపంగా నిలిచింది మహిళా వైద్యుల పాత్ర. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 3న జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని జరుపుకోవడం వెనుక ఉన్న ఆలోచన కేవలం గౌరవ ప్రదర్శన మాత్రమే కాదు; భారత ఆరోగ్య వ్యవస్థలో మహిళల కృషిని గుర్తించి, వారి సేవలకు సామాజిక గుర్తింపును పెంపొందించడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ రోజు ప్రపంచంలో తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన డాక్టర్ ఎలిజబెత్ బ్లాక్‌వెల్ జన్మదినం కావడం కూడా ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. భారత సమాజంలో మహిళలకు విద్య, వృత్తి స్వేచ్ఛ లభించని కాలంలో వైద్య రంగంలోకి మహిళలు అడుగు పెట్టడం ఒక విప్లవాత్మక పరిణామం. 19వ శతాబ్దం చివర్లో ఆనంది గోపాల్ జోషి, కడంబినీ గంగూలీ వంటి మహిళలు వైద్య విద్యను అభ్యసించడం అప్పటి సామాజిక నిర్మాణానికి పెద్ద సవాలుగా నిలిచింది. అప్పటి నుండి నేటి ఆధునిక వైద్య వ్యవస్థ వరకు మహిళా వైద్యుల ప్రయాణం అనేక పోరాటాలు, త్యాగాలతో నిండి ఉంది. ఈ చారిత్రక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే, మహిళా వైద్యుల దినోత్సవం ఒక స్మరణా దినం మాత్రమే కాదు; ఒక సామాజిక మార్పు ప్రయాణానికి గుర్తుగా నిలుస్తుంది. నేటి భారతదేశ వైద్య రంగంలో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగింది. నేషనల్ మెడికల్ కమిషన్ గణాంకాల ప్రకారం, మెడికల్ అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరుతున్న విద్యార్థుల్లో సుమారు 48 నుంచి 50 శాతం వరకు మహిళలే ఉన్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఈ సంఖ్య 55 శాతానికి మించి ఉంది. ఇది వైద్య విద్యలో మహిళల ఆసక్తి, ప్రతిభ ఎంతగా పెరిగిందో స్పష్టంగా సూచిస్తుంది. కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నివేదికల ప్రకారం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న డాక్టర్లలో మహిళల వాటా గత రెండు దశాబ్దాల్లో దాదాపు రెట్టింపు అయింది. అయితే ఈ సంఖ్యలు ఆశాజనకంగా కనిపించినప్పటికీ, ఉన్నత స్థాయి వైద్య పరిపాలన, నిర్ణయాధికార స్థానాల్లో మహిళల ప్రాతినిధ్యం ఇంకా పరిమితంగానే ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే--5 (చీఖీసూ-5) నివేదికలు భారతదేశ ఆరోగ్య సూచికలలో మహిళా వైద్యుల పాత్ర ఎంత కీలకమో వెల్లడిస్తున్నాయి. మాతృ మరణాల రేటు, శిశు మరణాల రేటు తగ్గుదలలో మహిళా వైద్యులు, నర్సులు, ఆశా కార్యకర్తల సమిష్టి కృషి కీలకంగా నిలిచింది. 2000 సంవత్సరంలో ప్రతి లక్ష ప్రసవాలకు 370గా ఉన్న మాతృ మరణాల రేటు, 2019--21 కాలానికి వచ్చేసరికి 97కి తగ్గడం వెనుక మహిళా వైద్యుల నిరంతర సేవలు ప్రధాన కారణంగా పేర్కొన బడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా వైద్యుల లభ్యత పెరిగిన చోట్ల గర్భిణీ సంరక్షణ మెరుగు పడినట్టు ప్రభుత్వ నివేదికలు స్పష్టంగా సూచిస్తున్నాయి. గ్రామీణ భారతంలో మహిళా వైద్యుల అవసరం మరింత ఎక్కువగా ఉంది. సామాజిక సంప్రదాయాల కారణంగా మహిళలు తమ ఆరోగ్య సమస్యలను పురుష వైద్యులతో పంచుకోవడంలో సంకోచించే సందర్భాలు ఇప్పటికీ ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మహిళా వైద్యులు నమ్మకానికి ప్రతిరూపాలుగా నిలుస్తున్నారు. మాతృ ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, రక్తహీనత నివారణ, బాలికల పోషణ వంటి అంశాల్లో మహిళా వైద్యుల జోక్యం వల్ల ఆరోగ్య అవగాహన గణనీయంగా పెరిగింది. జాతీయ ఆరోగ్య మిషన్ నివేదికలు, మహిళా వైద్యులు ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవల వినియోగం అధికంగా ఉంటుందని స్పష్టం చేస్తున్నాయి. కరోనా మహమ్మారి కాలం మహిళా వైద్యుల సేవలను దేశం మొత్తం ప్రత్యక్షంగా చూసిన సమయం. ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, కోవిడ్ ఫ్రంట్‌లైన్ వర్కర్లలో దాదాపు 60 శాతం వరకు మహిళలే ఉన్నారు. వైద్యులు, నర్సులు, ల్యాబ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు---ఈ సమస్త వ్యవస్థను నిలబెట్టిన ప్రధాన శక్తి మహిళలే. కుటుంబానికి దూరంగా ఉంటూ, సంక్రమణ భయాన్ని లెక్కచేయకుండా, ఆసుపత్రుల్లో విధులు నిర్వర్తించిన మహిళా వైద్యులు నిజమైన సేవా స్ఫూర్తికి ప్రతీకలుగా నిలిచారు. అనేక ప్రభుత్వ నివేదికలు ఈ కాలంలో మహిళా వైద్యులు ఎదుర్కొన్న మానసిక ఒత్తిడి, శారీరక ప్రమాదాలు, కుటుంబ విరహ వేదనలను కూడా ప్రస్తావించాయి. ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం, కోవిడ్ కాలంలో పనిచేసిన మహిళా వైద్యుల్లో సుమారు 35 శాతం మంది తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనయ్యారని, అయినా సేవలో వెనక్కి తగ్గలేదని వెల్లడైంది. ఇది వారి వృత్తి నిబద్ధతకు నిదర్శనం. అయితే మహిళా వైద్యుల ప్రయాణం సవాళ్ల రహితమని చెప్పలేం. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న మహిళా వైద్యులు అనేక నిర్మాణాత్మక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, నీతి ఆయోగ్ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో, పని ప్రదేశాల్లో లింగ వివక్ష, రాత్రి విధుల భద్రత, వృత్తి--కుటుంబ సమతుల్యత వంటి అంశాలు మహిళా వైద్యుల ముందున్న ప్రధాన సవాళ్లుగా పేర్కొనబడ్డాయి. ముఖ్యంగా గర్భధారణ, మాతృత్వ దశలో అనుకూల విధానాలు లేకపోవడం వల్ల కొంతమంది మహిళలు వైద్య వృత్తి నుంచి తాత్కాలికంగా లేదా శాశ్వతంగా తప్పుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ 2022లో విడుదల చేసిన నివేదిక ప్రకారం, మెడికల్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన మహిళల్లో సుమారు 17 నుంచి 20 శాతం మంది వివిధ కారణాలతో యాక్టివ్ ప్రాక్టీస్‌కు దూరమవుతున్నారు. ఇది దేశానికి మానవ వనరుల నష్టంగా మారుతోంది. మహిళా వైద్యుల ప్రాధాన్యం కేవలం వైద్య సేవలకే పరిమితం కాదు. ఆరోగ్య విధానాల రూపకల్పన, ప్రజారోగ్య కార్యక్రమాల అమలు, పరిశోధన రంగాల్లోనూ వారి పాత్ర కీలకమైనది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు చెబుతున్నట్లుగా, మహిళల నాయకత్వం ఉన్న ఆరోగ్య సంస్థలు ప్రజల అవసరాలకు మరింత సున్నితంగా స్పందిస్తాయి. భారత్‌లోనూ జాతీయ ఆరోగ్య మిషన్, మాతృ--శిశు ఆరోగ్య పథకాలు, పోషణ అభియాన్ వంటి కార్యక్రమాల్లో మహిళా వైద్యులు, ప్రజారోగ్య నిపుణులు కీలక నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్నారు. అయినప్పటికీ, మెడికల్ కాలేజీల డీన్‌లు, హాస్పిటల్ డైరెక్టర్లు, పాలసీ మేకింగ్ బోర్డుల్లో మహిళల సంఖ్య ఇంకా తక్కువగానే ఉంది. నేషనల్ మెడికల్ కమిషన్ గణాంకాల ప్రకారం, ఉన్నత పరిపాలనా హోదాల్లో మహిళల వాటా 15 శాతం లోపే ఉండటం గమనార్హం. గ్రామీణ--పట్టణ విభజన కూడా మహిళా వైద్యుల విషయంలో ఒక ముఖ్యమైన అంశం. పట్టణ ప్రాంతాల్లో మహిళా వైద్యుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో వారి లభ్యత ఇంకా తక్కువగా ఉంది. దీనికి కారణాలు అనేకం---భద్రతా లోపాలు, మౌలిక సదుపాయాల కొరత, కుటుంబ సహకారం లేకపోవడం మొదలైనవి. అయినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ సేవలకు మహిళా వైద్యులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, అదనపు భత్యాలు, నివాస సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నాయి. జాతీయ ఆరోగ్య మిషన్ కింద పనిచేస్తున్న అనేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళా వైద్యుల నియామకం వల్ల సేవల నాణ్యత మెరుగుపడినట్లు ప్రభుత్వ ఆడిట్ నివేదికలు పేర్కొంటున్నాయి. వైద్య విద్యలో మహిళల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తులో భారత ఆరోగ్య వ్యవస్థ రూపురేఖలు మారనున్నాయి. సానుభూతి, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమగ్ర దృష్టికోణం మహిళా వైద్యుల బలంగా మారుతున్నాయి. పలు పరిశోధనలు, మహిళా వైద్యులు రోగులతో ఎక్కువ సమయం గడుపుతూ, చికిత్స వివరాలను స్పష్టంగా వివరించడంతో చికిత్స ఫలితాలు మెరుగ్గా ఉంటాయని సూచిస్తున్నాయి. ఇది ఆరోగ్య రంగంలో నాణ్యతాపరమైన మార్పుకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 3న జరుపుకునే జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం ఒక ఆచార కార్యక్రమంగా కాక, ఆత్మపరిశీలన దినంగా మారాల్సిన అవసరం ఉంది. మహిళా వైద్యుల సేవలను గౌరవించడమే కాకుండా, వారు ఎదుర్కొంటున్న సమస్యలకు విధానపరమైన పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, వైద్య సంస్థలు, సమాజం మీద ఉంది. సురక్షిత పని వాతావరణం, సమాన అవకాశాలు, నాయకత్వ స్థాయిల్లో ప్రాతినిధ్యం, కుటుంబానికి అనుకూలమైన విధానాలు అమలు చేసినప్పుడే మహిళా వైద్యుల పూర్తి సామర్థ్యం దేశానికి ఉపయోగ పడుతుంది.ల భారతదేశం ఆరోగ్య సూచికలలో సాధించిన పురోగతి వెనుక మహిళా వైద్యుల శ్రమ అప్రతిహతంగా ఉంది. మాతృమరణాల తగ్గుదల నుంచి శిశు ఆరోగ్య మెరుగుదల వరకు, పోషణ లోపాల నివారణ నుంచి వ్యాధి నిరోధక కార్యక్రమాల విజయాల వరకు---ప్రతి చోటా మహిళల ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. వారి సేవలు లేకుండా 'సర్వసౌఖ్య సమాజం' అనే లక్ష్యం అసంపూర్ణమే. కాబట్టి జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం మనకు ఇచ్చే సందేశం స్పష్టమైనది. వైద్యం అనే సేవా రంగంలో మహిళలు కేవలం భాగస్వాములు కాదు, మార్పుకు దిశానిర్దేశకులు. సేవ, శాస్త్రం, సానుభూతి అనే మూడు మూల్యాల సమ్మేళనమే మహిళా వైద్యురాలు. వారి కృషికి గౌరవం చెల్లించడం అంటే ఆరోగ్యవంతమైన, సమానత్వభరితమైన భారత సమాజ నిర్మాణానికి పునాది వేయడమే.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాల్సిందే !

సోషల్ మీడియా వర్తమాన కాలంలో పదునైన ఆయుధంగా మారుతోంది. క్షణాలలో ప్రపంచంలో ఎక్కడ ఏ విషయం అయినా ఇట్టే తెలిసిపోతోంది. దాని వల్ల మేలు ఎంత ఉందో కత్తికి రెండో వైపు అన్నట్లుగా ఇబ్బందులు కూడా ఉన్నాయి. ఇక సోషల్ మీడియాను వినియోగిస్తూ ప్రభుత్వ ఉద్యోగులు ఆఫీసులలో తమ విధులను సక్రమంగా నెరవేర్చడం లేదు అన్న చర్చ సాగుతోంది. దాంతో పాటుగా నిబద్ధత అంకితభావం, ఏకాగ్రత విధుల విషయంలో తగ్గిపోతున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో దేశంలోనే తొలిసారిగా ఒక రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సరికొత్త నిబంధనలను తీసుకుని రాబోతున్నారు.

**కఠినమైన మార్గదర్శకాలు :** సోషల్ మీడియా వినియోగం మీద బీహార్ రాష్ట్ర ప్రభుత్వం కఠిమైన నిబంధలను అమలు చేయబోతోంది. ఫేస్ బుక్, ఎక్స్, ఇన్స్టాగ్రాం, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికల విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు ఏ విధంగా వ్యవహరించాలి అన్న దాని మీద కీలకమైన గైడ్ లైన్స్ ని రూపొందిచింది. వీటిని తాజాగా కేబినెట్ భేటీలో ఆమోదించింది.

ఈ కొత్త నిబంధనల ప్రకారం చూస్తే కనుక ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా సోషల్ మీడియా ఖాతా తెరవాలీ అంటే కనుక తమ



విభాగాధిపతులకు శాఖాధిపతులకు ముందుగా తెలియ చేయాలి. ఆ మీదట వారి నుంచి తగిన అనుమతి పొందాల్సి ఉంటుంది.

**వాటిని వాడరాదు :** అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగులు తమ వ్యక్తిగత ఖాతాలకు ప్రభుత్వ ఈ మెయిల్ ఐడీలను లేదా ఫోన్ నంబర్లను వాడకూడదు అని నిషేధం విధించింది. అలాగే ఎవరైనా ఫేక్ ఖాతాలను కనుక నిర్వహించినా తెలిసినా చర్యలు కఠినంగా ఉంటాయి.

అందువల్ల వాటిని పూర్తిగా నిషేధించారు. ఉద్యోగులు తమ అధికార హోదాను వాడుకుంటూ ప్రభుత్వం రాజ ముద్రను లోగోలను వాడాలని చూసినా లేదా వ్యక్తిగత పోస్టులకు వాటిని వినియోగించినట్లుగా తెలిసినా చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది.

**ఆ పోస్టులు చేస్తే కనుక :** సామాజిక అశాంతికి దారి తీసేలా సామరస్యత దెబ్బ తీసేలా మతపరమైన కుల పరమైన పోస్టింగులను చేయడం చేస్తే ప్రభుత్వ ఉద్యోగుల మీద సీరియస్ యాక్షన్ ఉంటుందని సదరు గైడ్ లైన్స్ లో పేర్కొన్నారు. అంతే కాదు అశ్లీలానికి సంబంధించిన పోస్టులను ఎవరికైనా షేర్ చేసి పంచుకున్నా కూడా కఠినంగా వ్యవహరిస్తామని బీహార్ ప్రభుత్వం హెచ్చరించింది. అంతే కాదు ప్రభుత్వ ఉద్యోగులు హాజరయ్యే అధికారిక కార్యక్రమాలలో సమావేశాలలో అక్కడ జరిగే కార్యక్రమాల మీద అనుమతి లేకుండా ఫోటోలు తీయడం వీడియోలు తీయడం వాటిని ఆన్ లైన్ లో పోస్టులు చేయడం చేస్తే కనుక కచ్చితంగా యాక్షన్ ఉంటుందని పేర్కొంది. ఇక ఈ కఠినమైన నియమాలు రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసే ఉన్నత స్థాయి నుంచి దిగువ స్థాయి వరకూ అందరికీ ఒక్కలాగానే వర్తిస్తాయని బీహార్ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. మొత్తం మీద ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియాకు ఎంత దూరంగా ఉంటే అంత మేలు అన్న సంకేతాన్ని అయితే నితీష్ కుమార్ సర్కార్ ఇచ్చిన।ట్లుగా చెబుతున్నారు.

# అమెరికాలో వైద్యం.. సామాన్యుడికి అందని 'ఖరీదైన' ద్రాక్ష!

అమెరికా కల అంటే ఒకప్పుడు సుఖమయ జీవనం, ఆర్థిక భద్రత. కానీ నేడు ఆ కల సామాన్యుడికి చేదు నిజంగా మారుతోంది. పెరిగిన అద్దెలు, ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరల కంటే కూడా సగటు అమెరికన్ కుటుంబానికి ఇప్పుడు హెల్త్‌కేర్ బిల్లులే కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

**సబ్సిడీల తొలగింపు: ఒక ఆర్థిక పిడుగు...** అఫోర్డబుల్ కేర్ యాక్ట్ (ఏసీఏ) కింద లభించిన అదనపు సబ్సిడీలు జనవరి 1తో ముగియడం అమెరికా ఆరోగ్య రంగంలో ఒక నిశ్శబ్ద విస్ఫోటనాన్ని సృష్టించింది. గత కొన్నేళ్లుగా మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాలకు రక్షణ కవచంగా ఉన్న ఈ ట్యాక్స్ క్రెడిట్లు కనుమరుగు కావడంతో ఇన్సూరెన్స్ ప్రీమియాలు ఒక్కసారిగా భారమయ్యాయి.



సర్వేలు చెబుతున్నట్లుగా 73 లక్షల మంది బీమా కవరేజ్ కోల్పోయే ప్రమాదం ఉందంటే అది కేవలం ఒక గణాంకం కాదు.. లక్షలాది మంది ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పు.

**రోగం కంటే ఖర్చే భయంకరమా?...** వైద్యం అనేది ప్రాథమిక హక్కుగా ఉండాలి. కానీ అమెరికాలో అది అత్యంత ఖరీదైన 'లగ్జరీ'గా మారుతోంది. ఖర్చుకు భయపడి డాక్టర్‌ను సంప్రదించకపోవడం.. మందులు మానేయడం వంటి చర్యలు ప్రజారోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి. చిన్నప్పుడే నయం చేయాల్సిన సమస్యను ఆర్థిక భారంతో వాయిదా వేస్తే భవిష్యత్తులో అది ప్రాణాంతక వ్యాధిగా మారి దేశం మీద మరింత ఆర్థిక భారాన్ని మోపుతుంది.

**విధానపరమైన మార్పు అత్యవసరం...** కేవలం సబ్సిడీలు పెంచడం మాత్రమే దీనికి శాశ్వత పరిష్కారం కాదు. ఔషధాల ధరలను నియంత్రించడం, ఇన్సూరెన్స్ కంపెనీల గుత్తాధిపత్యాన్ని తగ్గించడం.. పారదర్శకమైన వైద్య ఖర్చుల విధానాన్ని తీసుకురావాల్సిన బాధ్యత పాలకుల మీద ఉంది. 2026 నాటికి పరిస్థితి మరింత దిగజారుతుందన్న నిపుణుల హెచ్చరికలను గమనిస్తే తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టకుంటే అమెరికా ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉంది. ఆర్థిక బలం ఉన్న దేశం కంటే ఆరోగ్యవంతమైన పౌరులు ఉన్న దేశమే నిజమైన సంపన్న దేశం. తన పౌరులకు కనీస వైద్యం కూడా అందించలేని స్థితిలోకి అమెరికా వెళ్లకుండా ఉండాలంటే హెల్త్‌కేర్‌ను కేవలం ఒక వ్యాపారంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలి.

చురకలు

## సంపాదకీయం

### అద్దంలో తన ముఖం చూసుకోలేని పాకిస్థాన్!

బలోచిస్థాన్‌లో అశాంతికి భారతే కారణమంటూ పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలు 'పాత సీసాలో పాత మద్యం' లాంటివే. దశాబ్దాలుగా తన సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పొరుగు దేశంపై వేలెత్తి చూపడం పాక్‌కు అలవాటుగా మారింది. అయితే తాజాగా భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ ఇచ్చిన ఘాటు స్పందన పాకిస్థాన్ ద్వంద్వ నీతిని అంతర్జాతీయ సమాజం ముందు మరోసారి నగ్నంగా నిలబెట్టింది.

**వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించే వ్యూహం...** బలోచిస్థాన్‌లో ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనలు, అక్కడ పాక్ సైన్యం జరిపిన ఆపరేషన్లలో పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం జరగడం ఆ దేశ అంతర్గత సంక్షోభానికి నిదర్శనం. ఆర్థికంగా దివాళా తీసి, రాజకీయ అస్థిరతతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌కు ప్రజల ఆగ్రహం నుంచి తప్పించుకోవడానికి 'భారత్' అనే సాకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. కానీ ప్రతిసారీ నిందలు వేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదని భారత్ స్పష్టం చేసింది.

**అసలు సమస్య ఎక్కడ?...** బలోచిస్థాన్ సంక్షోభానికి కారణం విదేశీ కుట్రలు కాదు.. దశాబ్దాలుగా అక్కడి ప్రజలపై జరుగుతున్న "అణచివేత, క్రూరత్వం, మానవ హక్కుల ఉల్లంఘనలే.. బలోచిస్థాన్ సహజ వనరులతో సమృద్ధిగా ఉన్నప్పటికీ ఆ ప్రాంతం అత్యంత పేదరికంలో మగ్గుతోంది. పాక్ పాలకులు ఆ ప్రాంత అభివృద్ధిని విస్మరించి కేవలం సైనిక బలంతో అణచివేయాలని చూడటం అక్కడి ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. బలవంతపు అదృశ్యాలు, ప్రశ్నించే గొంతులను నొక్కేయడం వంటి చర్యలతో పాక్ పరువు అంతర్జాతీయ వేదికలపై ఇప్పటికే గంగలో కలిసింది.

**భారత్ ఇచ్చిన 'నైతిక' చురక...** "ఆ ప్రాంత ప్రజల దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించడంపై దృష్టి సారించండి" అని భారత్ చెప్పిన మాటలో ఒక గొప్ప దౌత్యపరమైన సూచన ఉంది. ఉగ్రవాదానికి ఆశ్రయమిస్తూ సొంత ప్రజలపై యుద్ధం ప్రకటించే దేశం.. పక్క దేశంపై విమర్శలు చేయడం హాస్యాస్పదం. భారత్ తన ప్రతిస్పందన ద్వారా కేవలం పాక్ ఆరోపణలను ఖండించడమే కాకుండా బలోచిస్థాన్ ప్రజల హక్కుల గురించి ప్రపంచం దృష్టిని ఆకర్షించడంలో విజయం సాధించింది. ఇకనైనా పాకిస్థాన్ తన గతాన్ని వర్తమానాన్ని సమీక్షించుకోవాలి. అబద్ధపు ఆరోపణలతో అంతర్జాతీయ సమాజాన్ని నమ్మించలేమని గ్రహించాలి. సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ శాంతి గురించి మాట్లాడటం పాక్ ద్వంద్వ వైఖరికి పరాకాష్ట. భారత్ ఇచ్చిన ఈ ఘాటు సమాధానం కేవలం ఒక ఖండన మాత్రమే కాదు.. అద్దంలో తనను తాను చూసుకోమని పాకిస్థాన్‌కు ఇచ్చిన గట్టి హెచ్చరిక.

# నిజాం విమోచనోద్యమంలో అజరామర నాయకుడు - ఫిబ్రవరి 3...తమ్మర గణపతి శాస్త్రి జయంతి



తమ్మర గణపతిశాస్త్రి స్వాతంత్ర్య ఉద్యమం, నిజాం విమోచనోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన గొప్ప నేత. సమాజ సేవ, హిందూ ధర్మ పరిరక్షణ, భారతీయ సమైక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గణపతిశాస్త్రి , నిజాం పాలనలో ఉన్న దురాచారాలను ధైర్యంగా ఎదుర్కొని ప్రజలకు మార్గదర్శకత్వం వహించారు. ఆయన జీవిత చరిత్ర, కృషి, పోరాటం గురించి తెలుసుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత. తమ్మర గణపతిశాస్త్రి 1923 ఫిబ్రవరి 3న తమిళనాడు రాష్ట్రంలోని తంజావూరు జిల్లా తిరుప్పంగూర్ గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు త్యాగరాజన్ మరియు మంగళాంబా. వీరి కుటుంబం ధార్మిక చింతనతో కూడిన విద్యావంతుల కుటుంబం. ఆయన తండ్రి నల్లగొండ జిల్లా కోదాడలో పాఠశాలల తనిఖీ అధికారిగా పనిచేశారు. గణపతిశాస్త్రి బావగారు కొమర్రాజు లక్ష్మణరావు, జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య ప్రేరణతో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఈ కుటుంబ నేపథ్యం గణపతిశాస్త్రి గారికి ధైర్యం, సమాజ సేవ అనే ఆలోచనలను కలిగించింది. తమ్మర గణపతిశాస్త్రి తమ ప్రాథమిక విద్యను ఉర్దూ మాధ్యమంలో పూర్తి చేశారు. ఆ తర్వాత సంస్కృతం, తెలుగు భాషలపై లోతైన అధ్యయనం చేశారు. భాషా విద్యలో ప్రావీణ్యం ఆయనను ప్రజలతో సులభంగా కలసిపోయే సామర్థ్యాన్ని కలిగించింది. 1937లో, అప్పుడే 14 ఏళ్ల వయసులో గణపతిశాస్త్రి నాగపూర్‌లో జరిగిన స్వాతంత్ర్య సమరయోధుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో కొమర్రాజు లక్ష్మణరావు మరియు పింగళి వెంకయ్య లాంటి గొప్ప నేతలతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ఆయనలో స్వాతంత్ర్య భావనను మరింత గాఢంగా చేసింది. హైదరాబాద్ నిజాం పాలన హిందువులకు చీకటి రోజులను తీసుకొచ్చింది.

**తపరమైన వివక్ష:** నిజాం పాలనలో హిందువుల పట్ల తీవ్ర వివక్ష జరిగింది. హక్కులను కాలరాయడం, వారి సంపదలను ఆక్రమించడం రోజువారీగా జరిగేది.

**రజాకార్ల దౌర్జన్యం:** నిజాం సేన అయిన రజాకార్లు హిందువుల గ్రామాలను దహనం చేసి, మహిళలను అతి దారుణంగా వేధించేవారు.

**స్వాతంత్ర్యానికి వ్యతిరేకత:**నిజాం భారత సమాఖ్యలో చేరడానికి నిరాకరించి, తన ముస్లిం ఆధారిత రాజ్యాన్ని కొనసాగించాలన్న ఉద్దేశంతో పనిచేశాడు. ఈ పరిస్థితుల్లో, తమ్మర గణపతిశాస్త్రి ఉద్యమానికి ముందడుగు వేశారు.

**నిజాం విమోచనోద్యమంలో గణపతిశాస్త్రి పాత్ర..** ప్రజలను చైతన్యవంతం చేయడం: ఆయన గ్రామాలకి వెళ్లి ప్రజలలో చైతన్యాన్ని రగిలించారు. నిజాం దమనకాండల గురించి వారికి అవగాహన కల్పించారు.

**ఘర్షణలకు నాయకత్వం:** ఆయన రజాకార్ల దాడులకు ధైర్యంగా ప్రతిఘటించి హిందువుల గ్రామాలను రక్షించేందుకు ఉద్యమంలో పాల్గొన్నారు.

**సామాజిక సమానత్వం**: తమ్మర గణపతిశాస్త్రి కులాలకతీతంగా ప్రజలను ఏకతా సూత్రంలో కట్టారు. హిందూ సంస్కృతి పరిరక్షణకు పాటుపడ్డారు.

**జైలుశిక్షలు:** నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన ఉద్యమాల కారణంగా ఆయన అనేక సార్లు జైలుకు వెళ్లారు.

**విజయం – ఆపరేషన్ పోలో..** 1948లో, భారత ప్రభుత్వం ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్‌ను నిజాం చేతులనుంచి విముక్తి చేసింది. ఈ విజయానికి గణపతిశాస్త్రి , ఇతర ఉద్యమ నాయకులు పోరాటం ప్రధాన కారణం.

**గణపతిశాస్త్రి సేవల గుర్తింపు..** 1972 లో భారత రాజధాని న్యూఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా ఆగస్టు 15న ఎర్రకోట వద్ద నాటి ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ చేతుల మీదగా భారత ప్రభుత్వ స్వాతంత్ర్య సేనాని పురస్కారాన్ని, ...రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతి చేతుల మీదుగా..."తామ్ర పత్ర పురస్కారం తో సత్కరించ బడ్డారు గణపతి శాస్త్రి.

చరిత్రలో స్థానం: గణపతిశాస్త్రి చేసిన పోరాటం తెలంగాణ విముక్తి పోరాట చరిత్రలో చిరస్మరణీయమైంది. స్ఫూర్తి ప్రదాత గణపతిశాస్త్రి.. గణపతిశాస్త్రి జీవితం ధైర్యం, సమర్థత, దేశభక్తికి ప్రతీక. ఆయన జీవితం యువతకు స్ఫూర్తి. హిందూ సమాజం ఆయన సేవలను ఎప్పటికీ కృతజ్ఞతతో గుర్తుంచుకుంచుకుంటారు. తమ్మర గణపతిశాస్త్రి జీవితం ఒక సమగ్ర చరిత్ర. దేశప్రేమ, ధర్మనిరతిని ఆయన చూపించిన విధానం ప్రతి భారతీయుడికి మార్గదర్శకంగా నిలుస్తుంది. ఆయన ఉద్యమం తెలంగాణ ప్రజలకు మాత్రమే కాకుండా, భారతదేశానికి ఆదర్శమయిన ఒక అధ్యాయం. నిజాం విమోచనోద్యమంలో ఆయన చేసిన కృషి తరం తరాల పాటు స్ఫూర్తిని ఇస్తూనే ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# సినీ సంగీత సామ్రాజ్య మకుట రహిత "చక్రవర్తి" - ఫిబ్రవరి 3...చక్రవర్తి వర్ధంతి



తెలుగు చలన చిత్ర రంగంలో విడదీయరాని బంధం అనుబంధం కలిగి ఉన్న బహుముఖ ప్రజ్ఞాశాలి సంగీత దర్శకులు చక్రవర్తి. 950కి పైగా చలన చిత్రాలకు సంగీతాన్ని అందించిన చక్రవర్తి తెలుగు చలన చిత్ర రంగములో ప్రముఖ స్వరకర్తగా, 1971 నుంచి 1989 వరకు రంగములో మకుటంలేని మహారాజుగా వెలిగారు. చక్రవర్తి గుంటూరు జిల్లా, తాడికొండ మండలం, పొన్నెకల్లులో 1936 సెప్టెంబరు 8వ తేదీన జన్మించిన చక్రవర్తి అసలు పేరు కొమ్మినేని అప్పారావు. అయన తల్లిదండ్రులు సంగీత జ్ఞాన సంపన్నులు. అలా ఆయనకు సంగీతంపై ఆసక్తికి నేపథ్యం ఉంది. కుమారుని ఉత్సాహంచూసి తండ్రి గుంటూరులో ఉన్న మహావాది వెంకటప్పయ్య శాస్త్రి దగ్గర సంగీతం నేర్పించారు. ఒక పక్క చదువు, మరో పక్క సంగీతాభ్యాసం నిరాటంకం గానే సాగాయి. అయన ఉత్సాహం దాచుకోలేక వినోద్ ఆర్కెస్ట్రా అనే బృందాన్ని ఏర్పాటు చేసి పాటలు, పద్యాలు పాడుతూ ప్రదర్శనలు ఇచ్చేవారు. విజయవాడ ఆల్ ఇండియా రేడియోలో 1954–58ల మధ్య కె.అప్పారావు కంఠం పాటలతో ప్రతిధ్వనించేది. నాటి శ్రోతలకి అతని కంఠం బాగా సుపరిచితమే. అప్పారావు మద్రాసు వచ్చి హెచ్.ఎమ్.వి. వారికి గ్రామఫోను పాటలు పాడటం ప్రారంభించారు. ఒక రికార్డింగులో సంగీత దర్శకులు రాజన్, నాగేంద్రలు అవకాశం ఇప్పించి పాడించారు. బి.విఠలాచార్య ఆపారావుతో తన సినిమా జయ విజయ (1959)లో ఆడాలి ... పెళ్ళాడాలి అనే పాటను పాడించారు. ఆ పాటను చిత్రంలో హాస్యనటుడు బాలకృష్ణ పాడతాడు. ఇదే అప్పారావు సినిమాలలో పాడిన మొదటి పాట. గాయకుడిగా కెరీర్ ప్రారంభించారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. డబ్బింగ్ ఆర్టిస్టుగానూ 500 చిత్రాలకు గాత్రం అందించాడు. నటుడిగా తేనెటీగ, రాజా తదితర చిత్రాల్లో కనిపించారు. డైలీ సీరియల్స్‌లోనూ ఉదాత్తమైన పాత్రలు పోషించారు. కొన్ని చిత్రాలకు పాటలూ రాశారు. ఫలోమా అనే మలయాళ చిత్రం హిందీ డబ్బింగుకి వచ్చింది, దానికి అప్పారావుని సంగీత దర్శకునిగా తీసుకున్నారు. టైటిల్స్‌లో అన్నీ హిందీ పేర్లే ఉన్నాయి, వాటి మధ్య అప్పారావు అనే తెలుగు పేరు ఎందుకని సినిమావారు అతనుకు చెప్పి "చక్రవర్తి"గా వేశారు. అలా చక్రవర్తి అయి పోయారు. ఆ కాలంలో అనువాద చిత్రాలు ఎక్కువగా ఉండేవి, అందులో అప్పారావుకి అవాకాశాలు వచ్చాయి. నాటకాలలో అనుభవం ఉండడం చేత ఆయన సంభాషణలను బాగా చెప్ప గలిగారు. ఇలా అప్పారావు పాటలు పాడడంతో పాటు అనువాద చిత్రాలలో పాత్రలకు గాత్రం అందించటం మొదలు పెట్టారు. కంఠం, చెప్పే విధానం బాగా ఉండడంతో హీరో పాత్రలకు గొంతు దానం చేసే స్థాయికి ఎదిగారు. అలా ఎం.జి.రామచంద్రన్, జయ శంకర్, జెమిని గణేశన్ లకు గాత్రం అందించారు. హాస్యనటులైన నగేష్, కులదైవం రాజగోపాల్ లకూ డబ్బింగ్ చెప్పారు. ముఖ్యంగా నగేష్ కు బాగా డబ్బింగు చెప్పేవారు. అప్పారావు సినిమాలలో 200లకు పైగా పాటలు పాడాతు. కొన్ని కలిసి పాడినవి ఐతే, కొన్ని యుగళ గీతాలు. పరమానందయ్య శిష్యుల కథ (1966)లో ఘంటసాలతో "పరమగురుడు చెప్పిన వాడు పెద్దమనిషి కాదురా" అనే పాటను పాడారు. బంగారు సంకెళ్ళు (1968)లో రాజబాబుకి "తొలగండెహే" అనే తాగుడు పాటని పాడారు. నిలువు దోపిడి (1968)లో ఎన్.టి.రామారావుకు ఒక పద్యం చదివినప్పుడు, నాగార్జున పద్యాలు, శ్లోకాలు చదివినప్పుడు అందరూ మెచ్చుకున్నారు. దర్శకుడు సి.ఎస్.రావు దగ్గర సహాయ దర్శకుడిగా చేరి నిలువు దోపిడి, మళ్ళీపెళ్ళి, కంచుకోట, పెత్తందార్లు సినిమాలకు పని చేశారు. అయితే తమకు ఇష్టమైన సంగీతాన్ని విడిచి పెట్టక పాటలూ పాడేవాడు. శారద చిత్రంతో సినీ రంగంలో స్థిరపడ్డారు. అక్కినేని నాగేశ్వరరావుతో ప్రేమాభిషేకం,ఎన్.టి.రామారావుతో కొండవీటి సింహం వంటి విజయవంతమైన చిత్రాలకు సంగీత దర్శకులుగా వ్యవహరించి 850కు పైగా తెలుగు చిత్రాలకు సంగీతాన్ని అందిచారు. చక్రవర్తి కొన్ని చిత్రాలలో కూడా నటించారు. చివరి సారిగా నిన్నే ప్రేమిస్తా చిత్రంలో సౌందర్య నాన్నగారిగా నటించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల సినిమాలన్నీ కలుపుకుంటే –959 చిత్రాలు. ఆయన 'ట్రాక్' రికార్డు గురించి చెప్పకోవాలంటే – కన్నడ (60), తమిళం (4), మలయాళం (1) –ఒకే ఏడాదిలో 69 చిత్రాలకు సంగీతాన్ని అందించిన పాటల చక్రవర్తి అయన. అప్పారావు సినిమాల్లో 200లకు పైగా పాటలు పాడారు. తెలుగులో సంగీత దర్శకుడిగా 'మూగప్రేమ'తో కెరీర్ ప్రారంభించిన చక్రవర్తి –1997లో 'పెళ్లామా మజాకా' వరకూ సుస్వరాలు అందిస్తూనే ఉన్నారు. అమ్మోరు చిత్రానికి చివరి సారిగా సంగీతాన్ని అందించిన చక్రవర్తి 2002 ఫిబ్రవరి 3న కన్ను మూశారు. ఆస్కార్ అవార్డు పొందిన ఏ.ఆర్.రెహమాన్ చక్రవర్తి శిష్యుడు కావడం విశేషం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# ముద్రణా యంత్ర ఆవిష్కర్త గ్యూటెన్ బర్గ్ - ఫిబ్రవరి 3...జోహన్ గ్యూటెన్ బర్గ్ జయంతి



మానవ చరిత్రలో జరిగిన అనేక ఆవిర్భావాల్లో ప్రజల జీవన సరళినే కాకుండా మనసుల్ని, హృదయాల్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ఒక్క ముద్రణ విధానమే అని చెప్పవచ్చు. ముద్రణా విధానమే లేకుంటే మానవాళి ప్రగతి సాధ్యం అయ్యేది కాదు. జూలియస్ సీజర్ అలెగ్జాండ్రియా నగరాన్ని ముట్టడించినపుడు అక్కడ ఉన్న గ్రంథాలయం కొంత వరకు ధ్వంసం అయినది. క్రీ.శ 390 లో ధియోఫిలస్ అనే క్రైస్తవ మత గురువు ఇక్కడి నుంచి కొన్ని పుస్తకాలను తరలించాడు. క్రీ.శ 642 లో మహమ్మదీయులు ఈ నగరం పై దండెత్తి వచ్చినపుడు కాలిఫ్ ఉమర్ గ్రంథాలయం కాల్చివేయమని సైనికులను ఆజ్ఞాపించాడు. సుమారు 4 లక్షల పుస్తకాలు మానవుని తెలివి తక్కువ తనానికి, ప్రతీకార వాంఛలకు బలైపోయాయి. ప్రాచీన సాహిత్య గ్రంథాలూ, జానపద గాథలూ, తరగని విజ్ఞాన సంపదా వాటిలో నిక్షిప్తంగా ఉండేవి. అవన్నీ రాత, బానిసల, పండితుల చేత చేతితో రాయబడ్డవే. ఒక పెద్ద గ్రంథాలయం నాశనం కావడంతో కళలకు, సాహిత్యానికి, వేదాంత విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించిన అపార జ్ఞాన నిధి తరువాతి తరాలకు శాశ్వతంగా దూరమైంది. కానీ ఇలాంటి దుర్ఘటన ప్రపంచంలో మరెన్నడూ సంభవించ లేదు. లండన్ లోని బ్రిటిష్ మ్యూజియం, వాషింగ్టన్ లైబ్రరీ కాంగ్రెస్, పారిస్ లోని "బిబ్లియోథెక్ నేషనేల్ " సంపూర్ణంగా దగ్ధమైపోయినప్పటికీ, వాటి ప్రతులు ఇతరదేశాల లైబ్రరీల్లో నేడు లభ్యమవుతున్నాయి. కాగితం తయారు చేయటానికీ, ముద్రణ విధానం ప్రవేశ పెట్టడానికీ శ్రీకారం చుట్టింది చైనీయులే, చైనా భాషకు సంబంధించిన సంకేతాలను కొయ్యపై చెక్కి, సక్రమంగా అమర్చి, వాటికి సిరా పూసి కాగితాలపై ఒత్తడంతో వాళ్ళ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. చైనా లిపిలో అక్షరాలుండవు. శబ్దానికి సంబంధించిన మాత్రా కాలాలకు (ంఎశ్రీ–శ్రీఖఎశ్రీవం) సంకేతాలుంటాయి. విడిగా ఉండే అచ్చులతో ముద్రించే విధానం చైనాలో 13 వ శతాబ్దంలోనూ, కొరియాలో 14 వ శతాబ్దంలోనూ ప్రారంభమైంది. అనేక శతాబ్దాలుగా దూర ప్రాచ్య దేశాల్లో బొమ్మలను ముద్రించే పద్ధతి నుంచి ఈ విధానం రూపొందిందని చెప్పవచ్చు. అచ్చుల సహాయంతో అక్షరాలను ముద్రించే విధానం ఈ నేపథ్యంలో ప్రారంభమైంది. ఐరోపాలో కూడా ముద్రణ మొదట్లో బొమ్మలతోనే ప్రారంభమైంది. కొయ్య దిమ్మలతో పటాలను చెక్కే వారు. పశ్చిమ ఐరోపాలో కొందరు కొయ్య లేదా లోహంతో అక్షరాల అచ్చులను తయారుచేసి, ముద్రించటానికి అనుకూలంగా వాటిని పదాలుగానూ, వాక్యాలుగానూ మార్చి ముద్రించాలని ప్రయత్నించారు. దీనికి కావలసిన కాగితం తయారీ అరబ్బుల పుణ్యమా అని చైనా నుంచి ఐరోపా ఖండానికి తీసుకు రాబడి అందరికీ లభ్యంగా ఉండేది. చేతితో రాతల తయారీలు ఆశ్రమాల లోని సన్యాసులకు, మత గురువులకు, చర్చి అధికారులకు, విశ్వ విద్యాలయాల్లో ఆచార్యులకు మాత్రమే అందుబాటులో ఉండేవి. అచ్చుల సహాయంతో అక్షరాలను ముద్రించే విధానం ఈ నేపథ్యంలో ప్రారంభమైనదని చెప్పవచ్చు. ముద్రణ యంత్రం అనేది ఒక అచ్చు వేయవలసిన మాధ్యమం (కాగితం లేదా వస్త్రం) పై ముద్రణ సిరాతో అచ్చు వేసే యంత్రం. జర్మనీలో మెయింజ్ కి చెందిన జోహన్ గ్యూటెన్ బర్గ్ అనేక కొత్త పద్ధతుల ద్వారా 1439లో ముద్రణ విధానానికి మెరుగులు దిద్దాడు. జోహన్స్ గుటెన్‌బర్గ్ (జోహన్నెస్ గెన్స్‌ఫ్లీష్ జుర్ లాడెన్ జుమ్ గుటెన్‌బర్గ్) (1398 – ఫిబ్రవరి 3, 1468) జర్మనీకి చెందిన సంపన్న కుటుంబంలో జన్మించాడు. చిన్నతనంలోనే స్టాన్స్ కొయ్య దిమ్మలతో ముద్రించటం చేర్చుకున్నాడు. అద్దాలకు మెరుగు పెట్టడం, రత్నాలకు సానపెట్టడం కూడా కొన్నాళ్ళూ చేశాడు. ఈ హస్త కళల్లో అనేక కొత్త పద్ధతులను కనిపెట్టాడు. అక్షరాల అచ్చులను విడిగా తయారుచేసి వాటిని పదాలుగా, వాక్యాలుగా కూర్చే ఆలోచన స్ట్రాన్ బర్గ్ లో ఉన్నపుడే ఆయనకు తట్టింది. 50 యేళ్ళ వయసులో తన జన్మస్థానానికి తిరిగి వచ్చి ఆలోచనల్ని ఆచరణలో పెట్టసాగాడు. ఒక్కొక్క అక్షరానికి ఒక అచ్చును తయారుచేసి, వీటి నుంచి ఒకే పరిమాణంలో ఉండే లోహపు అచ్చుల్ని తీర్చి దిద్దాడు. అప్పట్లో చేతితో రాయబడే అక్షరాలు కేవలం అలంకార ప్రాయంగా వున్నాయన్న కారణంతో ముద్రణకు సరిపోయేలా అక్షరాల తీరులో సరిక్రొత్త మార్పులు చేశాడు. అక్షరాలను కచ్చితంగా ఏర్పరిచే అచ్చులను తయారుచేసే సాధనాన్ని కూడా ఆయనే కనుగొన్నాడు. అచ్చులన్నిటికీ ఒకే పరిమాణంలో సిరా పూయటానికి మరో సాధనాన్ని, కావససినంత ఒత్తిడిని మాత్రమే కలగజేసే ఒత్తుడు యంత్రాన్నీ తయారు చేశాకనే అతడు ముద్రణకు పూనుకున్నాడు. వీటి నిర్మాణానికి అయన ఎంతో శ్రమ పడ్డాడు. తొలిసారిగా ఒక పాత జర్మన్ పద్యాన్ని ముద్రించి చూశాడు. ఇది తృప్తి కరంగా వుండటంతో లాటిన్ భాషలో బైబిల్ మొత్తాన్ని ముద్రించటానికి సాహసించాడు. ఒక పేజీకి 42 గీతలు చొప్పున 1282 పేజీలు గల ఆ గ్రంథాన్ని సరైన సదుపాయాలు లేని చిన్న సంస్థ ముద్రించటానికి పూను కోవటం నిజంగా సాహసమే! అనేక సంవత్సరాలు శ్రమించి అతడీ బృహత్కార్యాన్ని 1456 లో పూర్తి చేశాడు. పని పూర్తయ్యే సరికి అతనివద్ద చిల్లిగవ్వ కూడా మిగలలేదు. ఇంత వరకు డబ్బు సమకూరుస్తూ వచ్చిన అతని భాగస్వామి తన వాటా వెంటనే యిచ్చివేయమని పట్టు బట్టాడు. గత్యంతరం లేక ఇంటినీ, వర్క్ షాప్ నీ, ముద్రించిన ప్రతులనూ గ్యూటెన్ బర్గ్ వదిలి వెళ్ళాల్సి వచ్చింది. అతని శేష జీవితం ఎలా గడిచిందో తెలియదు కానీ పదేళ్ళ తరువాత ఓ చర్చి అధికారి తన ఇంట్లో ప్రశాంతంగా జీవితం గడపాలని గ్యూటెన్ బర్గ్ ని ప్రార్థించగా, అతడక్కడే వుండి రెండేళ్ళలో శాశ్వతంగా కన్ను మూశాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# అడ్డంగా నరికినా.. అడ్డే లేదు

కామారెడ్డి : బిచ్కుంద మండలంలోని మాన్యాపూర్, పెద్దదడ్గి, ఎల్లారం, రాజాపూర్, శాంతాపూర్ శివారుల్లోని అటవీ భూముల్లో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. పదుల ఎకరాల్లో అటవీ భూమిని దర్జాగా ఆక్రమిస్తున్నారు. అధికారులు నాటిన జామాయిల్ చెట్లను నరికి మరీ చదును చేస్తున్నారు. అటవీ సిబ్బంది తీయించిన ట్రెంచ్ను సైతం పూడ్చి ఆక్రమణలకు తెగబడుతున్నారు. అధికారులకు ఏర్పడకుండా ఒక్కో చెట్టును నరికి ఒకేసారి సాగుచేస్తున్నారు. అటవీ అధికారులు సైతం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఫలితంగా రహదారి పక్కనే ఉన్న భూమి వందల ఎకరాల్లో అక్రమార్కుల పాలైందని వివరిస్తున్నారు.

**పదుల ఎకరాల్లో ఆక్రమణలు**

మాన్యాపూర్ చెరువు సమీపంలో సుమారు 10 ఎకరాల భూమిని తాజాగా సాగుకు సిద్ధం చేశారు. వాటిలో అధికారులు నాటిన జామాయిల్ చెట్లకు సంబంధించిన వేర్లు, కాండాలు ఇంకా కనిపిస్తున్నాయి. అక్కడి నుంచి 2 కి.మీ దూరంలోని అడవి మధ్యలో కూడా పదుల సంఖ్యల్లో చెట్లను నరికి సుమారు 20 ఎకరాలకు పైగా భూమిని వారం క్రితం చదును చేశారు. అందులో కొంత భూమిని తాజాగా దున్నారు. ఆ ప్రాంతంలో నరికిన చెట్లు కనిపిస్తున్నాయి. మాన్యాపూర్లో 3 సార్లు మొక్కలు నాటినా వాటిని ధ్వంసం చేశారని స్థానిక అధికారులు చెబుతున్నారు. వారిపై కేసులు నమోదు చేశామని చెబుతున్నారు.



నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటే వారు 3 సార్లు ఎలా ధ్వంసం చేయగలరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల ఉదాసీనత కారణంగానే అటవీ భూములు ఆక్రమణల పాలవుతున్నాయని ఆరోపిస్తున్నారు.

**ఇంటి దొంగల సహకారంతోనే..**

అటవీ అధికారుల సహకారంతోనే అక్రమార్కులు చెలరేగిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. మాన్యాపూర్లో ఓ నాయకుడు పలువురి నుంచి డబ్బులు వసూలు చేసి ఓ అధికారికి అప్పజెప్పాడనే ఆరోపణలున్నాయి. గ్రామంలో తాజాగా ఎన్నికైన ఓ ప్రజాప్రతినిధి వద్ద గతంలో రూ.5వేలు తీసుకుని సహకరించాడని.. కానీ మరో వర్గం నేతలు అడ్డుతగలడంతో ఆయన దున్నుకోలేకపోయాడని తెలుస్తోంది.

**ఏకంగా ప్లాంటేషన్ ధ్వంసం**

శాంతాపూర్లో 150 ఎకరాల్లో అధికారులు మొక్కలు నాటారు. వాటిలో సగానికి పైగా మొక్కల్ని పలువురు దుండగులు ధ్వంసం చేశారు. ఘటన జరిగి నెల గడిచినా విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. దీనిపై ఎఫ్డీవో సునీతను వివరణ కోరగా విచారణ నడుస్తోందని, ఇంతకు మించి ఏం చెప్పలేమని సమాధానమిచ్చారు. దీంతో స్థానిక సిబ్బంది సహకారం ఉందేమోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# పల్లెలకు నిధులొచ్చాయోచ్!


ఖమ్మం : సుమారు 22 నెలల ప్రత్యేక అధికారుల పాలన తరువాత గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు కొలువు దీరాయి. కేంద్ర ప్రభుత్వం ఆయా పంచాయతీల బ్యాంకు ఖాతాలకు నేరుగా 15వ ఆర్థిక సంఘం నిధులు జమ చేస్తోంది. వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్న బిల్లులకు దశలవారీగా మోక్షం లభించనుంది. 2023-24 సంవత్సరానికి మొదటి విడతగా రూ.18.64 కోట్లు విడుదలయ్యాయి. గత పాలకవర్గాలు చేసిన పనులకు సంబంధించి ప్రాధాన్య క్రమంలో ప్రస్తుత సర్పంచులు చెల్లించాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

**వేటికి ప్రాధాన్యం?**

పంచాయతీలో మూలనపడిన ట్రాక్టర్లకు మరమ్మతులు చేయించాలి. బ్యాంకులకు వాయిదాలు (ఈఎంఐ) వెంటనే చెల్లించాలి. బకాయిలు చెల్లించక, డీజిల్కు డబ్బులు సర్దుబాటు కాక.. కొన్నాళ్లుగా ట్రాక్టర్లు మూలనపడ్డాయి. తిరిగి వాటిని రోడ్డు ఎక్కించాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. కొందరు మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు డబ్బు సర్దుబాటు చేసి పనులు చేయించారు. అందుకు సంబంధించిన బిల్లులు, డబ్బులు ఎవరికి చెల్లించాలనే వివరాలు ఆన్లైన్లో నమోదై ఉన్నాయి.

**డిజిటల్ చెల్లింపులే..**

కొత్తగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులకు సంయుక్తంగా చెక్



పవర్ అధికారం కల్పించారు. డిజిటల్ సిగ్నేచర్తో డిజిటల్ కీ రూపొందించారు. ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాలు తెరిపించారు. ఖాతాల్లో జమైన 15వ ఆర్థిక సంఘం నిధులు డిజిటల్ పేమెంట్ రూపంలో చెల్లించే అధికారం కల్పించారు. వివాదాలకు తావులేకుండా పెండింగ్ బిల్లులు ప్రాధాన్య క్రమంలో చెల్లించాలని ఆదేశాలిచ్చారు. గ్రామాభివృద్ధి ప్రణాళికల్లోని పనులపై పంచాయతీ సమావేశాల్లో తీర్మానించి అందుబాటులో ఉన్న నిధులతో చేపట్టాలని అధికారులు సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు టైడ్, అన్టైడ్ రూపంలో ఉంటాయి. టైడ్ నిధులు కచ్చితంగా పారిశుద్ధ్యం, తాగునీరు పనులకు మాత్రమే ఖర్చుచేయాలి. అన్టైడ్ నిధులు వీధి దీపాలు, మౌలిక వసతులు వంటి వాటికి వెచ్చించాలి. యు.సి.(యుటిలైజేషన్ సర్టిఫికెట్) తీసుకొని సమర్పించిన తరువాతే మిగతా నిధులు విడుదల చేస్తారు.

**పాత బకాయిలు చెల్లించాలి**రాంబాబు, జిల్లా పంచాయతీ అధికారి

15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ముందుగా పెండింగ్ బిల్లులు, ట్రాక్టర్ల మరమ్మతులు, బ్యాంకుల్లో ఈఎంఐలు చెల్లించాలని సూచించాం. నిధులు సద్వినియోగం చేసుకోవాలి.

# పురం.. స్వచ్ఛత కనం



మోత్కూరు : పురపాలిక అంటే ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించే బాధ్యత గల స్థానిక స్వపరిపాలన సంస్థ. జిల్లాలో భువనగిరి, చౌటుప్పల్, భూదాన్పోచంపల్లి, ఆలేరు, యాదగిరిగుట్ట, మోత్కూరు పురపాలికలున్నాయి. వీటిలో భువనగిరి మాత్రమే పురాతన పురపాలిక కాగా పల్లెలను పట్టణాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో శివారు గ్రామాలను విలీనం చేసి 2018లో మిగతా అయిదు ఏర్పాటు చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్లో పారిశుద్ధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి ప్రోత్సహిస్తున్నా పురపాలికలు ఆశించిన మేరకు ర్యాంకులు సాధించలేకపోతున్నాయి. మోత్కూరు పాత ఊళ్లో, ఆవాస గ్రామాల్లో, కొన్ని వార్డుల చివరి వీధుల్లో పారిశుద్ధ్యం సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను 15 రోజులకు ఒకసారి కూడా సేకరించడం లేదు. మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో ప్రజలు దుర్వాసనను భరించలేకపోతున్నారు. పుర కమిషనర్ సతీశ్కుమార్ను వివరణ కోరగా, అన్ని ప్రాంతాల నుంచి చెత్తను సేకరించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

ఆలేరులో డంపింగ్ యార్డులో కాకుండా రైల్వే ట్రాక్ పక్కనే చెత్త పారబోస్తుండటంతో అటుగా రాకపోకలు సాగించేవారు దుర్వాసన, అపరిశుభ్రతతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించాలని, తడి చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేసి పురపాలికకు ఆదాయం సమకూర్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో పెద్ద మురుగు కాలువ అధ్వానంగా మారింది. శుభ్రం చేయకపోవడంతో స్థానికులు దుర్వాసన, దోమలతో సతమతమవుతున్నారు. పట్టణంలోని బీసీ కాలనీ, కొత్త, పాత గుండ్లపల్లి, పాతగుట్ట, యాదగిరిపల్లి ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక అక్కడక్కడా మురుగు రోడ్లపై పారుతోంది.

చౌటుప్పల్ పురపాలిక పరిధిలోని శివారు గ్రామాలతో కలిపి యాభై వేల మంది నివసిస్తున్నారు. పట్టణంలోని చెరువు వరద, ఇళ్లలోంచి వచ్చే మురుగు ప్రవహించేందుకు సర్వీసు రోడ్డు పక్కన నిర్మించిన డ్రైనేజీ సరిపోక వర్షాకాలంలో రోడ్డు, లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. వలిగొండ రోడ్డులోని కల్వర్టు, నాలా ఇరువైపులా మట్టి నింపడంతో కుచించుకుపోయింది. బంగారుగడ్డలోని మురుగు నాగులకుంటలోకి చేరుతోంది. చెత్త గోల్డెన్ ఫారెస్ట్ భూమిలో పారబోస్తున్నారు.

# వడ్లు బుక్కేసి.. కోట్లు కొట్టేసి



సూర్యాపేట: నల్గొండ, సూర్యాపేటలలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) కోసం కేటాయించిన వడ్లను కొందరు మిల్లర్లు పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారు. వీరిలో దాదాపు తొమ్మిదేళ్ల సీజన్లకు సంబంధించి బియ్యాన్ని ఇప్పటికీ సర్కారుకు అందజేయని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా 2022-23 యాసంగి సీజన్లో భారీ మొత్తంలో ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించారు. పలుమార్లు గడువు ఇచ్చినా మిల్లర్ల నుంచి స్పందన లేకపోవడంతో చివరకు నోటీసులు జారీ చేశారు. కొందరిపై కేసులూ నమోదు చేశారు.


**ఇదీ పరిస్థితి..:** రెండు జిల్లాల్లోని 42 మంది మిల్లర్లు దాదాపు రూ.1,613 కోట్ల విలువైన ఎనిమిది లక్షల టన్నుల వడ్లను మాయం చేశారు. అత్యధికంగా సూర్యాపేట జిల్లాలోని 34 మంది మిల్లర్లు రూ.1,498 కోట్ల విలువ చేసే 7.49 లక్షల టన్నులు, నల్గొండలో రూ.114 కోట్ల విలువైన 57 వేల టన్నుల వడ్లు దారిమళ్లించినట్లు ఆరోపణలున్నాయి. ఇందులో 2022-23 యాసంగికి సంబంధించిందే సింహభాగమని చెప్పొచ్చు. ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం అధికారులు నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోని పలు మిల్లులపై దాడులు నిర్వహించారు. సూర్యాపేట జిల్లాలో రూ.19.32 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం దారిమళ్లించినట్లు గుర్తించారు. వాస్తవానికి రూ.వేల కోట్ల విలువైనవి అమ్ముకున్నారనే విమర్శలున్నాయి. ఇంత పెద్దమొత్తంలో మాయం చేసిన మిల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. సూర్యాపేట జిల్లాలో 2,98,172.092 టన్నుల ధాన్యాన్ని వేలం వేయగా అందులో 62,778.890 టన్నుల ధాన్యానికి సంబంధించి కొందరు అందుకు సమానమైన సొమ్ము, మరికొందరు ధాన్యాన్ని సర్దుబాటు చేసినట్లు సమాచారం. ఇంకా 2,35,393.202 టన్నులు బకాయిపడ్డారు. ఇందులో అత్యధికంగా తిరుమలగిరిలోని సంతోష్ రైస్మిల్లు 27,121.255 టన్నులు, రఘురాం రైస్ మిల్లు 27,870, గడ్డిపల్లిలోని శ్రీసంతోషిమాత రైస్ మిల్లు 21,442.116 టన్నులున్నాయి.

నల్గొండ జిల్లాలో 45 వేల టన్నులను వేలం వేయగా చిట్యాలలోని వరలక్ష్మి మిల్లు 5,053.8 టన్నులు, నల్గొండలోని రామ్లక్ష్మణ్ 7,811, నల్గొండలోని గౌతమీ ఇండస్ట్రీస్ 15,080 టన్నుల ధాన్యం ఇవ్వాల్సి ఉంది. వీరే కాదు మరికొందరూ ఆ జాబితాలో ఉన్నారు. వడ్లను కేటాయించినప్పటి నుంచి క్షేత్రస్థాయిలో వాటి నిల్వలను పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వదిలేయడంతో మిల్లర్లు అమ్మేసుకున్నారు. వీరిపై రెవెన్యూ రికవరీ(ఆర్ఆర్) యాక్ట్ అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండగా.. ధాన్యం మాయం చేసిన మిల్లర్ల విషయంలో పౌరసరఫరాలశాఖ సబ్ కమిటీ చర్యలకు తగు కసరత్తు చేస్తున్నట్లు ఆ శాఖ అధికారి ఒకరు చెప్పారు.

బకాయి పడిన మిల్లర్లకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. 2022-23 యాసంగికి సంబంధించి వేలం వేసిన ధాన్యం అప్పగించని మిల్లర్ల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

మోహన్బాబు, పౌరసరఫరాలశాఖ అధికారి, సూర్యాపేట

# స్థలాల లీజు.. కబ్జానే రివాజు



ఆదిలాబాద్ : ఎక్కడా లేనివిధంగా ఆదిలాబాద్ పురపాలక సంఘానికి విలువైన లీజు స్థలాలున్నాయి. ఆది నుంచి నిర్లక్ష్యం వహించడంతో ఆ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. పురపాలక సంఘం ఏర్పడిన తర్వాత 1952 నుంచి ప్రభుత్వ స్థలాలను లీజుకివ్వడం ప్రారంభించారు. గతంలో 42 స్థలాలు ఉండేవి. ప్రస్తుతం ఆ సంఖ్య 24కి చేరింది. అందులోనూ నాలుగే పుర ఆధీనంలో ఉన్నాయి. కొన్ని జీఓలను లీజుదారులు అనుకూలంగా మలుచుకొని ఒక స్థలంలోనే ఐదారుగురి పేర్ల మీద పట్టాలు తీసుకొని ఆక్రమించుకున్నారు. వాస్తవానికి పురపాలక పరిధిలో పట్టాలివ్వాలంటే కమిషనర్ నిరభ్యంతర పత్రం ఇవ్వాలి. 1998లో అప్పటి రెవెన్యూ అధికారులు ఈ అక్రమ పట్టాలకు తెరలేపారు. ఆ తర్వాత మరికొన్ని జారీ అయ్యాయి. కాకపోతే ఆ స్థలాలు ఇప్పటికీ లీజు స్థలాలుగానే చూపిస్తుండటం విశేషం.

**వసూళ్లపై పట్టింపు లేదు..**

మూడేళ్లకోసారి ఉన్న దానికి 33.33 శాతం పెంచి మళ్లీ లీజుకిస్తున్నట్లు లిఖిత పూర్వకంగా రాసుకోవాలి. అసలు రెండు మూడు దశాబ్దాలుగా లీజు వసూలు లేదు. ప్రస్తుతం బకాయి రూ.కోటిపైనే ఉంటుంది. అధికారులు మారుతున్నా ఈ స్థలాలపై ఎవరూ దృష్టిపెట్టలేదు. విచిత్రమేమిటంటే మూడు లీజు స్థలాల వివరాలు దస్త్రాల్లో ఉన్నా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదట.. నాలుగు స్థలాలు మినహా మిగతావన్నీ ప్రైవేటు వ్యక్తులే తమ గుప్పిట్లో ఉంచుకున్నారు. ఇందులో కొన్నిచోట్ల దుకాణ సముదాయాలు ఏర్పడగా, మరికొన్ని చోట్ల పరిశ్రమలు కొనసాగుతున్నాయి.

పట్టణంలో అత్యంత డిమాండ్ ఉన్న ఖుర్షీదానగర్లో... పట్టణంలో అత్యంత డిమాండ్ ఉన్న భుక్తాపూర్లో 27 గుంటల స్థలం అజిత్సింగ్ సామిల్కు 1969లో లీజుకిచ్చినట్లు పుర దస్త్రాల్లో ఉంది. ఈ స్థలానికి రెవెన్యూ అధికారులు పట్టాలివ్వగా రద్దు కోసం లేఖలు రాశారు. అనంతరం పుర అధికారుల ఉదాసీనతతో స్థలం ఆయన పరమైంది. రికార్డులో లీజు పేరిట ఉన్నా ఇక్కడ ఆ కాగితాలేమీ లేకపోవడం విశేషం.. నేతాజీచౌక్ దగ్గరలో ఉన్న దుకాణాల సముదాయమిది. 138 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలం 1972లో పరమేశ్వర్ అనే వ్యక్తికి లీజుకిచ్చినట్లు పుర దస్త్రాల్లో ఉంది. రెవెన్యూ అధికారులు పట్టాలివ్వడంతో అక్కడ దుకాణాలు వెలిశాయి.

**అమ్మితే రూ. కోట్లలో ఆదాయం**

ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న స్థలాలు విక్రయిస్తే దాదాపు రూ.200 కోట్లకుపైగానే ఆదాయం సమకూరుతుంది.. పుర స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు దశాబ్దాలుగా ఆక్రమణలో ఉన్నా.. వారికి పట్టాలివ్వడానికి వీల్లేదు. ఈ విషయమై పట్టణ ప్రణాళిక అధికారి సుమలతను సంప్రదించగా.. లీజు స్థలాలపై ప్రత్యేక దృష్టిపెట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

# గెలుపు గుర్రాల కోసం వేట

భూపాలపల్లి: ఎన్నికల షెడ్యూల్ రావడంతో.. భూపాలపల్లి పట్టణంలో ఎన్నికల సందడి మొదలైంది. ప్రధాన పార్టీల నేతలు ఎన్నికలను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. ఎలాగైనా భూపాలపల్లి పుర పీఠాన్ని చేజిక్కించుకోవాలని వ్యూహ, ప్రతి వ్యూహాలు రచిస్తున్నారు. గత 15 రోజుల నుంచే ప్రధాన పార్టీలు కాంగ్రెస్, భారాస, భాజపా అభ్యర్థుల ఎంపిక కోసం ముమ్మరంగా కసరత్తు ప్రారంభించాయి. అయితే గెలుపు గుర్రాల కోసం ప్రత్యేకంగా కాంగ్రెస్, భారాస పార్టీల ముఖ్య నేతలు సర్వేలు సైతం చేయించారు. ఈ క్రమంలో ఎవరు గెలుస్తారన్న కోణంలో అభ్యర్థులను గుర్తించే పనిలో రెండు ప్రధాన పార్టీల నాయకులు నిమగ్నమయ్యారు. కొన్ని వార్డుల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి ఇద్దరు నుంచి ముగ్గురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో వారిని పిలిపించి, బరిలో ఒక్కరే ఉండేలా దృష్టి సారిస్తున్నారు. మరికొందరు కోరుకున్న వార్డు నుంచి పోటీ చేసేందుకు అవకాశం రాకపోతే ఇతర పార్టీల నుంచే కాకుండా స్వతంత్రులుగా పోటీ చేయాలనే నిర్ణయంతో ఉన్నారు.

**అభివృద్ధి పనులతో ముందుకు..**

భూపాలపల్లి ఎమ్మెల్యే జీఎస్సార్ ఆధ్వర్యంలో మంత్రులు సీతక్క, పొంగులేటి, తుమ్మల నాగేశ్వరరావు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తూ, సమావేశాలు నిర్వహించి మొత్తం 30 వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని చూస్తున్నారు. కాంగ్రెస్ నుంచి పోటీకి ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. అయితే అధికార పార్టీతో సీపీఐ, సీపీఎం పార్టీలు పొత్తు కోసం ప్రయత్నిస్తుండగా.. సీపీఐకి 5 వార్డులు, సీపీఎంకు ఒక వార్డు కేటాయించాలని వామపక్ష నాయకులు కోరుతున్నట్లు సమాచారం. సీపీఐ అడుగుతున్న వార్డుల్లో గత కొద్దినెలలుగా కాంగ్రెస్ నుంచి పోటీ చేయడానికి ప్రయత్నిస్తున్న ఆశావహుల్లో కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. పొత్తుల్లో భాగంగా కేటాయించిన వామపక్ష పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తారా? లేదంటే ప్రతిపక్ష పార్టీలకు పరోక్షంగా మద్దతిస్తారా? అనే చర్చ కూడా జోరుగా సాగుతోంది.

**బస్తీబాట పేరుతో ప్రజల్లోకి..**

భారాస అభ్యర్థుల గెలుపు కోసం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బస్తీబాట పేరుతో 15 రోజులుగా పలు వార్డుల్లో పర్యటిస్తున్నారు. కాలనీలోని సమస్యలు తెలుసుకుంటున్నారు. భారాస బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. భాజపా నేతలు సైతం వారికి పట్టున్న వార్డుల్లో పోటీకి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. టీఆర్పీ నుంచి ఈ ఎన్నికల్లో కొందరు అభ్యర్థులు పోటీ చేయడానికి సిద్ధమైనట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఎందుకంటే ప్రధాన పార్టీల నుంచి అవకాశం లభించని అభ్యర్థులు కొందరు టీఆర్పీ నుంచి బరిలో నిలిచేందుకు మంతనాలు సాగిస్తున్నారు. ఏది ఏమైనా ప్రధాన రెండు పార్టీల నేతలు గెలుపు అవకాశాలు ఎవరికి ఉంటాయో, వారికే అవకాశం ఇవ్వాలనే దిశగా వ్యూహరచన చేస్తున్నారు.

# మరో ముందడుగు..

వరంగల్: వరంగల్ నగర శివారులోని మామునూరులో విమానాశ్రయం నిర్మాణం కోసం చేపడుతున్న చర్యల్లో మరో ముందడుగు పడింది. 20 ఏళ్లుగా ఓరుగల్లు ప్రజలను ఊరిస్తూ వచ్చిన అంశానికి ప్రాధాన్యమిచ్చిన సీఎం రేవంత్రెడ్డి.. కేంద్రంతో సంప్రదింపులు జరిపి అనుమతులు సాధించటం తెలిసిందే. విమానాశ్రయం ఏర్పాటు చేయాల్సింది కేంద్ర ప్రభుత్వమే అయినా అవసరమైన భూమిని సేకరించి అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోకి వస్తుంది. ఈ క్రమంలోనే ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు కోరిన మేరకు 253 ఎకరాలను సిద్ధం చేసి అప్పగించే కీలక ఘట్టం గురువారం పూర్తయ్యింది. ఇందులో 220.27 ఎకరాలు పట్టా భూమిని కొనుగోలు చేయగా, మిగతాది ప్రభుత్వం వద్ద ఉన్నదే ఇచ్చారు. కొనుగోలు చేసిన భూమికి పరిహారంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్లు చెల్లించింది. త్వరగా నిధులు విడుదల చేయటం ఒకెత్తయితే.. అధికారులు చొరవ చూపి భూములు ఇవ్వటానికి రైతులను ఒప్పించటంతో తక్కువ సమయంలోనే ప్రక్రియ పూర్తయ్యింది. భూసేకరణకు రెండేళ్లయినా పడుతుందని అందరూ అనుకోగా కేవలం 8 నెలల్లో పరిహారం చెల్లింపులు కూడా పూర్తి చేసిన అధికారులను రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు.



**ఓరుగల్లు పురోభివృద్ధికి దోహదం**

విమానాశ్రయం ఏర్పాటు అంశం ఒక్కో దశను దాటుతూ ముందుకు కదులుతోంది. ఇప్పటికే ఓరుగల్లు రింగు రోడ్డు ప్రాజెక్టుల విషయంలో కదలిక వచ్చింది. ఉత్తర తెలంగాణలో పెద్ద నగరంగా ఉన్న ఈ ప్రాంతంలో విమాన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకొస్తే.. రవాణా రంగం పురోభివృద్ధిని సాధించటానికి దోహదం చేయనుంది. శివారుల్లో భూముల ధరలు పెరగటం.. ఆయా మార్గాల్లో వ్యాపార సంస్థలు విస్తరించటం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. వాణిజ్యపరంగా వరంగల్ వృద్ధి చెందుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# పుట్టుకతోనే ప్రోత్సాహం

కామారెడ్డి : ఆడబిడ్డలను ఆదరించేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా జిల్లాలో బేటీ జన్మోత్సవ్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఆడపిల్లలను రక్షిద్దాం.. చదివిద్దాం అంటూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఈ నెల 24న ప్రారంభించారు. జిల్లా అంతటా అమలుకు వేస్తున్న అడుగులపై కథనం.

ఎవరెవరికి ఇస్తారంటే..దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న నిరుపేదలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆడబిడ్డలకు జన్మనిస్తే ఈ బేబీ జన్మోత్సవ్ కిట్లను, పండ్లను అందజేస్తున్నారు. జిల్లాకేంద్రంలోని బోధనాసుపత్రిలో ఇప్పటికే ఆడబిడ్డలకు జన్మనిచ్చిన 25 కుటుంబాలకు వీటిని పంపిణీ చేశారు. బాన్సువాడ, ఎల్లారెడ్డి, పిట్లం తదితర ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అందజేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఏమేం వస్తువులు ఉంటాయంటే..

బేబీ జన్మోత్సవ్ కిట్లో టవెల, డ్రెస్సు(రెండు), సబ్బులు(రెండు), పౌడర్, ఆయిల్(100 గ్రాములు), షాంపూ, డెటాల్ లిక్విడ్, బాడీ లోషన్(100 మి.లీలు), బేబీ వైపర్స్, డైపర్స్ వస్తువులు అందిస్తారు.ఆడబిడ్డలను చదవనివ్వాలి- ప్రమీల, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారిణి లింగ వివక్ష పెరిగిపోతున్న క్రమంలో ఆడబిడ్డలను బతికించాలనే సదుద్దేశంతో జిల్లా కలెక్టర్ ఆశిష్సాంగ్వాన్ చొరవతో బేటీ జన్మోత్సవ్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఆడ బిడ్డలను పుట్టనివ్వడమే కాకుండా వారిని చదవనివ్వాలి. తద్వారా వారి ఉన్నతికి అనేక అవకాశాలున్నాయి.

చురకలు




## పుర సమరంలో యువ మంత్రం

జగిత్యాల : పురపాలక ఎన్నికల వేళ అన్ని పార్టీలు యువత పైనే దృష్టి కేంద్రీకరించాయి. ఒక్క ఓటు కూడా అభ్యర్థుల తలరాతలను తారుమారు చేసే అవకాశం ఉండటంతో యువ ఓటర్లను మచ్చిక చేసుకోవడానికి వ్యూహాలు పన్నుతున్నాయి. మరోవైపు ప్రచారం నుంచి పోలింగ్ వరకు అన్ని పార్టీల్లో యువత పాత్ర కీలకంగా మారనుంది. ఇటీవలి పంచాయతీ ఎన్నికల్లో విజేతల్లో యువత సంఖ్యనే అత్యధికంగా ఉండగా బల్దియా బరిలోనూ వారికే పెద్దపీట వేసే అవకాశముంది.

**45 శాతం మంది 40 ఏళ్లలోపు వారే..**

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాల్లోని మొత్తం ఓటర్లలో 18 నుంచి 39 ఏళ్ల వయసున్న వారు 45.50 శాతం మంది. వృద్ధులు, మధ్య వయసు ఓటర్ల ఆలోచనలు చాలా వరకు స్థిరంగా ఉన్నా యువత ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం మొదలు పార్టీల తరపున ప్రచారం చేయడం, అభ్యర్థులుగానూ యువతనే అధికంగా ఉండనుండటంతో ఎన్నికల్లో వీరి పాత్ర కీలకం కానుంది.

పట్టణ ప్రాంత ఓటర్లలో ఎక్కువ మంది అక్షరాస్యులైన యువత ఉండటంతో సామాజిక మాధ్యమాల ద్వారా ఓటరు చైతన్యం, ఓటు



నమోదు, పోలింగ్, పార్టీల వైఖరి తదితర అంశాలపై పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. వ్యక్తిగతంగా, గ్రూపుల్లో సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే యువత పార్టీలకు ప్రచారంలోనూ ముందుంటున్నారు. ఎన్నికల్లో యువ ఓటర్లను ఆకట్టుకోవడంపై అన్ని పార్టీల నాయకులు దృష్టి సారించారు. పుర ఎన్నికల్లో జిల్లాలో యువ మార్కు కనిపించనుండగా గెలిచిన వారు యువతకు స్వయం ఉపాధి మార్గాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

యువతకు ఆట స్థలాలు, స్వయం ఉపాధి కల్పన, వ్యాయామశాలలు, గ్రంథాలయాల ఏర్పాటు, ఉద్యోగ శిక్షణ కేంద్రాలు, వ్యక్తిగత రుణాలు, యువజన సంఘాలకు రాయితీపై రుణాల మంజూరు తదితర ప్రయత్నాలతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

## వనం నుంచి జనంలోకి..

కరీంనగర్ : భారీ పోలీసుల బందోబస్తు.. ఒగ్గుడోలు కళాశాల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలతో గురువారం సమ్మక్క గద్దెపై కొలువుదీరారు. టపాసుల మోతలతో అశేష భక్తుల మధ్య వనంలోంచి ఊరేగింపుగా గిరిజన పూజారులు సమ్మక్కను తీసుకొచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. కరీంనగర్లో మినీ మేడారంగా పేరొందించిన రేకుర్తి సమ్మక్క-సారలమ్మలు గద్దెలపై కొలువుదీరడంతో జాతర ప్రాంగణమంతా భక్తిపారవశ్యంతో మునిగిపోయింది. సమ్మక్క-సారలమ్మలు గద్దెలపై కొలువుదీరి శుక్రవారం భక్తులకు దర్శనమివ్వనున్నారు. సమ్మక్కను ఎరుకలిగుట్ట నుంచి తీసుకొస్తుండగా రోప్ పార్టీ అప్రమత్తంగా ఉన్నా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో తోపులాట



జరిగింది. వాలంటీర్లు భక్తులతో దురుసుగా ప్రవర్తించడంతో కొన్ని ప్రాంతాల్లో వాగ్వాదం జరిగింది. సమ్మక్క-సారలమ్మలను మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కులు చెల్లించుకున్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో సుడా ఛైర్మన్ నరేందర్రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అర్బన్ అధ్యక్షుడు అంజన్కుమార్, జాతర ఛైర్మన్ శ్రీనివాస్, ఈవో మారుతి తదితరులు పాల్గొన్నారు. చింతకుంటలోనూ సమ్మక్కను గద్దెపై ప్రతిష్ఠించారు.

## ఆధార్ సేవలు పాఠశాలల వద్దకే..

నేలకొండపల్లి : జిల్లా వ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు ఆధార్ సంబంధిత సేవల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించింది. హైదరాబాద్కు చెందిన బాట్రోనిక్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఈ సేవలందించనుంది. మొత్తంగా 21 మండలాల్లో 36మంది సంస్థకు సంబంధించిన ఆపరేటర్లను నియమిస్తూ విద్యాశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. మూడు రోజుల క్రితమే పూర్తి స్థాయిలో ఆపరేటర్లను నియమించింది. ఆయా పాఠశాలల్లో ఏజెన్సీ నిర్వాహకులు.. విద్యార్థుల ఆధార్ నమోదు, నవీకరణ వంటివి చేపట్టనున్నారు. ఏ సేవకు ఎంత రుసుము వసూలు చేయాలో డీఈవో చైతన్యజైనీ ఉత్తర్వుల్లో ప్రస్తావించారు.

రుసుములు ఇలా...

0-5 వయసు పిల్లల నూతన ఆధార్ నమోదు- ఉచితం
అయిదేళ్లు దాటిన పిల్లల నమోదు- ఉచితం
తప్పనిసరి వేలిముద్రల నవీకరణ- ఉచితం
రెండోసారి వేలిముద్రల నవీకరణ (17 ఏళ్లు దాటిన వారికి)- రూ.125
ఆధార్లో వివరాల నవీకరణకు రూ.75
చిరునామా, గుర్తింపు వివరాల డాక్యుమెంట్ అప్డేట్- రూ.75
ఆధార్ సెర్చ్, కేవైసీ, ఏ4 పేపరుపై కలర్ ప్రింట్- రూ.40.

# కట్టిందే కట్టి.. రూ.కోట్లు కొల్లగొట్టి.. అభివృద్ధి పనుల పేరుతో అధికారుల చేతివాటం



హైదరాబాద్: వారి లక్ష్యం .. ప్రజలు ఎదుర్కొనే సమస్య ఎప్పటికీ పరిష్కారం కాకూడదు. కానీ పరిష్కారం అవుతున్నట్లు ప్రజలను ఎప్పటికప్పుడు బలంగా నమ్మిస్తుంటారు. ప్రజాధనాన్ని వృథా చేయడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీలో పనిచేస్తోన్న పలువురు అవినీతి ఇంజినీర్ల స్వ'రూప'మిది. ఇష్టానుసారం ఒకే పనులు మళ్లీమళ్లీ చేపట్టడం.. రూ.కోట్లు దోచేయడమే వారి లక్ష్యం.

నిధుల దుర్వినియోగం ఇలా.. 2022లో సికింద్రాబాద్ సంగీత్ జంక్షన్లో రూ.2.92 కోట్లతో కాలిబాటను విస్తరించి గ్రానైట్ రాళ్లతో కాలిబాటపై అరుగులు నిర్మించారు. మరో రూ.కోటి ఖర్చు పెట్టి.. విద్యుద్దీపాలంకరణ, రంగులద్దడం చేశారు. తాజాగా అరుగులను తొలగించి, కాలిబాట వెడల్పును సగానికి తగ్గించడంతో ఆ ప్రాంతం చెత్తకుప్పలా మారింది. జంక్షన్ అభివృద్ధిపై గత పదేళ్లలో రూ.14 కోట్ల మేర ఖర్చు పెట్టారని, ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణమైన 40 గజాల రైల్వే శాఖ భవనాన్ని తొలగించలేకపోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఖైరతాబాద్ కూడలిని 2022లో రూ.2 కోట్లతో అభివృద్ధి చేశారు. 2024లో రూ.50 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. ఉక్కు దిమ్మెలు, గొలుసులు, జంట జలాశయాల ప్రతిబింబాన్ని ఏర్పాటు చేసి మొక్కలు నాటగా ఫ్లెక్సీ బోర్డులతోసహా పనులన్నీ దెబ్బతిన్నాయి.

తెలంగాణ తల్లి పైవంతెన మరమ్మతులపై ఐదేళ్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న ఇంజినీర్లు.. గడిచిన రెండేళ్లలో.. రెండుసార్లు రంగులద్దారు. గత సర్కారు హయాంలో రూ.కోటి ఖర్చు పెట్టి పక్కనున్న బీఆర్కే భవనం కూడలిలో రోడ్డును మూసేయగా, అప్పుడు నిర్మించిన వంతెన రెయిలింగ్ను ఇటీవల మళ్లీ కూల్చారు. ఫ్రీలెఫ్ట్ రోడ్డును పునరుద్ధరించారు రూ.60 లక్షలతో 2022లో ఆలుగడ్డ బావి కూడలిలో అభివృద్ధి చేసిన ఫౌంటెయిన్ ఇప్పుడు చెత్తకుప్పలా మారింది. మళ్లీ అభివృద్ధి చేస్తున్నారుకేబీఆర్ పార్కు చుట్టూ 2022, 2023లో రెండుసార్లు సైక్లింగ్ ట్రాక్ నిర్మించి నెలరోజుల్లోనే మూసేశారు.

## మాయగాళ్ల చేతికి.. మీ ఆదాయం, అప్పుల చిట్టా



హైదరాబాద్: ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్.. కొరియర్ పార్శిల్.. డిజిటల్ అరెస్ట్లంటూ సైబర్ నేరస్థులు బ్యాంకు ఖాతాల్లో డబ్బున్న వారినే ఎలా ఎంపిక చేసుకుంటున్నారు.. అంటూ లోతుగా దర్యాప్తు చేపట్టిన నగర పోలీసులు కొత్తకోణం గుర్తించారు. సైబర్ నేరగాళ్లు బ్యాంకుల్లో కాసులకు కక్కుర్తిపడే మేనేజర్లు, సిబ్బందిని ఏజెంట్లుగా మార్చుకుంటున్నారు. వారి ద్వారా ఖాతాదారుల కస్టమర్ ఐడెంటెఫికేషన్ ఫైల్ (సీఐఎఫ్) నంబర్లు సేకరిస్తున్నారు. బ్యాంకుల్లో వారి నగదు లావాదేవీలు, రుణాలు, ఫిక్స్డ్ డిపాజిట్లు వంటి వివరాలను రాబట్టి డిజిటల్ అరెస్ట్తో విశ్రాంత ఉద్యోగులు, వయోధికులను మోసగిస్తున్నట్టు అంచనాకు వస్తున్నారు.

**థర్డ్ పార్టీ ద్వారా..**

సీఐఎఫ్ నంబరు 11 అంకెల్లో ఉంటుంది. ఇది బ్యాంకు ఖాతాలు, వ్యక్తిగత రుణాలు వంటి ఆర్థిక అంశాలను లింక్ చేసే నంబరు. ఖాతాదారుల వేర్వేరు బ్యాంకు ఖాతాలను ఒకేచోట గుర్తించేందుకు దీన్ని కేటాయిస్తున్నారు. బ్యాంకు అధీకృత ఏజెంట్లు, క్రెడిట్కార్డు, బీమా సంస్థలు, బ్యాంకుల సాఫ్ట్వేర్ నిర్వహించే ఐటీ కంపెనీలు వంటి థర్డ్పార్టీలకు బ్యాంకు ఖాతాదారుల సీఐఎఫ్ నంబర్లు ఇస్తారు. ఈ సమాచారాన్ని కొందరు.. సైబర్ నేరస్థులకు విక్రయిస్తున్నట్టు అనుమానిస్తున్నామని ఓ పోలీసు అధికారి తెలిపారు.

**రూ.కోట్లకు గురిపెట్టి.. కొడితే** "మీ పేరుతో సిమ్కార్డు ఉపయోగించి మానవ అక్రమ రవాణాకు పాల్పడ్డారు. విదేశాల నుంచి రూ.కోట్లు మీ బ్యాంకుఖాతాలో జమచేసిన ట్టు ఆధారాలు లభించాయి. కేసు దర్యాప్తు పూర్తయ్యేవరకు మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేస్తున్నాం. మా అనుమతి లేకుండా బయటకు వెళ్లకూడ' దంటూ సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ అధికారులమంటూ బెదిరింపులకు పాల్పడుతూ రూ.కోట్లు కాజేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్లో నివాసం ఉంటున్న ఏపీ ఎమ్మెల్యే(61)ను ఇదే తరహాలో భయపెట్టి రూ.1.07కోట్లు కొట్టేశారు. దశాబ్దాల పాటు వ్యాపారం చేసి విశ్రాంతి తీసుకుంటున్న వృద్ధుడి(81)ని ఇలాగే భయపెట్టి రూ.7కోట్లు లాగారు. వారం తర్వాత కుమారులకు విషయం తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## వాహన కాంతి.. చోదకుల దిగ్భ్రాంతి



నీలగిరి : లారీలు, కార్లు, ఆటోలు సైతం ఎల్ఈడీ, హైబీమ్ లైట్లు వాడటంతో రాత్రి సమయాల్లో పట్టణంలో, ప్రధాన రోడ్ల వెంట చిన్న పెద్ద వాహనాలు తిరగలేని పరిస్థితి నెలకొంది. సాయంత్రం, తెల్లవారుజామున పాలు తెచ్చేందుకు ఇబ్బంది పడుతున్నామని నల్గొండ ప్రాంతానికి పాల వ్యాపారి యాదయ్య తెలిపారు. ఈ సమస్య ఆయన ఒక్కరిదే కాదు. రాత్రి రోడ్డుపై వాహనం నడిపే ప్రతి ఒక్కరు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రోడ్లపై రాత్రి జరుగుతున్న ప్రమాదాల్లో అత్యధికంగా హెడ్లైట్ల సమస్యతోనే జరుగుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. అనుమతించిన దానికన్నా అధికంగా ఒక్కో వాహనానికి ఆరు నుంచి ఎనిమిది లైట్లు బిగిస్తున్నారు.

**మోటారువాహన చట్టం ప్రకారం..**

గరిష్ఠంగా 70 వాట్లు మించిన ఫోకస్ లైట్లు వాడకూడదని నిబంధన ఉన్నా.. వాహనదారులు పోలీసులు, ప్రభుత్వ వాహనాలు అత్యధికంగా వెలుగులు ఇచ్చే హైబీమ్ లైట్లను వాడుతున్నారు. రాత్రి ఎదురుగా వచ్చే వాహన దారులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రాణాలకు ప్రమాదమే. హైబీమ్, ఎల్ఈడీ లైట్లు వాడితే ఆర్టీఏ చట్టప్రకారం రూ.500 నుంచి రూ.1500 వరకు జరిమానా విధించాలని సుప్రీంకోర్టు సూచించినా ఆర్టీవో అధికారులకు, పోలీసులకు పట్టడం లేదన్న ఆరోపణలున్నాయి.

**ఏప్రిల్ నుంచి..**

రాత్రి వేళ ప్రయాణ భద్రతను పెంచేందుకు దేశవ్యాప్తంగా వచ్చే ఏప్రిల్ 2026 నుంచి అడాప్టివ్ హెడ్లైట్లను వాహనం తయారు చేస్తున్న సమయంలో తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. నిషేధిత హెడ్లైట్లు వాడటంతో జరుగుతున్న ప్రమాదాలను నివారణకు ఈ చర్యలు చేపట్టింది. **జరిమానా విధిస్తున్నాం-లావణ్య, ఆర్టీవో**

వాహనం తయారు చేసిన సమయంలో ఉన్న లైట్లనే వాడాలి. అధిక ఫోకస్ వచ్చేలా హైబీమ్, ఎల్ఈడీ లైట్లు వాడితే జరిమానా విధిస్తున్నాం. ప్రతి వాహనం హెడ్లైట్లకు పైభాగంలో నలుపు రంగు సగం వేసుకోవాలని సూచిస్తున్నాం. వాహనాలు తనిఖీ చేసినప్పుడు హెడ్లైట్లు పరిశీలించాలని సూచించాం. హెడ్లైట్లు మార్చిన వారికి ఫిట్నెస్ సమయంలో సరిచేయకుండా ధ్రువీకరణ ఇవ్వరాదని సూచించాం. పోలీసులు కూడా చర్యలు తీసుకోవాలని సమావేశాల్లో చెబుతున్నాం.

## ప్రధాన మార్గంలో కలగానే వారధి

జగిత్యాల : జగిత్యాల గ్రామీణ మండలం అనంతారం వద్ద వంతెన నిర్మాణం కలగానే మారింది. 63వ నంబరు జాతీయ రహదారిపై పలు గ్రామాలకు కీలకమైన మార్గంలో ప్రస్తుతం లోతట్టు వంతెన ప్రమాదకరంగా మారింది. పూర్తి స్థాయి వారధి నిర్మాణంపై పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రాష్ట్రానికి అప్పగిస్తే సాకారం**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి మంచిర్యాల మీదుగా జగ్దల్పూర్ వరకు వెళ్లే 63వ నంబరు జాతీయ రహదారిపై అనంతారం వద్ద దాదాపు 60 ఏళ్ల కిందట లోలెవెల్ వంతెన నిర్మించారు.

ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన వంతెనపై నుంచి ఏటా వర్షాకాలంలో వరద పారుతుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. అయినా కనీస చర్యలు తీసుకోవడం లేదని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత జాతీయ రహదారిని నాలుగు వరసలుగా విస్తరించేందుకు సర్వే నిర్వహించారు. ఈ క్రమంలో అలైన్మెంట్లో రహదారి మార్గం



పూర్తిగా మారింది.

అనంతారం గ్రామ సమీపంలోని వంతెనకు ముందే పొలాస దాటిన తర్వాత జాతీయ రహదారి మార్గం మారుతోంది. దీంతో పాత వంతెనను జాతీయ రహదారి నిర్మాణ సంస్థ పట్టించుకోవడం లేదు. ప్రస్తుత రహదారిని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తే తాము నిధులు కేటాయించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్కుమార్ చెబుతున్నారు.

అనంతారం వాగుపై వంతెన నిర్మిస్తే ధర్మపురి, బుగ్గారం మండలాలతో పాటు జగిత్యాల గ్రామీణ మండలాలకు చెందిన 50 గ్రామాలకు జిల్లా కేంద్రం నుంచి రాకపోకలకు ఇబ్బందులు తీరతాయి. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

## పట్టణాలే అభివృద్ధి చోదక శక్తులు


కొత్తగూడెం : 'పల్లెలే దేశానికి వెన్నెముక' అనేది ఎంత నిజమో.. 'పట్టణాలే అభివృద్ధి చోదక శక్తులు' అనేది కాదనలేని సత్యం. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో నివసించే మొత్తం జనాభాలో సుమారు 30శాతం మంది ప్రజలు నగరాలు, పట్టణాల్లోనే నివసిస్తున్నారు. నగరం/పట్టణాలు కేవలం జనాభా కేంద్రీకరణ స్థానాలే కాకుండా ఉపాధి, విద్య, మెరుగైన జీవన ప్రమాణాలకు హామీ ఇచ్చే కేంద్రాలుగా మారుతున్నాయి.

**జనాభా పెరగటానికి కారణాలు..**

ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, మణుగూరు, పాల్వంచ ప్రాంతాల్లోని సింగరేణి గనులు, విద్యుదుత్పత్తి కేంద్రాలు, భారజల ప్లాంట్ వంటి భారీ పరిశ్రమలు ఇంజినీరింగ్, వైద్య కళాశాలలు వేలాది కుటుంబాలకు ఉపాధినిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే 24 గంటల కార్పొరేట్ వైద్యం, తాగునీరు, విద్య, వినోద సాధనాలు (మాల్స్, పార్కు), ఉపాధి అవకాశాలు ప్రజలను పట్టణాల వైపు మళ్లిస్తున్నాయి. సమీప గ్రామ పంచాయతీలతో కలిసి నూతన పురపాలికలను ఏర్పాటు చేయటం.

**జనమే బలం..**

ఎక్కువ మంది జనాభా ఉన్నచోట వ్యాపార లావాదేవీలు అదేస్థాయిలో జరుగుతాయి. తద్వారా వాణిజ్య, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. నివాసాల డిమాండ్ పెరగటం వల్ల నిర్మాణ రంగం పుంజుకుని వేలాది మంది కూలీలు, కార్మికులకు పని దొరుకుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు జనాభా ప్రాతిపదికన అందుతాయి. జనాభా ఎక్కువగా ఉంటే కేంద్రం నుంచి పట్టణాల ప్రగతికి భారీగా నిధులు సమకూరుతాయి. నిపుణులు ఒకేచోట ఉండటం వల్ల కొత్త స్టార్టప్లు, చిన్నతరహా పరిశ్రమలు రావటానికి అనుకూల వాతావరణం ఏర్పడుతుంది.



**సవాళ్లు.. పరిష్కార మార్గాలు**

జనాభా పెరిగేకొద్దీ చెత్త సేకరణ సమస్యగా మారుతోంది. దీనికోసం డంపింగ్ యార్డుల కంటే రీసైక్లింగ్ యూనిట్లపై దృష్టి సారించాలి. రోడ్లు ఇరుకుగా ఉండటం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అవసరమైనచోట పైవంతెనలు, బైపాస్ రోడ్లు నిర్మించాలి.

వాణిజ్య సముదాయాల్లో సెల్లార్ పార్కింగ్ వసతులు తప్పనిసరిగా ఉండాలి. లే అవుట్లు, కాల్వలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల వల్ల మౌలిక వసతుల కల్పన కష్టమవుతోంది. బృహత్తర ప్రణాళికను పకడ్బందీగా అమలుచేస్తే ప్రయోజనం నెరవేరుతుంది.

ఖమ్మం శాసనసభ నియోజకవర్గ పరిధిలో (290చ.కి.మీ. వైశాల్యంలో) 4లక్షల మందికి పైగా నివసిస్తున్నారు. ఖమ్మం నగరపాలిక (94.37చ.కి.మీ. వైశాల్యంలోనే) సుమారు 3లక్షల మందికి పైగా(75శాతం) ప్రజలు జీవనం సాగిస్తుండటం విశేషం. కొత్తగూడెం శాసనసభ నియోజకవర్గంలో సుమారు 2.50 లక్షల మంది నివసిస్తున్నారు. 80 శాతం (2 లక్షల) మంది కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్ పట్టణాల్లోనే జీవిస్తున్నారు. కొత్తగూడెం నియోజకవర్గ వైశాల్యం 550 చ.కి.మీ. ఉండగా కొత్తగూడెం కార్పొరేషన్ వైశాల్యం కేవలం 90చ.కి.మీ. మాత్రమే. ఇక్కడ ప్రతి నలుగురిలో ముగ్గురు పట్టణాల్లోనే నివసిస్తున్నారు.

# లెక్కల్లోనే మొక్కలు..!

కోదాడ : ఈ చిత్రంలో మొక్కలు ఎండిపోయి వాటి రక్షణకు కట్టిన కర్రలు మాత్రమే కనిపిస్తున్న ప్రాంతం కోదాడ పురపాలికలోనిది. ఈ ఏడాది మొక్కలు నాటి అధికారులు రక్షణను గాలికొదిలేయడంతో కర్రలు మాత్రమే మిగిలాయి. ఒక్క కోదాడలోనే కాదు జిల్లాలోని మిగతా పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

పట్టణాల్లో రోజురోజుకు విపరీతంగా కాలుష్యం పెరుగుతోంది. కాలుష్యాన్ని తగ్గించి, పట్టణ వాసులకు ఆహ్లాదం పెంచేందుకు పచ్చదనం పెంచే లక్ష్యంగా ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమం ఏటా నిర్వహిస్తోంది. ఒక్కో పురపాలికలో ప్రతి ఏడాది లక్షల్లో మొక్కలు నాటుతున్నా వాటి సంరక్షణను గాలికొదిలేయడంతో మొక్కలు పెరగట్లేదు. ఇలా కొన్నేళ్లుగా పట్టణాల్లో రూ.కోట్లు వెచ్చించి లక్షల మొక్కలు నాటుతున్నారు. పట్టణాల్లో చూద్దామన్నా మొక్కలు కానరాని పరిస్థితి. మొక్కల పేరిట ఏటా రూ.కోట్లలో ప్రజల ధనం దుర్వినియోగం అవుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఐదు పురపాలికల్లో 11 లక్షల పైనే మొక్కలు నాటారు. కానీ క్షేత్రస్థాయిలో కనీసం 30 శాతం కూడా కనిపించట్లేదు. అధికా



రులు మాత్రం మొక్కలు బతికినట్లు లెక్కలు చూపెట్టడం గమనార్హం. నాటిన వెంటనే పశువులు తినకుండా, వాహనాలు తొక్కకుండా రక్షణ కోసం గ్రిల్స్, బుట్టలు ఏర్పాటు చేయాలి. కానీ క్షేత్రస్థాయిలో చాలా ప్రాంతాల్లో బుట్టలు బిగించకపోవడంతో పశువులు తిని, వాహనాలు తొక్కి కొంత మేర చనిపోయాయి. సరిపడా నీరు అందించక మరికొన్ని మొక్కలు ఎండిపోయాయి. సిబ్బంది కొరత ఉందని, నీటి ట్యాంకర్లు సరిపడా లేక సంరక్షణ ఇబ్బందిగా మారిందని పుర అధికారులు చెబుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం: – రమాదేవి, పుర కమిషనర్ కోదాడ**

పట్టణంలో ఈ ఏడాది ప్రభుత్వ లక్ష్యనికి దగ్గరగా మొక్కలు నాటాం. వాటిని సంరక్షంచేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం.

# వన 'వేదన'!

నర్సాపూర్ : నర్సాపూర్ అటవీ క్షేత్రాధికారి కార్యాలయం పరిధిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. వనాల విస్తీర్ణం ఎక్కువై.. అధికారులు తక్కువ కావడంతో నిఘా కరవైంది. మరోవైపు అటవీ క్షేత్రాధికారి కార్యాలయానికి సొంత భవనం లేకపోవడం గమనార్హం. రేంజ్ పరిధిలో ఎఫ్ఆర్ఓ, బీట్ అధికారుల పోస్టులు చాలా వరకూ ఖాళీగా ఉన్నాయి. అటవీ క్షేత్రాధికారి అరవింద్‌కు ఇటీవల పదోన్నతి రావడంతో బదిలీపై వెళ్లారు. తూప్రాన్ ఎఫ్ఆర్ఓ అంబర్‌సింగ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రెండు చోట్లా విధుల నిర్వహణ కష్టమవుతోంది.

నర్సాపూర్, బ్రాహ్మణపల్లి, శివ్వంపేట, వెంకట్రావుపేట, తిర్మలాపూర్ విభాగాలకు సెక్షన్ అధికారులున్నారు. వీరితో పాటు డిప్యూటీ రేంజ్ అధికారి కూడా ఉన్నారు. బీట్ అధికారులు మాత్రం 18 మందికి గాను ఏడుగురే ఉన్నారు. ఒకరు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. వీరి కొరత కారణంగా క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందనేది ఉన్నతాధికారులకు తెలియడం లేదు. నలుగురు బేస్ క్యాంప్ సిబ్బంది ఔట్ సోర్సింగ్ విభాగం కింద నియమితులయ్యారు.

**పక్కా భవనాలు లేక అవస్థలు..**

అటవీ క్షేత్రాధికారి కార్యాలయానికి భవనం లేక బీట్ ఆఫీసర్ బిల్డింగ్‌లో కొనసాగిస్తున్నారు. దీంతో నెలవారీ సమావేశాల నిర్వహణ ఇబ్బందిగా ఉంటోంది. స్థానికంగా ఐదు భవనాలుండగా అవి క్రమంగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షం పడితే ఉరుస్తున్నాయి. నిర్వహణ కొరవడి అధ్వానంగా మారాయి.

**ఉద్యోగులుంటే సమస్యలు దూరమవుతాయిలా..**

సిబ్బంది ఉంటే కలప అక్రమ రవాణా పూర్తిస్థాయిలో అరికట్టవచ్చు. వానాకాలంలో ఖాళీ స్థలాల్లో మొక్కల పెంపకం చేపట్టవచ్చు. సహజ వనరులైన మట్టి, ఇసుక, రాళ్ల తరలింపును నిలువరించవచ్చు. అటవీ భూముల ఆక్రమణలను అడ్డుకోవచ్చు. నర్సరీల నిర్వహణ పకడ్బందీగా



ఉంటుంది. లక్ష్యం మేరకు మొక్కలను పంపిణీ చేయొచ్చు. అడవుల అభివృద్ధిలో భాగంగా జలసంరక్షణ పనులపై దృష్టి పెట్టవచ్చు.

నర్సాపూర్ అటవీ శాఖ పరిధి..

విస్తీర్ణం: 11,716 హెక్టార్లు

ఎఫ్ఆర్ఓ: ఇన్‌ఛార్జి అధికారి

బీట్ అధికారులు 18

ఖాళీలు 10

ఉన్నతాధికారులకు నివేదించాం

అంబర్‌సింగ్, ఇన్‌ఛార్జి అటవీ క్షేత్రాధికారి

సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదిస్తూనే ఉన్నాం. ఉన్నవారితోనే అటవీ సంరక్షణకు కృషి చేస్తున్నాం. ఎక్కువగా బీట్ అధికారుల పోస్టులే ఖాళీగా ఉన్నాయి.

# నార్లు పోసేందుకు నీళ్లేవీ!



మెట్‌పల్లి: గంగనాల ప్రాజెక్టు కింద యాసంగి పంటలకు నీరందే పరిస్థితి లేక ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల రైతులు ఆందోళన చెందుతున్నారు. తాత్కాలికంగా సదర్మాట్ బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి శివారులో గోదావరిపై 1956లో గంగనాల ప్రాజెక్టు నిర్మించారు. దీని కింద వేములకుర్తి, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్, మల్లాపూర్ మండలం మొగిలిపేటతో పాటు పలు గ్రామాలకు సాగునీరందుతోంది. ఎస్సారెస్పీ నుంచి గోదావరి ద్వారా ప్రాజెక్టుకు నీరు చేరి రెండు పంటలు పండేవి. కాగా నిర్మల్, జగిత్యాల జిల్లాల సరిహద్దులో మూలరాంపూర్–పొన్కల్ మధ్య నదిపై సదర్మాట్ ప్రాజెక్టు చేపట్టగా దిగువకు వదిలే పరిస్థితి లేదని వాపోతున్నారు.

**ఎగువన బ్యారేజీ నిర్మాణంతో..**

గంగనాల ప్రాజెక్టు ఎగువన రూ.531 కోట్లతో 1.58 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో పొన్కల్ బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం పనులు తుది దశలో ఉండగా, ఈ నెలలో ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. నిర్మల్ జిల్లాలో సదర్మాట్ ఆనకట్ట కింద 13,120 ఎకరాలకు, జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్, మొగిలిపేట, మల్లాపూర్ మండలం ఒబులాపూర్, సంగెం, శ్రీరాంపూర్, పాతదాంరాజ్‌పల్లి, కొత్తదాంరాజ్‌పల్లి, వాల్గొండ గ్రామాల్లోని 4,896 ఎకరాలకు నీరందించాలన్నది లక్ష్యం.

పొన్కల్ బ్యారేజీలో 1.58 టీఎంసీల నీరున్నందున దిగువకు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఎస్సారెస్పీ కింద ఈ యాసంగి ప్రణాళికలో గంగనాల ఆయకట్టుకు నీటి విడుదలపై స్పష్టమైన ఆదేశాలు లేవని తెలుస్తోంది.

**విన్నపాలు బుట్టదాఖలేనా!**

గంగనాల ప్రాజెక్టుకు సరిపడా సాగునీరు రాక వరి నార్లు పోసుకోలేకపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాట్లు వేసే గడువు ముగుస్తోందని, నీళ్ల లేక బీళ్లుగా ఉంచాల్సి వస్తోందని వాపోతున్నారు. పొన్కల్ బ్యారేజీ నుంచి గంగనాలకు నీరందేలా చర్యలు తీసుకోవాలంటూ రైతులు పలుమార్లు ఆందోళనలు నిర్వహించారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

**పది ఎకరాలు సాగుకు దూరం**

నాకు గంగనాల ఆయకట్టులో పదెకరాల పొలం ఉంది. నార్లు పోయడానికి కూడా నీరు లేదు. అధికారులకు విన్నవిస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. –గుమ్మాల గంగన్న, వేములకుర్తి

**మొలక అలకడానికీ లేవు**

నాలుగెకరాల పొలంలో వరి నారు పోసేందుకు నీళ్లు లేవు. ఇంటి వద్ద నానబెట్టిన వడ్లు మొలకలు వచ్చినా అలాగే ఉన్నాయి. పాలకులు స్పందించి రైతులను ఆదుకోవాలి.

–పుప్పాల అశోక్, రైతు, వేములకుర్తి

# గోగులగుట్టను కరిగించి.. గుట్టుగా అక్రమార్జించి



గంగాధర : గంగాధర రెవెన్యూ శివారులోని గోగులగుట్ట మట్టిని 15 రోజులుగా అక్రమార్కులు తరలించుకుపోతున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పొక్లెయిన్‌తో గుట్టను తవ్వి గుట్టుగా టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. బండరాళ్లు పగులగొట్టి, పచ్చని చెట్లను నేలకూల్చి పర్యావరణాన్ని హరిస్తున్నారు. ఇదంతా ఓ మాజీ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో జరుగుతుందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే దాదాపు 300 టిప్పర్ల మట్టి కొల్లగొట్టగా గుట్ట అడుగున దాదాపు 8 గుంటల స్థలం ఏర్పడింది. ఈ స్థలాన్ని పక్కనున్నవారు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో టిప్పర్ మట్టికి రూ.2,500నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తుండగా రూ.9 లక్షల విలువగల మట్టిని దోచుకెళ్లారు. స్థానికంగా ఓ వేడుకల మందిర భవన నిర్మాణానికి ఈ మట్టిని అక్రమంగా తీసుకెళ్లారు.

**హద్దులు ఏర్పాటు చేస్తేనే..**

గతంలో ఇదే గుట్టకు నివాస స్థలాలుగా పట్టాలు కూడా ఇచ్చారు. ఇక్కడే వైకుంఠధామం నిర్మించారు. ప్రభుత్వ స్థలాలు, గుట్ట చుట్టూ హద్దులు నిర్ణయించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని, లేకపోతే ఇలాగే స్థానిక వనరులను దోచుకెళ్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వరద కాలువ మట్టిని, గుట్టను వదలకుండా అక్రమార్కులు దోచుకెళ్లి స్థానిక వనరులు లేకుండా చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు.

**రూ.లక్షల స్థలం కబ్జా!**

వాస్తవానికి ప్రభుత్వ స్థలాలు, గుట్టల మట్టి తవ్వడం నిషేధం ఉన్నప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. గుట్ట అడుగు భాగాన్ని పక్కనున్నవారు తమ భూమిలో కలిపేసుకునేందుకు కుట్ర చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఇక్కడ గుంట స్థలం విలువ రూ.10 లక్షలు ఉండగా రూ.80 లక్షల విలువగల భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

**క్రిమినల్ చర్యలు తీసుకుంటాం** గుట్టను తవ్వినట్లు మా విచారణలో తేలింది. సర్వేయర్‌తో విచారణ జరిపించి హద్దులు నిర్ణయిస్తాం. గుట్ట తవ్వి పోసిన మట్టి కుప్పలకు బహిరంగ టెండర్ నిర్వహిస్తాం. బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుం టాం. రాత్రిపూట వీఆర్ఏను కాపలా ఉంచుతాం. ప్రభుత్వ వనరులను దోచుకెళ్తే కఠిన చర్యలు తీసుకుంటాం. – రజిత, తహసీల్దారు, గంగాధర

# చెత్తకుప్పలో కాసుల వేట

కర్నూలు : పల్లె నిధులు పంచేసుకొన్నారు. పారిశుద్ధ్యం పేరుతో పక్కదారి పట్టించారు. దస్త్రంలో తప్పుడు లెక్కలు రాసి తప్పించుకొంటున్నారు.. గత ఐదేళ్లుగా పంచాయతీల్లో జరిగిన అక్రమాల బాగోతం ఒక్కోటి వెలుగులోకి వస్తోంది. పంచాయతీ పీఠంపై కూర్చున్న వైకాపా నేతలు లెక్కా పత్రం లేకుండా నిధులు ఖర్చు పెట్టారు.. అవన్నీ బోగస్‌గా తేలిపోయాయి. ఆడిటింగ్‌లో ఇవన్నీ వెలుగులో వచ్చాయి.

**అక్రమాలు 'చెత్త'గించవలెను**

గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులకు సాధారణ నిధులు(జనరల్ ఫండ్) 15 శాతం, 15వ ఆర్థిక సంఘం నుంచి 50 శాతం వరకు ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉంది. దీన్ని అవకాశంగా కొందరు సర్పంచులు, కార్యదర్శులు కలిసి అక్రమాలకు పాల్పడ్డారు. పత్తికొండ, వెల్దుర్తి, కోడుమూరు వంటి మేజర్ పంచాయతీల్లో ఈ దందా ఎక్కువగా కొనసాగింది. పారిశుద్ధ్య పనులకు నిధులు ఖర్చు చేసినట్లు బిల్లులు చూపించారు. ఇవన్నీ సమీప బంధువుల దుకాణాల నుంచి తెప్పించినవేనని..ఇలాంట బిల్లుల విలువ రూ.1.50 కోట్ల వరకు ఉన్నట్లు ఆడిట్‌లో తేలింది.

**అనుమతుల్లేకుండానే నియామకాలు**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు పంచాయతీల్లో ఉన్నతాధికారుల అనుమతులు లేకుండానే పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. జిల్లా సర్వోన్నతాధికారి అనుమతితో డీపీవో ఆదేశాలతో ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియమించుకోవాలి. ఇవేమీ లేకుండానే ఇష్టారాజ్యంగా నియమించుకున్నారు.

నంద్యాల జిల్లాలోని పలుకూరు మేజర్ గ్రామ పంచాయతీలో ముగ్గురిని అనుమతి లేకుండా నియమించి, నెలకు రూ.15వేల చొప్పున చెల్లిస్తున్నారు. కానాల మేజర్ పంచాయతీల్లో ఇద్దరిని, కోవెలకుంట్ల, కర్నూలు జిల్లాలోని వెల్దుర్తి, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం పంచాయతీల్లో ఇలానే నియామకాలు జరిగాయి. వీరంతా ఆయా గ్రామాల సర్పంచులకు కావాల్సిన వారు.

దేవనకొండలో 34 మంది సిబ్బందికి ఏటా రూ.32.25 లక్షలు, మంత్రాలయంలో 34 మందికి ఏకంగా ఏడాదికి రూ.40.14 లక్షలు చెల్లిస్తుండటం గమనార్హం. కోడుమూరులో అయితే 48 మంది కోసం రూ.58.15 లక్షలు వెచ్చిస్తున్నారు.

**ఇదిగో అక్రమాల చిట్టా**



వెల్దుర్తి పంచాయతీకి ఏటా రూ.76 లక్షల ఆదాయం సమకూరుతుంది. 42 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఏటా రూ.54 లక్షలు చెల్లిస్తున్నట్లు దస్త్రాల్లో రాసుకొన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్మికులకు పొంతన లేదు. లేని కార్మికులను పనిచేస్తున్నట్లు చూపి రూ.25 లక్షల వరకు స్వాహా చేశారు. దీనిపై విచారణ జరుగుతోంది.

రూ.1.28 కోట్ల ఆదాయం వచ్చే పత్తికొండలో 82 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు 'లెక్కలు' రాశారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అందుకు విరుద్ధంగా ఉంది.

కోవెలకుంట్ల పంచాయతీకి ఏటా రూ.2 కోట్ల ఆదాయం ఉంది. 44 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు దస్త్రంలో రాసుకొన్నారు. వీరికి ఏటా రూ.40 లక్షలకు పైగా వేతనాలు చెల్లిస్తున్నారు. వాస్తవంగా ఇక్కడ పనిచేస్తుంది 30 మంది మాత్రమే. రుద్రవరం పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులను ఎవరినీ తీసుకోకుండానే మూడేళ్లుగా కార్మికుల పేరుతో రూ.10 లక్షలు పక్కదారి పట్టించారు.

పంచాయతీలు 970

మేజర్ పంచాయతీలు 38

ఏటా ఆదాయం రూ. 37.5 కోట్లు

15వ ఆర్థిక సంఘం నిధులు రూ.60.85 కోట్లు

పారిశుద్ధ్యం కోసం వెచ్చిస్తున్న నిధులు రూ.8.1 కోట్లు

# దాతలు ముందుకొస్తే.. ఆనందం పదింతలు

సంగారెడ్డి : పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో సర్కారు బడుల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వివిధ గ్రామాలు, తండాల నుంచి చాలా మంది విద్యార్థులు ఉదయం అల్పాహారం భుజించకుండానే ఏడు గంటలకే బయల్దేరి పాఠశాలలకు వెళుతున్నారు. ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. మధ్యాహ్న భోజనమే దిక్కవుతోంది. సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల అనంతరం పిల్లలు ఇంటికి చేరేసరికి రాత్రి అవుతోంది. ఉదయం, సాయంత్రం అల్పాహారం అందక ఆకలితో అలమటిస్తున్నారు. గతంలో మాదిరిగా దాతలు చేయూత అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**స్వచ్ఛంద సంస్థల చొరవతో మేలు**

జిల్లాలో పలు స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయి. వారు ముందుకొచ్చి అల్పాహారం అందిస్తే పిల్లలకు మేలు చేసిన వారవుతారు. వీరితో పాటు ఉపాధ్యాయులు, పారిశ్రామిక యాజమాన్యాలు, ప్రజాప్రతినిధులు స్పందిస్తే సమస్య సునాయాసంగా పరిష్కారం అవుతుంది. గతేడాది జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధులను కేటాయించారు. ఈ దిశగా కలెక్టర్ ప్రయత్నం చేయాలి.

**జిల్లాలో విద్యార్థుల లెక్కలిలా..**

ప్రభుత్వ పాఠశాలలు: 1218

పదో తరగతి విద్యార్థులు: 10,289

అక్షయ పాత్ర ద్వారా భోజనం అమలవుతున్నవి: 612



వంట ఏజెన్సీల ద్వారా మధ్యాహ్న భోజనం అందిస్తున్నవి: 606

**త్వరలో నిధులొస్తాయి**

వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి

ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో పదో తరగతి విద్యార్థులు నిత్యం ఉదయం, సాయంత్రం గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వారికి అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం త్వరలో నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది.

**ఏకాగ్రత లోపిస్తోంది**

సూరజ్, 'పది' విద్యార్థి, నారాయణఖేడ్

మాది నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట. ఖేడ్ జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్నా. ప్రైవేటు వాహనాల్లో ఉదయం ఏడు గంటలకే ఇంటి నుంచి బడికి బయల్దేరుతున్నా. సాయంత్రం వరకు తరగతులు, ఆ తర్వాత ప్రత్యేక తరగతులు ముగించుకొని ఇంటికి వెళ్లేసరికి రాత్రి అవుతోంది. మధ్యాహ్నం తిన్న ఆహారంతోనే రాత్రి వరకు ఉండాలంటే ఇబ్బందిగా మారింది. ఆకలి వల్ల ఏకాగ్రతతో పాఠం వినలేకపోతున్నా.

# పట్టణానికి దూరం.. ప్రగతికేదీ మార్గం?

జగిత్యాల : సాధారణంగా పురపాలిక, పంచాయతీ ఏదయినా భౌగోళికంగా ఒకే చోట ఉంటుంది. జగిత్యాల బల్దియా పరిధి మాత్రం ఇందుకు భిన్నంగా విస్తరించడం చర్చనీయాంశమైంది. పంచాయతీగా ఉన్న టీఆర్‌నగర్‌ను బల్దియాలో విలీనం చేయగా, దూరంగా ఉన్న నూకపల్లిలో అర్బన్ హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేయడం 'మూడు ముక్కలాట'ను తలపిస్తోంది.

**పేరుకే పట్టణ కాలనీ**

2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జీవన్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో పట్టణానికి చెందిన దాదాపు 4500 మంది పేదలకు మల్యాల మండలం నూకపల్లి పరిధిలో ఇళ్ల పట్టాలిచ్చి ఇందిరమ్మ కాలనీగా నామకరణం చేశారు.రాష్ట్రం ఏర్పాటయ్యాక పార్లమెంటు సభ్యురాలు కల్వకుంట్ల కవిత హయాంలో, 2018 ఎన్నికల సమయంలో నూకపల్లిలో జగిత్యాల అర్బన్ కాలనీ పేరిట 4200 రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేశారు. గత శాసనసభ ఎన్నికలకు ముందు 3,800 మందికి ఇళ్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం వెయ్యి కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నారు.



2500 మంది వరకు జగిత్యాలలోనే ఓటు వేయనున్నారు.

**ఇంటి నంబర్లు లేని ఓటర్లు**

1985లో తెదేపా ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి రాజేశంగౌడ్ చొరవతో టీఆర్‌నగర్(తారకరామనగర్) పంచాయతీ ఏర్పాటు కాగా ఏడేళ్ల కిందట జగిత్యాల బల్దియాలో విలీనం చేశారు.

గ్రామంలో పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల పట్టాలు చేతులు మారగా చాలా వరకు బినామీలే ఉంటున్నారు. ప్రభుత్వ స్థలాలకు బల్దియా ఇంటి నంబర్లు కేటాయించే పరిస్థితి లేక చాలా మంది సొంతంగానే వేసుకున్నారు. దీంతో ప్రతి ఎన్నికల్లో భౌగోళిక హద్దుల ఆధారంగా పంచాయతీ పరిధిలో నివసిస్తున్న వారితో ఓటరు జాబితా సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం టీఆర్‌నగర్‌లో 1000 వరకు నివాసాలు, 3,800 మంది వరకు ఓటర్లున్నారు. పలువురి అభ్యంతరాల మేరకు రెండు రోజుల కిందట చేసిన సవరణలో 10వ వార్డులో 2051 మంది, 11వ వార్డులో 1741 మంది ఓటర్లుండేలా జాబితాలు రూపొందించారు.

**ఇవేం విన్నపాలు!**

పట్టణానికి దూరంగా, భౌగోళికంగా మల్యాల మండలంలో ఉన్న అర్బన్ హౌసింగ్ కాలనీని బల్దియాలో కలపాలన్న ప్రతిపాదనలు విమర్శలకు తావిస్తున్నాయి. పెరిగిన రెండు వార్డులను కాలనీలో ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. దీన్ని ఆమోదిస్తే ఇతర ప్రాంతాల నుంచీ ఇలాంటి డిమాండ్లే వస్తాయని సీడీఎంఏ(మున్సిపల్ పరిపాలన కమిషనర్, డైరెక్టర్) కార్యాలయ వర్గాలు తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పట్టణాన్ని ఆనుకొని ఉన్న ధరూర్‌ను వదిలి టీఆర్‌నగర్‌ను విలీనం చేయడంపై గతంలో స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్బన్ కాలనీని జగిత్యాల మండలంలో కలపడంతో పాటు, టీఆర్‌నగర్‌ను తిరిగి పంచాయతీగా కొనసాగించే అంశాన్ని పరిశీలించాలన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

# 12 కిలోమీటర్లు... ఆరు తప్పిదాలు

భీమవరం : అతివేగం, చోదకుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీన వైఖరితో రహదారులు రుధిర దారులుగా మారుతున్నాయి. అపసవ్య దిశలో రావడం, రహదారి పక్కనే వాహనాలు నిలపడం, చరవాణిలో మాట్లాడుతూ నడపడం... ఇలా చెప్పుకుంటూ పోతే అనేక కారణాలు మృత్యు ఘంటికలు మోగిస్తున్నాయి. జిల్లాలో బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన పైడిపర్రు కూడలి నుంచి అలంపురం వరకు 12 కి.మీ. మేర పరిశీలించగా...షర్మిష్ఠ కూడలిజాతీయ రహదారిని దాటేందుకు చోదకులు భయపడుతున్నారు. అనుసంధాన రహదారుల నుంచి జాతీయ రహదారిపై వచ్చే వాహనాలు కనిపించడం లేదు. కూడలి నుంచి సర్వీసు రోడ్డులోకి రావాలంటే అర కిలోమీటరు ప్రయాణం చేయాల్సి వస్తోంది. దాంతో అపసవ్య దిశలో ప్రయాణం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసు స్టాండ్లు ఉన్నా నిరుపయోగంగా ఉన్నాయి.

పైడిపర్రు కూడలి

తణుకు పట్టణంలోకి రాకపోకలకు ఇదే ప్రధాన మార్గం. పైవంతెన నుంచి వచ్చే వాహనాలు ఒకపక్క, బస్టాండ్లోకి వెళ్లొచ్చే వాహనాలు మరోపక్క, పైడిపర్రు, మండపాక, తదితర గ్రామాలకు వెళ్లేందుకు వాహనాలు ఇంకోవైపు, విజయవాడ వైపు వెళ్లే వాహనాలు మరోవైపు... మొత్తంగా అయిదు దిశల నుంచి వచ్చే వాహనదారులకు ఎటునుంచి ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. కనీసం సిగ్నల్ లైట్లు గాని, ట్రాఫిక్ పోలీసుల వ్యవస్థ లేవు.

**తేతలి గ్రామ కూడలి**

జాతీయ రహదారిలో పైవంతెన దిగువన తేతలి, వడ్లూరు గ్రామాల అనుసంధాన రహదారులు కలుస్తున్నాయి. ఎన్హెచ్పై వేగంగా వచ్చే వాహనాలు కనిపించక చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

పైడిపర్రు నుంచి అలంపురం వరకు ఉన్న డివైడర్ ముఖ్య కూడళ్ల వద్ద అటుఇటు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో దువ్వ, వెంకయ్యకాలువ, కొండయ్యపాలెం, గౌతమీ శాల్వెంట్ ఆయిల్స్



కూడలి, ఇతర ప్రాంతాల్లో చుట్టూ తిరిగి రావాలనే కారణంతో అపసవ్య దిశలో ప్రయాణం చేయాల్సి వస్తోంది.

రహదారి పొడవునా ఎక్కడపడితే అక్కడే వాహనాలను నిలుపుతున్నారు. కిలోమీటరు పరిధిలో సుమారు 250 వాహనాలు రాకపోకలు సాగించగా పది మందిలో ఒక్కరిద్దరే శిరస్త్రాణం ధరించగా, కనీసం ముగ్గురు చరవాణిలో మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నారు.

షర్మిష్ఠ, తేతలి, దువ్వ గ్రామ కూడళ్ల వద్ద పైవంతెన్ల నిర్మాణాలు చేపట్టాలనే అభిప్రాయాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

తేతలి వైజంక్షన్ ఒకపక్క 216ఏ జాతీయ రహదారిపై, మరోవైపు తణుకు, ఇతర గ్రామాల్లోకి రాకపోకలు సాగించే వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇరుకుగా ఉండటం, పైవంతెన నిర్మాణం స్తంభాల (పిల్లర్ల) దశలో నిలిచిపోవడం, రహదారిపై దుకాణాలు ఏర్పాటుచేయడం, వాహనాలు నిలపడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

# పారాది.. జోరందుకుంది వారధి

బొబ్బిలి : వేగావతి నదిపై పారాది వంతెన పనులు చురుగ్గా సాగుతున్నాయి. స్తంభాల నిర్మాణంతో పాటు మూడు స్లాబులు పూర్తయ్యాయి. అయిదు స్లాబులు వేయాల్సి ఉంది. మే నాటికి పూర్తిచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంతవరకు రూ.7 కోట్ల విలువైన పనులు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

**70 శాతం పూర్తి..:** గతేడాది అక్టోబరులో పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికి 70 శాతం పూర్తయ్యాయన్నారు. కీలకమైన బేస్మెంట్, పిల్లర్ల



కాంక్రీటు పనులు పూర్తిచేశారు. వంతెన నిర్మాణానికి రూ.13.40 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. రూ.3 కోట్ల మేర బిల్లులను ప్రభుత్వం చెల్లించింది.

**గడువులోగా పూర్తిచేస్తాం..:** వంతెన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తాం. స్లాబుల పనులు జరుగుతున్నాయి. అనంతరం అప్రోచ్ రోడ్డు నిర్మిస్తాం.అప్పలరాజు, ఏఈ, ర.భ.శాఖ, బొబ్బిలి సెక్షన్

# ఇది 'రియల్' దందా..!

గరివిడి : భూముల ధరలకు రెక్కలు రావడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ప్రధానంగా స్థిరాస్తి వ్యాపారులు మరింత దారుణాలకు దిగుతున్నారు. పొలాలకు నీరందించే పంట కాలువలను కూడా వదలడం లేదు. గుర్ల మండలం గరిడ, గుజ్జింగ వలస గ్రామాల మధ్య కొత్తగా ఓ రియల్ఎస్టేట్ లేఅవుట్ వేస్తున్నారు. నీటి పారుదల శాఖ అధికారుల నుంచి అనుమతుల్లేకుండా రహదారి కోసం సాగునీటి కాలువపై వంతెన నిర్మించారు. గరిడ గ్రామానికి వెళ్లే రహదారి పక్క నుంచి సాగునీటి కాలువ ఉంటుంది. వర్షాల సమయంలో పైనుంచి వచ్చే వరద నీరంతా ఈ కాలువ గుండా ప్రవహించి గుజ్జింగవలస చవక చెరువులోకి చేరుతుంది. అది నిండాక పరగడ చెరువులోకి వెళ్తుంది. ఈ రెండింటికీ ఈ నీరే ఆధారం. వీటి కింద సుమారు 240 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది.

నీటి ప్రవాహానికి అడ్డంకి..: ప్రస్తుతం గరిడకు వెళ్లే రహదారి పక్కన కాలువను ఆనుకుని ఉన్న వ్యవసాయ భూములను కొనుగోలు చేసి రియల్ఎస్టేట్ వెంచర్ ఏర్పాటుకు పనులు చేస్తున్నారు. ప్రధాన రహదారి నుంచి లేఅవుట్లోకి వెళ్లేందుకు అనుబంధ రహదారి నిర్మాణం కోసం మధ్యలో కాలువ ఉండడంతో దానిపై వంతెన నిర్మించారు. కాలువను కుదించి నిర్మాణం చేపట్టడంతో వరద నీరు పారని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. విషయాన్ని నీటిపారుదల శాఖ ఏఈ సంతోష్ దృష్టికి తీసుకెళ్లగా.. వంతెన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిర్మాణాన్ని తొలగిస్తామన్నారు.

# విలీనం 'భూ'టకం.. ఆక్రమణల నాటకం



ఆదోని : జాతీయ రహదారి(167)కి సమీపంలో వైకాపాకు చెందిన ఓ నాయకుడు వంక ఆనుకుని స్థలం కొనుగోలు చేశారు. గతంలో అధికారం అడ్డుపెట్టుకొని ఆ వంకను ఆక్రమించి ఎత్తుగా మట్టి కుప్ప పోశారు. ముందున్న పొలాలు ముంపునకు గురయ్యేలా చేశారు. ఇదేమిటని రైతులు ప్రశ్నిస్తే ఆ పొలాన్ని మేము చెప్పిన ధరకు అమ్మాలనే షరతు పెట్టారు. నేటికీ పొలాలు నీటి ముంపులోనే ఉన్నాయి. నాకు ముగ్గురు ఆడపిల్లలు. అద్దె ఇంట్లో ఉంటున్నా.. నా భర్త ఆటోడ్రైవర్‌గా పని చేసేవారు. ఆయన మరణించే ముందు మూడు సెంట్ల స్థలం కొనుగోలు చేశారు. ప్రస్తుతం డబుల్ రిజిస్ట్రేషన్ చేసి కబ్జా చేశారు. ఆ స్థలం విక్రయించి పెళ్లిళ్లు చేద్దామనుకున్నా.. ఇప్పుడేం చేయాలో తోచడం లేదు.. ఓ మహిళ ఆవేదన.

ఆదోని పట్టణ శివారు మండిగిరి, సాదాపురం గ్రామాల్లో ఎవరిని కదిలించినా ఇలాంటి కన్నీటి గాథలు వెలుగులోకి వస్తాయి.. అక్కడి స్థలాల్లో 'భూ'తాలు తిష్ఠ వేశాయి. ఆయా గ్రామాల్లో ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. గత వైకాపా ప్రభుత్వంలో బీజం పడగా.. కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతోంది.

సెంటు రూ.లక్షలు పలుకుతోందిమండిగిరి, సాదాపురం పంచాయతీలు ఆదోని పట్టణ సమీపంలోనే ఉంటాయి. ఒకప్పుడు పేదల గుడిసెలు ఉండేవి. జాతీయ రహదారి (167) రావడం.. ఆదోని పట్టణం విస్తరించడంతో ఇక్కడ సెంటు స్థలం రూ.లక్షలు పలుకుతోంది. ప్రస్తుతం ఆయా గ్రామాలు సంపన్నుల కాలనీలుగా మారిపోయాయి. దీంతో ఒక్కసారిగా భూ మాఫియా కన్నుపడింది. అధికార బలాన్ని అడ్డుపెట్టుకొని కొందరు అనధికార వెంచర్లు వేస్తూ.. సమీపంలోని ప్రభుత్వ భూములను కొట్టేస్తున్నారు.

సర్వే నంబరు-550, 586ల పరిధిలో 40 సెంట్లు, ఎస్.కొండాపురం ప్రాంతంలో సర్వే నంబరు-91లో 78 సెంట్ల స్థలం కబ్జాకు గురైన విషయం వెలుగులోకి వచ్చింది. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పేదలకు పంచిన స్థలాలూ అన్యాక్రాంతమయ్యాయి.

**నేతల ముందస్తు వ్యూహం**

ఆదోని పట్టణ విస్తీర్ణం 34 వేల చ.కి.మీ. ఇక్కడ సెంటు స్థలం దొరకడం లేదు. పక్కనే ఉన్న మండిగిరి, సాదాపురంలో ఇళ్లు నిర్మించుకోవడానికి జనం ఆసక్తి కనబరుస్తున్నారు. దీనిని గమనించిన నేతలు ముందస్తు వ్యూహం పన్నారు. ఈ రెండు గ్రామాలను పురపాలక సంఘంలో విలీనం చేస్తామని ప్రకటించిన వైకాపా నేతలు స్వార్థపూరితమైన ఆట ఆడారు. దీంతో 2021లో పంచాయతీ ఎన్నికలు జరగలేదు. విలీనాన్ని వ్యతిరేకిస్తూ కొందరితో కోర్టులో పిటిషన్ వేయించారు. దీంతో అటు విలీనం కాలేదు.. ఇటు పంచాయతీ ఎన్నికలు జరగలేదు.. స్థానిక పాలకవర్గాలు లేకపోవడంతో భూమాఫియాను ప్రశ్నించేవారు కరవయ్యారు.

భూములను కొనుగోలు చేసి వెంచర్లుగా మార్చేశారు. మండిగిరి పరిధిలో వందకు పైగా, సాదాపురం పరిధిలో వందల ఎకరాల్లో అనధికార లేఅవుట్లున్నాయి.

# కట్టడి లేదు.. కట్టబెట్టుడే



మచిలీపట్నం : రెవెన్యూ డివిజన్ పరిధిలోని వేల ఎకరాల ప్రభుత్వ భూములు అక్రమార్కుల చెరలో మగ్గుతున్నాయి. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి జోగి రమేష్ అండతో బంటుమిల్లి మండలం పెదపాండ్రాక, కృత్తివెన్నులోని ఇంతేరు, నిడమర్రు, మచిలీపట్నంలోని పెదపట్నం, కానూరు, మంగినపూడి తదితర గ్రామాల్లో భారీగా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. మడ, ఉప్పు, అస్సైన్డ్ భూములతో పాటు రక్షణ శాఖకు కేటాయించిన స్థలాలు.. సముద్రానికి ఆనుకొని ఉన్న (సీఆర్జెడ్) భూములు.. ఇలా ఖాళీగా కనిపించిందంతా అక్రమంగా చెరువులుగా మార్చేశారు. ప్రభుత్వం మారినా కబ్జాదారుల దందాలకు అడ్డకట్ట పడట్లేదు.

మచిలీపట్నం డివిజన్ పరిధిలో కేంద్ర ప్రభుత్వ ఉప్పు శాఖకు సంబంధించి 2962.29 ఎకరాల భూములు ఉన్నాయి. వీటిలో 900 ఎకరాలు అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఇప్పటికే ఇందులో 70శాతానికిపైగా ఆక్రమణ చెరలో ఉన్నాయి. సమీపంలోని పట్టా భూముల సర్వే నంబర్ల పేరుతో అక్రమంగా తవ్వేసినా చెరువులకు విద్యుత్తు కనెక్షన్లు పొందారు. దీనిపై విచారణ పేరుతో కాలం వెళ్లదీస్తున్నారు. పెడన మండలం జింజేరులో లజ్జబండ డ్రైన్ వద్ద ఇటీవల 2 ఎకరాల్లో చెరువు తవ్వి అటువైపు రాకూడదని దారికి గండికొట్టేశారు. పెదకరగ్రహారం, గిలకలదిండి మార్గంలో పాత చెరువులు బాగు చేసుకుంటూ పక్కనే ఉన్న పదుల ఎకరాల భూములను ఆక్రమించేశారు. వీటిపై విచారణ చేస్తే బడాబాబులు, నేతలు, అధికారుల బండారం బయట పడుతుందని అధికారులు జంకుతున్నారు.

**ఆక్రమిస్తే చర్యలు**

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ బాలాజీ తెలిపారు.

**తవ్వేస్తున్నా.. మాకేమని..!**

బంటుమిల్లి మండలం కొర్లపాడు పంచాయతీ పెదప్రాండాక పరిధిలో సర్వే నంబర్ 147లో 89.91 ఎకరాల కేంద్ర ప్రభుత్వ ఉప్పు భూములుండగా.. సుమారు 20ఎకరాల్లో అక్రమంగా చెరువులు తవ్వారు. నారాయణపురంలోని 61.94 ఎకరాల్లోనూ పదుల ఎకరాలు ఆక్రమించేశారు. కృత్తివెన్నులోని చినపాండ్రాక, ఇంతేరు పరిధిలో 1620.07ఎకరాల్లో సగానికిపైగా స్వాహా చేశారు. ఇంతేరులో 3,500 ఎకరాలు పంచాయతీ మడ భూములు ఉండగా 1600 ఎకరాలకుపైగా చెరువులుగా మార్చేశారు.మచిలీపట్నంలోని పెదపట్నం, మంగినపూడి, తాళ్లపాలెంలో 1190 ఎకరాలు ఉండగా వందల ఎకరాలు కనుమరుగయ్యాయి.హంసలదీవి సమీపంలో పాత చెరువుల మరమ్మతుల పేరుతో కొత్త చెరువులు తవ్వుతున్నారు.

# దండిగా ఉన్నా.. మొండిగా వదిలేసి

ఉంగుటూరు : ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవన నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. అక్కుపల్లిగోకవరం, యర్రమళ్ల (నాచుగుంట), గోపినాథపట్నంలో పునాది దశను దాటలేదు. నాచుగుంట, గోపినాథపట్నంలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. నారాయణపురం-1, కైకరం-1 భవన నిర్మాణాలు పూర్తై ఏడాది దాటినా వినియోగంలోకి తీసుకురాలేదు.గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో.. ఆరోగ్య ఉప కేంద్రాలు నిర్మించారు. జిల్లాలో ఈ కేంద్రాల తలుపులు తెరుచుకోవడం లేదు. సర్వేల పేరిట సిబ్బంది కేంద్రాల వైపు కన్నెత్తి చూడటం లేదు. కొన్నిచోట్ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా గ్రామీణులు ఆర్ఎంపీలను ఆశ్రయించి ఒళ్లు గుల్ల చేసుకొని.. చేతి చమురు వదిలించుకుంటున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో సచివాలయాలకు అనుసంధానంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పేరిట ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలు చేపట్టింది. ఒక్కో భవనానికి తొలుత రూ.14.95 లక్షలు మంజూరు చేసింది. ఆపై గుత్తేదారుల ఒత్తిడితో రూ.17.50 లక్షలకు పెంచింది. ఆ మొత్తం చాలకపోవడంతో మరో రూ.3.30 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించింది. మొత్తమ్మీద భవనానికి రూ.20.80 లక్షలు వెచ్చించింది.కొయ్యలగూడెం మండలం గవరవరంలోని అద్దె భవనంలో వైద్యుడు రోగిని పరీక్షిస్తున్న దృశ్యమిది. అరకొర వసతులున్న భవనంలో సేవలందించేందుకు వైద్యులు, సిబ్బంది



ఇబ్బంది పడుతున్నారు.

ఇరుకు గదుల్లో.. నరేగా పద్దు కేంద్రం విడుదల చేస్తున్న నేపథ్యంలో.. ఆ కేంద్రాలకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్గా పేరు మార్చింది. ఈ నిర్మాణాలు కొన్నిచోట్ల పునాది దశ దాటలేదు. ఇంకొన్ని అసంపూర్తిగా నిలిచిపోయాయి. 128 భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు రూ.20.73 కోట్లు మంజూరయ్యాయని పీఆర్ ఎస్ఈ రమేశ్ తెలిపారు.

జిల్లా సమాచారమిలా..

పీహెచ్సీలు: 62

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు: 271

పూర్తయినవి: 89

# కొలువు అంత సులువు కాదు

ఒంగోలు : ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంజినీరింగ్లో అడుగుపెట్టినప్పటి నుంచే కసరత్తు చేస్తేనే గానీ కొలువులు దక్కడంలేదు. నాలుగేళ్లపాటు శ్రమించినవారే ప్రాంగణ ఎంపికల్లో అవకాశాలు దక్కించుకుంటున్నారు. క్రమపద్ధతిలో సన్నద్ధమైతే అది ఏమంత కష్టం కాదని నిపుణులు చెబుతున్నారు.


ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో ఉద్యోగాల సంఖ్య తగ్గి పోటీ ఎక్కువైంది. కొలువులకు పోటీ తీవ్రంగా ఉండడంతో వడబోత ఎక్కువైంది. ఇటీవల జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో చివరి ఏడాది విద్యార్థులు కొద్దిమందే అవకాశాలు దక్కించుకున్నారు. అన్నింటా నైపుణ్యం ఉన్నవారినే ఉద్యోగాలు వరించాయి. రీజనింగ్, ఆప్టిట్యూడ్, లాజికల్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, సీ, జావా, పైథాన్తో పాటు ఇతర కోర్సుల్లో పట్టు సాధించినవారే ఇంటర్వ్యూ సులువుగా ఎదుర్కొన్నారు. ఇంజినీరింగ్ తొలి ఏడాది నుంచి ఒక్కొక్కటిగా నేర్చుకుంటూ పట్టు పెంచుకుని చివరి ఏడాది ఇంటర్వ్యూ ఎలా ఎదుర్కొవాలో సన్నద్ధమై అనుకున్న లక్ష్యాన్ని సాధించారు.

అదనపు నైపుణ్యాలుంటేనే: విద్యార్థులకు ఇంజినీరింగ్ సిలబస్తో పాటు రోజు రెండు గంటల పాటు నైపుణ్యాలు పెంచుకునేవిధంగా శిక్షణ ఇస్తున్నారు. నిపుణుల ద్వారా ఆన్లైన్ శిక్షణ పొందుతున్నారు. కళాశాలల్లో జరిగే సెమినార్లో నిపుణుల పాఠాలు వింటున్నారు. ఇంటర్న్షిప్లు చేయడంతోపాటు వివిధ సంస్థలు అందించే కంప్యూటర్ కోర్సులు అభ్యసిస్తున్నారు. ఉద్యోగ దరఖాస్తులో తమ నైపుణ్యాలు పేర్కొనడంతో పాటు తాము ఎంత వరకు నేర్చుకున్నామన్నది నేర్పుగా వివరిస్తున్నారు. ఉద్యోగాలు సాధించిన పలువురి గురించి విచారిస్తే వారంతా నాలుగేళ్లపాటు నైపుణ్యాలు ఒడిసిపట్టడంతో కాన్ఫిడెంట్గా ఇంటర్వ్యూను ఎదుర్కొవడంతో కొలువు సాధన సులువవుతుంది.

**రోజుకు నాలుగు గంటలు కష్టపడ్డా**

– పి.శ్రీనివాస కల్యాణ్, ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం

ఇంజినీరింగ్ కోర్సు చదువుతూనే కళాశాలలో అదనపు తరగతులకు హాజరయ్యాను. రోజూ ఇంటికొచ్చిన తరువాత రెండు గంటలపాటు కష్టపడ్డాను. నాలుగేళ్ల కష్టానికి ఫలితంగా ఐటీసీ ఇన్ఫోటెక్లో ఉద్యోగం



సాధించాను. ఏఐఎంఎల్, జావాలో ఇంటర్న్షిప్ చేశాను. చివరి సంవత్సరం ఇంటర్వ్యూకు సన్నద్ధం కావడంతో కొలువు సులువైంది.

**భావవ్యక్తీకరణతోనే రాణించగలం**

– జె.మోదిత మానస, ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం

ఐటీసీ ఇన్ఫోటెక్లో ఉద్యోగం వచ్చింది. మొదటి నుంచి ఉద్యోగ సాధన లక్ష్యంగా సన్నద్ధమవుతూ వచ్చినందుకు పోటీని తట్టుకుని నిలబడ్డాను. భావ వ్యక్తీకరణ నైపుణ్యాల్లో చాలా మంది వెనుకబడుతున్నారు. ముందుగా మనం బాగా నేర్చుకుంటే ధైర్యంగా ఇంటర్వ్యూను ఎదుర్కొనవచ్చు.

**విద్యార్థుల నైపుణ్యాలకే పెద్దపీట**


– డాక్టరు ఎన్.వి.రఘుబాబు, అధ్యాపకులు, రైజ్ కృష్ణసాయి ఇంజినీరింగ్ కళాశాల నైపుణ్యాలున్నవారికే కంపెనీలు పెద్దపీట వేస్తున్నాయి. సమస్యపై స్పందించి తక్కువ సమయంలో పరిష్కారం చూపగలిగేవారిని పలు విధాలుగా పరీక్షిస్తున్నాయి. క్రమ పద్ధతి ప్రకారం మొదటి ఏడాది నుంచి ఇవి నేర్చుకోవడం మొదలుపెడితే చివరి ఏడాదిలో ప్రయత్నిస్తే అలవోకగా ఉద్యోగం సాధించవచ్చు.

# అక్రమాలకు ఫ్రీ పాస్

నెల్లూరు: గనులశాఖలో కొందరు అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడం.. క్వార్ట్జ్‌కు అంతర్జాతీయ మార్కెట్‌లో ధర లేకపోవడం.. క్వారీల నుంచి వచ్చే సీనరేజీ వసూళ్ల బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించడం కొందరికి ఇబ్బందిగా మారింది. దీంతో వైకాపా ప్రభుత్వ హయాంలో నెలవారీ మామూళ్లతో జేబులు నింపుకొన్నవారు.. కొత్తరకం అక్రమాలకు తెరదీశారు. ప్రభుత్వ పనులు చేసే గుత్తేదారులకు అవసరం లేకపోయినా.. ఎక్కువగా ఫ్రీ పాస్‌లు ఇస్తూ సొంత జేబులు నింపుకొంటున్నారు.

**ఇంజినీర్లతో చేతులు కలిపి...**

ప్రభుత్వ, ఎన్‌హెచ్, రైల్వే పనులకు అవసరమైన ఖనిజాలను మైనర్ మినరల్స్ ఉచిత డిస్పాచ్ పర్మిట్లతో సరఫరా చేసేందుకు అధికారులకు అవకాశం ఉంది. దీన్నే అవకాశంగా తీసుకున్న కొందరు... వివిధ శాఖల ఇంజినీర్లతో చేతులు కలిపి ఇష్టానుసారం ఉచిత పాసుల అక్రమాలకు తెరలేపారు. జిల్లాలో కంకర, రోడ్డు మెటల్, గ్రావెల్‌కు సంబంధించి 36 క్వారీలకు అనుమతి ఉండగా.. 3.50 లక్షల మెట్రిక్ టన్నులు తవ్వేందుకు అనుమతులు ఇచ్చారు. అదే సమయంలో గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు వివిధ శాఖల్లో జరుగుతున్న పనుల పేరిట 10.70 లక్షల టన్నులు తీసుకువెళ్లేందుకు 238 పర్మిట్లు ఇవ్వడం అధికారుల తీరుకు నిదర్శనంగా మారింది.



**రూ. వేలల్లోనే వసూల్**

మైనింగ్ శాఖలో సూపరింటెండెంట్ స్థాయిలో పనిచేసే ఒకరు ఈ ఉచిత పాసుల వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఒక్కో పర్మిట్‌కు రూ. పది వేల నుంచి రూ. 50వేల వరకు తీసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది.

దీనిపై మైనింగ్ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు వివరణ కోరగా.. ఇంజినీర్లు పెట్టిన ఇండెంట్ ప్రకారమే జారీ చేస్తున్నాం. అనుమతి ఉన్న ప్రాంతాల్లోనే తవ్వకాలు జరగాలి. మొదట్లో అనుమతులు ఇవ్వకపోవడంతో.. ప్రభుత్వ పనులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. దాంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు అనుమతులు ఇస్తున్నామని అన్నారు.గుత్తేదారులకు లాభం ఏమిటనే సందేహం రావచ్చు. ఈ పాస్‌లు ఉన్న వాహనాలను పోలీసు, మైనింగ్ అధికారులతో పాటు సీనరేజీ వసూలు చేసే గుత్తేదారు సంస్థ ఆపదు. పైగా అనుమతి తీసుకున్న ప్రాంతం నుంచి కాకుండా.. ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు చేయడం వల్ల సదరు కాంట్రాక్టర్‌కు పని అంచనా సమయంలో ఇచ్చిన ధర కంటే తక్కువకే సరఫరా అవడం ద్వారా లబ్ధి పొందుతారు.

# మహా మాయగాళ్లు..

పుట్టపర్తి: మోసగాళ్లు ప్రజలను దోపిడీ చేయడానికి ఎంచుకునే ఎత్తుగడలు ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. అమాయకులనే కాదు.. ప్రజాప్రతినిధులు, పోలీసులను సైతం బురిడీ కొట్టిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చోటుచేసుకున్న పలు ఘటనలే ఇందుకు నిదర్శనం. మీ జిల్లాకు చెందిన ఓ కుటుంబం భువనేశ్వర్‌లోని పూరి క్షేత్రంలో చిక్కుకుని తీవ్ర ఇబ్బంది పడుతోందని.. స్పందించి ఆదుకుంటే క్షేమంగా వారి ప్రాంతాలకు పంపుతానంటూ విలేకరి పేరుతో ఫోన్లు చేసి నమ్మించారు. శింగనమల నియోజకవర్గం సోదనపల్లికి చెందిన ఓ కుటుంబం పూరిలో చిక్కుకుపోయిందని.. ఆదుకోవాలంటూ నాలుగు రోజుల కిందట శింగనమల ఎమ్మెల్యే శ్రావణిశ్రీ కార్యాలయానికి ఫోన్ చేశారు. ఆమె నమ్మి వారికి సాయం చేయాలని స్థానిక సీఐ కౌలుట్లయ్యకు సూచించారు. ఆయన తన ఫోన్‌పే నుంచి రూ.10 వేలు పంపించారు. బుధవారం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కార్యాలయానికి ఫోన్ చేసి అనంతపురంలోని ఆదర్శకాలనీకి



చెందినవారు పూరిలో ఇబ్బందులు పడుతున్నారంటూ ఫోన్ చేశారు. వారు ఆరా తీయగా అవాస్తవమని తేలింది. అదే ఫొటోను ధర్మవరం పట్టణంలోని శారదానగర్‌కు చెందిన ఓ కుటుంబం పూరి క్షేత్రంలో చిక్కుకుందంటూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్‌యాదవ్ కార్యాలయానికి ఫోన్ చేశారు. ఆయన తన అనుచరుడు హరీశ్‌కు చెప్పడంతో వారు నమ్మి నగదు పంపించారు. తమ ప్రాంత ప్రజలు ఇబ్బందిలో ఉన్నారని తెలిస్తే ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించి ఆదుకుంటారన్న ఉద్దేశంతో మోసగాళ్లు ఈ ఎత్తుగడను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ మహామాయగాళ్ల మాటలను నమ్మి మోసపోకుండా..అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

# జ్ఞాన శకటం.. నైపుణ్య మకుటం

మంగళగిరి : వేగంగా మారుతున్న సమాజంలో ఆధునిక సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మంత్రి నారా లోకేశ్ సూచనతో సెంట్రల్ టెక్ సొల్యూషన్స్, ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు సంయుక్తంగా మొబైల్ బస్సును 2024లో ప్రవేశపెట్టాయి. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సాంకేతిక అంశాలను వివరిస్తున్నారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఇప్పటి వరకు 15 వేల మందికి అవగాహన కల్పించినట్లు నిర్వాహకు



లు తెలిపారు. గత మూడు రోజులుగా మంగళగిరిలోని సీకే బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఈ బస్సును ఏర్పాటు చేసి విద్యార్థులకు వివిధ రంగాల్లో 'సెన్సార్' వ్యవస్థ వల్ల ఉపయోగాలు, దాని పనితీరును దృశ్య రూపంలో వివరిస్తున్నారు. ఉదాహరణకు, ఒక గ్రామంలో వీధిదీపాలు వెలిగించాలంటే అక్కడ పంచాయతీలో పనిచేసే సిబ్బంది ప్రతి వీధికి వెళ్లి విద్యుత్తు దీపాలను వెలిగించాల్సి ఉంటుంది. కానీ సెన్సార్ సిస్టంతో ఒక చో నుంచే ఆ పనులన్నీ చేయవచ్చు. రైల్వే గేట్ల నిర్వహణ, సిగ్నలింగ్ వ్యవస్థలో సెన్సార్ ఆవశ్యకతను వివరించారు.

# ముంచుతున్న మంచు!

పెనుగొండ : కాలువల ద్వారా సకాలంలో నీరు విడుదల చేసినా.. ఎరువులు సమృద్ధిగా ఉన్నా.. ప్రతికూల వాతావరణం రబీ వరి చేలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దాదాపు అన్ని ప్రాంతాల్లో నాట్లు పూర్తికాగా చలి, పొగ మంచు తీవ్రతతో పైరు పెరుగుదల ఆశాజనకం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా రబీ సీజన్లో సూర్యరశ్మి, సమాన ఉష్ణోగ్రతలు ఉండటంతో వరి దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ఈ ఏడాది మాత్రం ఎరువులు వేసినా పైరు ఏపుగా పెరగకుండా గిడసబారిపోయినట్లు మారడంతో దిగుబడులపై ప్రభావం ఉంటుందని రైతులు చెబుతున్నారు. జింకు లోపంతో.. చలి తీవ్రత, ఖరీఫ్ పంటకు సంబంధించిన దుబ్బుల మోళ్లు భూమిలో కలవక పోవడంతో జింకు ధాతువు సమస్య ఉత్పన్నమైంది. దీంతో ఎరువులు వేసినా మొక్కలు ఎదగకుండా ఆకులపై తుప్పుమచ్చలు వస్తున్నాయి. దీనిని నిర్లక్ష్యం చేస్తే దిగుబడి తగ్గిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తగిన సస్యరక్షణ చర్యలతో ఈ సమస్యను అధిగమించవచ్చని పేర్కొంటున్నారు.



**ఎరువుల యాజమాన్యంలో మార్పులు**

చలి, పొగ మంచు ప్రభావంతో మొక్కలు భూమిలో పోషకాలను పూర్తిస్థాయిలో గ్రహించలేవు. ఈ నేపథ్యంలో ఎరువుల యాజమాన్యం లో మార్పులు చేయాలి. మూడు విడతల్లో వేసే ఎరువులను నాలుగు విడతల్లో వేయాలి. సల్ఫర్ ఎరువులు వాడకూడదు. ప్రత్యామ్నాయంగా 16:16:16, 10.26.26, 14.35.14 ఎరువులు వేయాలి.

జడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి

జిల్లాలో వరి సాగు విస్తీర్ణం: 89 వేల హెక్టార్లు

ఇప్పటి వరకు నాట్లు పడిన విస్తీర్ణం: 82,600 హెక్టార్లు

# అడిగేదెవరు.. అమ్మేద్దాం



చిత్తూరు: చిత్తూరు నగరం తేనెబండలోని జగనన్న కాలనీ ఇది. ఇక్కడ వైకాపా హయాంలో అనర్హులకూ ఇంటి స్థలాలు కేటాయించారు. భారీ భవంతులు నిర్మించుకున్నారు. అనర్హులకూ పట్టాలు ఇప్పించారు. ఈ ప్రాంతం జాతీయ రహదారిని ఆనుకుని ఉంది. బినామీల పేరుతో స్థలాలు దక్కించుకున్న వ్యక్తులు ఎన్నికల తర్వాత రూ.5 లక్షలు– రూ.6 లక్షలకు అమ్మేశారు. ప్రస్తుతం మురకంబట్టు ప్రాంతంలోనూ పలువురు ఇదే తరహాలో ఇంటి పట్టాలను రూ.6 లక్షలు– రూ.8 లక్షలకు విక్రయిస్తున్నారు. శ్రీకాళహస్తి, చంద్రగిరి వంటి నియోజకవర్గాల్లో రూ.5 లక్షలు– రూ.10 లక్షల వరకు పట్టాలను విక్రయిస్తున్నారు. చిత్తూరు, కుప్పం, వెంకటగిరి, సత్యవేడులో రూ.2 లక్షలు– రూ.5 లక్షలకు అమ్మేస్తున్నారు. అనధికారికంగా ఒప్పందాలు కూడా చేసుకుంటున్నారు.వైకాపా అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ నాయకులు జగనన్న కాలనీలను ధనార్జన క్షేత్రాలుగా మార్చుకున్నారు. పేదలకు చెందాల్సిన స్థలాలను హస్తగతం చేసుకుని అమ్మేసుకున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇలా ఫ్యాను పార్టీ చోటామోటా నేతలు కోట్ల రూపాయలు సంపాదించుకున్నారు. ఎన్నికల తర్వాత కూటమి అధికారంలోకి రావడంతో వారి స్పీడ్‌కు బ్రేక్‌లు పడ్డాయి. ఇప్పుడు కొన్నిచోట్ల కూటమి నాయకులతో కలిసి పట్టాలను విక్రయించే పనిలో పడ్డారు. మరికొన్ని చోట్ల అధికార పార్టీ నేతలే దందాలో ముందుంటున్నారు.

**ఎవరిని కలవాలో చెబుతూ..**

ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి జిల్లాలో అడపాదడపా తప్ప పెద్దగా ఇంటి స్థలాలు కేటాయించడంలేదు. కొందరికి మాత్రం ఖాళీగా ఉన్న జగనన్న కాలనీల్లో స్థలాలు చూపిస్తున్నారు. దాంతో ఇళ్లు కట్టుకోవాలని అనుకుంటోన్న మిగతావారు ప్రైవేటు స్థలాలు కొనేందుకు వెళ్తున్నారు. రియల్ వ్యాపారులు చెప్పే ధరను చూసి భయపడుతోన్న సామాన్యులు తిరిగి రెవెన్యూ యంత్రాంగాన్ని, దళారులను ఆశ్రయిస్తున్నారు. కొందరు వీఆర్వోలు గతంలో పట్టాలు పొందిన వైకాపా నేతల పేర్లను సూచిస్తున్నారు. అధికారం మారిన నేపథ్యంలో కూటమి నాయకులు కొందరు వారికి జత కలుస్తున్నారు.

**ఇప్పటికీ వారిదే హవా**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఊరందూరు, రాజీవ్‌నగర్‌పై వైకాపా నేతలు గద్దల్లా వాలారు. ఇప్పటికీ అక్కడ వారే హవా చూపిస్తున్నారు. భూసేకరణలో డబ్బులు నొక్కేసిన నాయకులు, చివరకు పట్టాలను పప్పుబెల్లాల్లా అమ్మేశారు. ఊరందూరు లేఅవుట్‌కు 175 ఎకరాలు సేకరించి 4,650 గృహ నిర్మాణాలకు ఆమోదం తెలిపారు. ఈ కాలనీ కేంద్రంగానే ఫ్యాను పార్టీ శ్రేణులు కోట్ల రూపాయలు సంపాదించారనే ఆరోపణలున్నాయి.

# కొత్తదారిలో గీత దాటొద్దు



నందికొట్కూరు : శివరాత్రి సమీపిస్తోంది. వేలాది మంది మాలధారులు కాలినడకన శ్రీశైలానికి చేరుకుంటారు. మల్లన్నను దర్శించుకునేందుకు తాపత్రయపడుతుంటారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచి నడక ప్రారంభమవుతుంది. 340సీ జాతీయ రహదారిపై రద్దీ పెరగనుంది. ఈ నేపథ్యంలో తగిన నిబంధనలు పాటిస్తూ ముందుకు సాగితే స్వామి చెంతకు సులువుగా చేరుకోవచ్చు.

**66 కి.మీ. మేర**

ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్‌ప్లాజా నుంచి ఆత్మకూరు వరకు 66.115 కి.మీ. మేర 340సీ జాతీయ రహదారి ఉంది. గార్గేయపురం వద్ద ఎన్‌హెచ్‌పై భక్తుల నడక ప్రారంభమవుతుంది. ఆత్మకూరు తర్వాత కర్నూలు–గుంటూరు పాత రోడ్డు.. వెంకటాపురం వరకు మరో 20 కి.మీ. నడవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి నల్లమలలో ప్రయాణం సాగుతుంది. కేజీ రహదారిపై వాహనాలు మితిమీరిన వేగంతో వెళుతుంటాయి. శివభక్తులు జాగ్రత్తలు తీసుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది.

**పైవంతెనలపై వెళ్లొద్దు**

340సీ జాతీయ రహదారిలో గార్గేయపురం, నందికొట్కూరు తదతర నాలుగుచోట్ల పైవంతెనలు ఉన్నాయి. వీటిపై వాహనాల రద్దీ ఉంటుంది. ఈ వంతెనలపై భక్తులు వెళితే ప్రమాదాలకు ఆస్కారం ఉంది. సర్వీసు రోడ్డుపై వెళ్లడం శ్రేయస్కరం. రెండు వరుసల రోడ్డుపై కాకుండా పక్కనే ఉన్న తెల్లగీత లోపు వెళ్తే సురక్షితంగా ఉంటుంది.

**ఇవి పాటిస్తే మేలు**

మాలధారులు ఉదయం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు నడవాలి. రాత్రి వేళలో దుస్తులు, చేతికర్రలకు రేడియం స్టిక్కర్లు ఉంటే వాహనాల వెలుగులో మెరుస్తాయి. ఫలితంగా ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చు. రెండు వరుసల మార్గంలో ఇష్టానుసారంగా వెళ్లకుండా ఎడమవైపు నడవాలి.

ఒక్కొక్కరుగా కాకుండా గుంపులుగా ప్రయాణం సాగించాలి.

రహదారి క్రాసింగ్ వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

# కథ కంచికి.. కంత్రీల మంచికి..!



హనుమాన్జంక్షన్ : గన్నవరం..సహజ వనరుల కేంద్రం..ఎత్తయిన కొండలు, గుట్టలు, చెరువులు, పోలవరం కట్టలు..ఇలా చెప్పుకొంటూ పోతే రబ్బీసు, మట్టి, గ్రావెల్ వంటి వనరులు సహజ సిద్ధంగా లభ్యమయ్యే ప్రాంతం. గత వైకాపా ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా నియోజకవర్గంలో దోపిడీ కొనసాగింది. ఎవరికివారే కొండల్ని తొలిచేశారు, గుట్టల్ని, కట్టల్ని కరిగించేశారు. నిబంధనలు ఉల్లంఘించి రూ.కోట్లు దండుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దీనిపై సమగ్ర విచారణ చేపట్టిన అధికారులు మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, అతని అనుచరులపై కేసు పెట్టి సరిపెట్టేశారు.

నేతల మోహరింపు: వైకాపా అధికారంలోకి వచ్చి రావడంతోనే గన్నవరంపై కన్నేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు గుంటూరు, కడప జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు తవ్వకాల దందాకు తెరలేపారు. నామమాత్రపు అనుమతులతో తాత్కాలిక లీజులు దక్కించుకుని వనరుల్ని కొల్లగొట్టేశారు.

గంపగుత్తగా దోచేశారు: ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ మంత్రులు, ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, పక్క జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి, మాజీ సీఎం వ్యవహారాలు పర్యవేక్షించిన ఓ కీలక వ్యక్తి, ఓ యువనేత తాత్కాలిక పర్మిట్లు పొంది, అడ్డూ అదుపూ లేకుండా తవ్వకాలు సాగించారు. ప్రధానంగా కొండపావులూరు, గొల్లనపల్లి, వెదురుపావులూరు, పురుషోత్తపట్నం, సూరంపల్లిలో ప్రభుత్వ కొండలు, భూములతో పాటు, విజయవాడ గ్రామీణం మండలం నుంచి బాపులపాడు మండలం వరకు పోలవరం కుడికాల్వ గట్లను ఎడాపెడా తవ్వేశారు. ఒక్క విడతలోనే దాదాపు 17లక్షల ఘనపు మీటర్లకు 20 దరఖాస్తులతో అనుమతులు పొంది, అంతకు మూడింతలు తవ్వారు. పోలవరం కట్టపై 113 చోట్ల 5లక్షల ఘనపు మీటర్ల తవ్వకానికి అనుమతి తీసుకుని, గట్లు ఆనవాల్లేకుండా చేసేశారు.

విచారణేదీ?: గన్నవరంలో జరిగిన అక్రమాలు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరాచకాలపై కూటమి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో వంశీ, ఆయన అనుచరులు రూ.195 కోట్ల గ్రావెల్, మట్టి దోపిడీకు పాల్పడినట్లుగా నిర్ధారించి, గనులశాఖ అధికారులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి అరెస్టు చూపారు. మిగతా నేతల తవ్వకాలు, తరలింపు వ్యవహారంలో ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు. ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర దర్యాప్తు సాగిస్తే నేతల దోపిడీ డొంక కదులుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఆసుపత్రులకు వెళ్లడమే.. అసలు పరీక్ష!

నరసాపురం : ప్రభుత్వ శాఖల్లో సేవలను వేగంగా.. సులభంగా పొందేలా నూతన సాంకేతికత, డిజిటల్ విధానాలు అమలు చేస్తున్నారు. కానీ వైద్య ఆరోగ్యశాఖలో ప్రాథమిక స్థాయిలో పదేళ్ల నాటి క్లస్టర్ విధానాన్ని నేటికీ కొనసాగిస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలు, రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గర్భిణులకు 'ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్'లో ప్రతి నెలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. దీని కోసం మాతా, శిశు ఆరోగ్య (ఎంసీహెచ్) కార్డులను ప్రభుత్వం జారీ చేస్తోంది. ఈ కార్డులతో గర్భిణులు, బాలింతలకు దేశంలో ఎక్కడైనా ప్రతి నెలా 9న వైద్య పరీక్షలు నిర్వహించి తగు ఔషధాలు అందించాల్సి ఉంది ఉన్నతాధికారులు ఏఎన్ఎంలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు లక్ష్యాలను నిర్దేశించడంతో సిబ్బంది గర్భిణులు, బాలింతలను తమకు కేటాయించిన కేంద్రాలకు తీసుకువెళ్లి పరీక్షలు, చికిత్సలు చేయిస్తున్నారు.

**ఇదీ పరిస్థితి..**

మొగల్తూరు మండలం కాళీపట్నంపడమర గ్రామానికి గతంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మంజూరైంది. కానీ భవన నిర్మాణం జరగలేదు. దీంతో సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాతపాడు, కాళీపట్నం, జగన్నాథపురం, కోమటితిప్ప గ్రామాలకు చెందిన వారు మొగల్తూరు పీహెచ్‌సీకి రావాల్సి వస్తోంది.

భీమవరం మండలం తుందుర్రు పీహెచ్‌సీకి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న యనమదుర్రు, దిరుసుమర్రు, నాగిడిపాలెం గ్రామాలను అనుసంధానించారు. ఈ గ్రామాల ప్రజలు, గర్భిణులు భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిని దాటుకుని తుందుర్రు పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తోంది.పాలకొల్లు మండలం దిగమర్రు, నరసాపురం మండలంలో



చిట్టవరం, గొంది గ్రామాలను సుదూరంలో ఉన్న యలమంచిలి పీహెచ్‌సీ, పాలకొల్లు మండలం ఉల్లంపర్రు, సగంచెరువు, గోరింటాడ గ్రామాలను మేడపాడు పీహెచ్‌సీకి అనుసంధానం చేశారు.

నరసాపురం మండలంలో ఎల్బీచర్ల, తూర్పుతాళ్లు గ్రామాల్లో పీహెచ్‌సీలు ఉన్నాయి. తుందుర్రు పీహెచ్‌సీకి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కె బేతపూడిని ఎల్బీచర్ల పీహెచ్‌సీ పరిధిలో చేర్చారు. మార్గంలో ఉన్న కొప్పర్రు, మల్లవరం, లిఖితపూడి తదితర గ్రామాలను, మొగల్తూరు పీహెచ్‌సీకి కిలోమీటరు దూరంలో ఉన్న రాజుగారితోట గ్రామాన్ని ఎల్బీచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో చేర్చారు.

వీరవాసరం పీహెచ్‌సీలో ఇన్ఛార్జి వైద్యుడు సేవలు అందిస్తున్నారు. ఈ కేంద్రానికి పాలకోడేరు మండల పరిధిలో శృంగవృక్షం, విస్సాకోడేరు తదితర గ్రామాలను అనుసంధానం చేశారు.

**ఎక్కడైనా సేవలు పొందొచ్చు**

'ప్రజలు ఏ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్నా.. వారికి అందుబాటులో ఉన్న ఆసుపత్రిలో సేవలు పొందొచ్చు. ఎవరైనా దీనికి అభ్యంతరం తెలిపితే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం' అని డీఎంహెచ్వో గీతాబాయి తెలిపారు.

# కాలితే మిగిలేది బుగ్గే

పొదిలి : పొగాకు రైతులకు మార్కెట్లో ధరలే కాదు పంట చేతికి దక్కడం అగ్ని పరీక్షగా మారింది. ప్రకృతి వైపరీత్యాలను అధిగమి ంచినా ఆకు కాల్పు సమయంలో చిన్నపాటి పొరపాట్లతో భారీగా నష్టపోతున్నారు. జిల్లాలో 32 వేల మంది పొగాకు రైతులు, సుమారు 25 వేల బ్యారన్లు ఉన్నాయి. ప్రస్తుతం ముమ్మరంగా క్యూరింగ్ జరుగుతోంది. ఈ సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా బ్యారన్ కాలిబూడిదవుతుంది. ఏటా సరాసరిన 40 నుంచి 50 బ్యారన్లకు పైగా అగ్నికి ఆహుతవుతుండగా లక్షల రూపాయలు విలువ చేసే పంట, సామగ్రి కాలిపోతుంది. దీంతో నష్టంతో పాటు మిగిలిన ఆకు కాల్పునకు ఆటంకం కలుగుతుంది. ఎక్కువ మంది రైతులు బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటారు. వారు బ్యారన్కు బీమా చేయించడం లేదు. అనుకోని సంఘటన జరిగినప్పుడు వారు భారీగా నష్టపోవాల్సి వస్తోంది. పొదిలి వేలం కేంద్రంలో ఐదు వేల మంది రైతులు ఉంటే వారిలో 300 మంది మాత్రమే బ్యారన్లకు బీమా చేయించుకున్నట్లు అధికారులు చెప్పారు. రైతులు చైతన్యవంతులైతే



నష్టపోయినప్పుడు పరిహారం పొందడానికి అవకాశం ఉంటుంది.

**ఇటీవల సంఘటనలు**

పొదిలి మండలం రామాపురంలో ఓ రైతు బ్యారన్ కాలిపోయి రూ.5 లక్షల మేర నష్టపోయాడు. నాగులుప్పలపాడు మండలంలో ఓ మహిళా రైతు బ్యారన్లో కర్రలు గొట్టాలపై జారిపడి ఒక్కసారిగా మంటలు చెలరేగి నష్టం జరిగింది.

**ప్రతి రైతు ముందుకు రావాలి**

– గిరిరాజ్కుమార్, వేలం కేంద్రం నిర్వహణాధికారి, పొదిలి

పొగాకు బ్యారన్ లైసెన్సు నవీకరణ సమయంలోనే బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని రైతులకు చెబుతున్నాం. పొదిలి, కనిగిరి ప్రాంతంలో ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు బయట బీమా కంపెనీల దగ్గరైనా చేయించుకోవచ్చు. ప్రీమియం తక్కువే ఉంటుంది.

# 'మహారాజా'.. మీ సేవలు బాగు

విజయనగరం : వివిధ విభాగాల్లో సేవల గురించి తెలుసుకునేందుకు ప్రభుత్వం ఐవీఆర్ఎస్ను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా డిసెంబరు నెలకు సంబంధించి విజయనగరంలోని మహారాజా ఆసుపత్రి విషయంలో 73 శాతం మంది సంతృప్తి చెందారని సంబంధిత అధికారులు తెలిపారు. ఈమేరకు రాష్ట్రస్థాయిలో ఇది రెండో స్థానాన్నికైవసం చేసుకుంది. మందుల సరఫరా, అందుబాటులో వైద్యులు, పరిసరాల శుభ్రత, ఇతరత్రా అంశాలను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులను కేటాయించారు.

**సర్వేలో 2,882 మంది..**

గత నెలలో నిర్వహించిన సర్వేలో 2,882 మంది రోగులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇందులో 27 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన వారంతా టాప్ పెర్ఫార్మింగ్ రేటింగ్స్ ఇచ్చారు. అత్యధికంగా రోగుల రద్దీ, సవాళ్లు, పడకల కొరత ఉన్నా మెరుగైన సేవలు అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ పద్మజ పేర్కొన్నారు. పారిశుద్ధ్యం విషయంలో 37.05 శాతం మంది నుంచి ప్రతికూల స్పందన రావడంపై ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

# వాటాలు తేలే.. జనం మునిగే!

విశాఖపట్నం: థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ద్వారా వచ్చే ఫ్లైయాష్ (బూడిద) రవాణా కొందరికి కాసులు కురిపిస్తోంది. నగరవాసులను మాత్రం కాలుష్యం సుడిలోకి నెట్టేస్తోంది. అన్నీ తెలిసినా కొందరు ప్రజాప్రతినిధుల జోక్యం ఉండటంతో అధికారులు పట్టించు కోవడం లేదు. ఇప్పటికే దిల్లీని మించి విశాఖలో గాలి నాణ్యత దెబ్బతిన్నట్లు గణాంకాలు చెబు తున్నాయి. మరోవైపు నేతల కమీషన్ల కోసం ప్రతిరోజూ నిబంధనలకు విరుద్ధంగా వెళుతున్న వందల లారీలతో కాలుష్యం మరింత పెరిగిపోతోంది.

**డిమాండ్ పెరగడంతో:** విశాఖ నగరానికి సమీపంలో ఉన్న రెండు థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నుంచి బూడిద రవాణా అవుతుంది. గతంలో ఉచితంగా ఇచ్చేవారు. ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో టెండర్లు పిలుస్తున్నారు. సిమెంటు, ఇటుక పరిశ్రమలు, జాతీయ రహదారుల నిర్మాణానికి ఫ్లైయాష్ వెళుతుండగా... మరో రకమైన సైలో యాష్‌ను పోర్టు నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఓ సంస్థ పిట్టవాని పాలెం వద్ద వెయ్యి ఎకరాల్లో, ఇంకో సంస్థ పాలవలస వద్ద 300 ఎకరాల్లో ఫ్లైయాష్ నిల్వ చేస్తుంటాయి. ఈ ప్రాంతాల నుంచి లారీలు మొదలై దేశపాత్రునిపాలెం, ఏలేరు కాల్వ మీదుగా జాతీయ రహదారిపైకి వస్తున్నాయి. ప్రతిరోజూ 300పైగా లారీలు బూడిద రవాణా చేస్తున్నాయి.



**నిత్యం అవస్థలు..**

ప్లాంట్‌ల నుంచి బూడిద రవాణా చేసే సమయంలో పరిమితికి మించి నింపేస్తున్నారు. కొన్ని సార్లు టార్పాలిన్ పట్టాలు కప్పకుండానే తరలిస్తున్నారు. మరికొన్ని లారీలకు కప్పినా ఓవర్‌లోడు కారణంగా కుదుపుల సమయంలో బూడిద జారి రోడ్లపై పడుతోంది. గాలికి ఆ బూడిద లేచి ద్విచక్ర వాహన చోదకులు, ఆటో ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల వెంబడి ఉండే దుకాణదారులు, ఇళ్లపై బూడిద కమ్మేసి శ్వాసకోశ సమస్యలు, కళ్ల మంటలతో అల్లాడుతున్నారు.

**అంతా మేం చూసుకుంటామంటూ:** ప్లాంట్ల నుంచి బూడిద రవాణా చేసే బాధ్యతలు టెండర్లలో ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు దక్కించుకున్నా.. తరువాత ఉప గుత్తేదారులకు ఇచ్చేస్తున్నారు. దీనికీ ఓ కారణం ఉంది. చెప్పినట్లు వినకపోతే..బూడిదతో ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానికుల నుంచి ఆందోళనలు తప్పవనే సంకేతాలను నేతలు పంపుతున్నారు. అలా కొందరు నేతలు చెప్పినవారికి కాంట్రాక్టు అప్పగించాక ప్రతి ట్రిప్పునకు వాటాలు మాట్లాడు కుంటున్నారు. ఇద్దరు ప్రజాప్రతినిధుల కీలక అనుచరులు ఈ కమీషన్ల వసూళ్ల వ్యవహారం చూస్తున్నట్లు సమాచారం.


# గుజరాత్‌కు గుట్టుగా బియ్యం

ఆదోని : పేదల బియ్యం సరిహద్దు దాటుతోంది.. ఇన్నాళ్లు కర్ణాటకలోని బియ్యం మిల్లులకు తరలిస్తున్న వ్యాపారులు ప్రస్తుతం 'రూట్' మార్చారు. లాభం ఎక్కువగా ఉండటంతో గుజరాత్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు తీసుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారు. గత నెలలో 35 టన్నులతో వెళ్తున్న లారీ మాధవరం తనిఖీ కేంద్రం వద్ద పట్టుబడింది. ఇలా ప్రతి నెలా 10 నుంచి 15 లారీల వరకు వెళ్తున్నట్లు అంచనా. ఒక్కోలారీపై రూ.2 లక్షల వరకు లాభం గడిస్తున్నారు. వీటిని ప్రతి నెలా మొదటి వారంలో అర్ధరాత్రి దాటిన తర్వాత సరిహద్దులు దాటిస్తున్నారు. మాధవరం, హొళగుంద, నాగలదిన్నె వంతెన మీదుగా గుట్టుగా తరలిస్తున్నారు.

**ప్రతి నెలా రూ.30 లక్షల ఆదాయం** రేషన్ బియ్యం దందా చేసే అక్రమార్కులు గతంలో కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప, సింధనూరు, రాయచూరు ప్రాంతాలకు తరలించేవారు. అక్కడ కిలో రూ.24 నుంచి రూ.28 పలుకుతోంది. ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రంలోని సూరత్, అహ్మదాబాద్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో డిమాండు ఉండటంతో అక్కడికి తరలిస్తున్నారు. అక్కడ కిలో రూ.34- రూ.40 పలుకుతోంది.ఒక లారీ(పెద్దది)లో 30 నుంచి 35 టన్నుల వరకు తీసుకెళు తున్నారు. ఒక్కో లారీపై రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు లాభం చేకూరుతుంది. ఇలా ఏటా రూ.2.50 కోట్ల నుంచి రూ.3.50 కోట్ల వరకు సొమ్ము చేసుకుంటున్నారు.

**తనిఖీ కిట్లు ఏమైనట్లు** బియ్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తనిఖీల్లో పట్టుబడిన బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసినవో కాదో కనిపెట్టేందుకు రసాయనాలతో కూడిన ర్యాపిడో కిట్లు గతేడాది నవంబరులో అందించారు. కర్నూలు జిల్లాకు 20, నంద్యాల జిల్లాకు 15 కిట్లు వచ్చాయి.

పట్టుబడిన బియ్యాన్ని ర్యాపిడో కిట్లలోని రెండు రకాల రసాయనాలతో పరీక్షిస్తారు. ఎరుపు రంగులోకి మారితే రేషన్ బియ్యంగా తేలుస్తారు. ఇప్పటి



వరకు వీటిని వినియోగించినట్లు దాఖలాలు లేవు.

**సేకరణకు ఏజెంట్ల నియామకం**

ఉమ్మడి జిల్లాలో 12.10 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఒక్కో లబ్ధిదారుడికి ప్రతినెలా 5 కిలోల బియ్యం ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. ఇందుకు ప్రభుత్వం ఒక కిలోకు రూ.46 ఖర్చు చేస్తోంది. ప్రతినెలా ఉమ్మడి జిల్లాకు 19 వేల మెట్రిక్ టన్నులు కేటాయిస్తున్నారు.

బియ్యం వ్యాపారులు కొందరు పేదలను ఏజెంట్లుగా నియమించుకొంటున్నారు. వారు క్షేత్రస్థాయిలో తిరుగుతూ కార్డుదారుల వద్ద సేకరిస్తున్నారు. రూ.15 నుంచి రూ.18 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. అలా సేకరించిన బియ్యాన్ని వీధుల్లో ఓ చోట నిల్వ చేస్తున్నారు. కొంత మొత్తం పోగైన తర్వాత సదరు వ్యాపారి వాహనం వచ్చి తీసుకెళ్తోంది.

రేషన్ కార్డుదారులకు ప్రతినెలా ఉచితంగా అందజేస్తున్న పోషక విలువలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన లేక లక్షలాది మంది తినడం లేదు. 60 శాతం మంది వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

జిల్లా కర్నూలు
చౌక దుకాణాలు: 1,233
రేషన్ కార్డులు: 6,73,526
మొత్తం సభ్యులు: 11,685.090
ప్రతినెలా బియ్యం కేటాయింపు (టన్నుల్లో): 22,51,764

# కన్నేస్తారు.. కట్టేస్తారు



కదిరి : కదిరి పురపాలక పరిధిలో ఆక్రమణలకు అంతు లేకుండాపోతోంది. అక్రమార్కులు వాగులు, వంకలనూ వదలడం లేదు. దర్జాగా కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. కదిరి-రాయచోటిరోడ్డు నుంచి హిందూపురం రోడ్డు వరకు మూడు కిలోమీటర్ల మేర వాగు పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించుకుని ఇళ్లు కట్టడమే ఇందుకు నిదర్శనం. ఇంత జరుగుతున్నా పట్టణ ప్రణాళిక, నీటిపారు దలశాఖ అధికారులు కన్నెత్తి చూడలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి సమీపంలోని విఠల్‌రాయునిచెరువు మరవవాగు పట్టణ పరిధిలో సుమారు కిలోమీటరు వరకు విస్తరించి ఉంది. ఇక్కడ సెంటు స్థలం రూ.15 లక్షల వరకు పలుకుతోంది. నిజాంవలి కాలనీకి వెళ్లే మార్గంలో సుమారు మూడు సెంట్ల స్థలంలో రెండేళ్ల కిందట ఇంటి నిర్మాణం చేపట్టారు. స్థానికుల ఫిర్యాదుతో రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదలశాఖ అధికారులు నిర్మాణాన్ని అడ్డుకుని నోటీసులు ఇచ్చారు. తాత్కాలికంగా వెనక్కి తగ్గిన వ్యక్తులు తిరిగి నిర్మాణ పనులకు సిద్ధమవుతున్నారు.ఇదే వాగును ఆక్రమిస్తూ మరో నాలుగైదు పునాదులు వెలిశాయి. వాగును పిల్లకాలువలా మార్చేసి పక్కనే ఉన్న అరవకొట్టాలకు మట్టి దారి ఏర్పాటు చేసుకున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తుమ్మలరోడ్డు సమీపం నుంచి ప్రారంభమైన మద్దిలేరువాగు పరివాహక ప్రాంతంలోనూ అనుమతి లేకుండా నిర్మాణాలు వెలుస్తున్నాయి. ముఖ్యంగా శివాలయం వెనుక భాగం నుంచి వాసవీనగర్ వరకు తిప్పానమ్మకాలువ, మద్దిలేరువాగు మధ్యలో పదుల సంఖ్యలో బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. ఇందులో వాగుపరివాహక ప్రాంతం కబ్జాకు గురైంది. ఇక్కడ సెంటు స్థలం రూ.20 లక్షలు పలుకుతోంది. పరివాహక ప్రాంతమని తెలిసినా ఇల్లు కట్టుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. 2020లో వచ్చిన భారీ వర్షాల వల్ల ఈ ప్రాంతంలోని ఇళ్లన్నీ జలమయం అయ్యాయి. నెలరోజుల పాటు ఇళ్లలోకి వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. అధికారుల అప్రమత్తతతో ప్రాణనష్టం తప్పింది. భవిష్యత్తులో భారీ వర్షాలు వస్తే ముప్పు తప్పదు.

**నిర్మాణాలను అడ్డుకుంటాం**

– కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కదిరి

మద్దిలేరువాగు, విఠల్‌రాయునిచెరువు మరవవాగుపై నిర్మాణాలు చేపట్టవద్దని ఇప్పటికే పలుమార్లు హెచ్చరించాం. నీటిపారుదలశాఖ అధికారులతో కలిసి పరివాహక ప్రాంతంలో ఇళ్లు కడుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

# చిన్న ముక్కైనా.. కాసుల గలగలే



తిరుపతి : శేషాచలం అడవుల్లోని ఎర్రచందనానికి ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. చెట్టులోని ఏ భాగం కూడా వృథ కాదు. వేరు నుంచి మొదలుకొని చెట్టు బెరడు వరకు కాసులు కురిపిస్తోంది. అందుకే స్మగ్లర్లు వేర్లతో సహ పెకిలించి అక్రమంగా రవాణా చేస్తుంటారు. అలా తరలించే ప్రయత్నంలో పట్టుకున్న ఎర్రచందనం దుంగలతోపాటు.. ఉప ఉత్పత్తులుగా పిలిచే వేర్లు, చిప్స్, చెట్ల నుంచి వేరుచేసిన కొమ్మలు, చిన్నచిన్న కర్రలను సైతం స్వాధీనం చేసుకొని గోదాముల్లో భద్రపరిచారు. ఏటా గోదాముల్లోని దుంగలకు డ్రెస్సింగ్ చేసేందుకు తొలగించిన పేళ్ల (చిప్స్)ను కూడా నిల్వ చేశారు.

**స్థానికంగానే విక్రయం..**

ఎర్రచందనాన్ని అంతర్జాతీయంగా విక్రయించేందుకు గ్లోబల్ టెండర్లు పిలుస్తుంటారు. గత ఐదేళ్లుగా వీటికి ఆశించిన మేర స్పందన లేదు. ఉప ఉత్పత్తులను మాత్రం స్థానిక మార్కెట్లలోనే టెండర్ల ద్వారా విక్రయిస్తుంటారు. వీటికి డిమాండ్ తగ్గడం లేదు. కళాకారులు, ఫార్మా కంపెనీలకు అందుబాటులో ఉండేలా ఈ-వేలం నిర్వహిస్తున్నారు. ఈ ఉప ఉత్పత్తులతో గృహోపకరణాలు, ఆటబొమ్మలు, కొన్ని మందులు, సౌందర్య ఉత్పత్తులు తయారు చేస్తుంటారు.

2025 అక్టోబరులో ఉప ఉత్పత్తులకు ఈ-వేలం నిర్వహించారు. 35 లాట్లుగా సంబంధించిన 143.8 టన్నుల వేర్లు, చిప్స్‌ను కళాకారులు, ఫార్మా కంపెనీల ప్రతినిధులు కొనుగోలు చేశారు. దీంతో అటవీశాఖకు రూ.6.71 కోట్ల ఆదాయం వచ్చింది.

ఈసారి 3,19,985.93 కిలోలు విక్రయించేందుకు టెండర్లు ఆహ్వానించారు. ఇందులో 27 లాట్లుగా విభజించిన 8,865 బ్యాగుల చిప్స్, ఒక లాట్గా సమీకరించిన 162 బ్యాగుల వేర్లు, 17 బ్యాగులుగా విభజించిన ఒక లాట్ చిన్నకర్రలు, 35 బ్యాగుల పలకలు, 913 బ్యాగుల బిల్లెట్స (చతరుస్రాకారంలోఉండే ఎర్రచందనం ముక్కలు), 228 బ్యాగుల్లో భద్రపరిచిన ఎర్రచందనం బండిల్స్ ఉన్నాయి. కపిలతీర్థంలోని జిల్లా ఫారెస్ట్ అధికారి కార్యాలయంలో ఈ నెల 23న వేలం జరగనుంది.

# చలికి గజగజ.. ఆసుపత్రులు కిటకిట



చిత్తూరు : చలి.. మంచు తీవ్రతతో శ్వాసకోశ బాధితులు పెరుగుతున్నారు. చల్లటి వాతావరణం కారణంగా వైరస్, బ్యాక్టీరియా జీవితకాలం పెరగడం.. చలికి ఇంట్లో దగ్గరదగ్గరగా కుటుంబసభ్యులు ఉండటంతో వైరస్ త్వరగా చేరుతుందని వైద్యులు చెబుతున్నారు.

చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో గతంలో ఓపీ 1,200 ఉంటే.. ప్రస్తుతం 2వేలకు పైగా ఉంటోంది. 60శాతానికి పైగా జలుబు, దగ్గు, జ్వరం కేసులే ఉంటున్నాయి. చిన్న పిల్లల వార్డులో 80 శాతం ఇలాంటి కేసులే నమోదవుతున్నాయి.

**రక్తనాళాలు గట్టిపడి..**

అస్తమా, టీబీ వ్యాధికి గురైన వారు, ఊపిరితిత్తుల సమస్య ఎదుర్కొనే వారు, గుండె, డయాలసిస్ చేసుకునే వారు చలి తీవ్రతకు శ్వాసకోశ రోగాలకు గురవుతున్నారు. ముఖ్యంగా హృద్రోగుల రక్తనాళాలు గట్టిపడటం.. ఊపిరి బాగా తీసుకోలేక గుండె పోటుకు గురయ్యే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు అప్రమత్తంగా ఉండాలి.

**చిన్నారుల్లో సమస్యలు..**

చిన్నారులు బ్రాంకియో లైటీస్ వైరల్ ఇన్‌ఫెక్షన్ (బీఎల్‌వీ), రెస్పిరేటరీ సెన్సిటియల్ వైరస్ (ఆర్‌ఎస్‌వీ)ల బారిన పడుతున్నారు. రోజుల తరబడి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.

**టీకా వేసుకోవాలి..**

0-5 ఏళ్లలోపు పిల్లలకు టీకాలు తప్పనిసరి.

పొగతాగడం.. పీల్చడం వల్ల ప్రబలే వ్యాధులకు గురికాకుండా ఏడాదికోసారి చలికాలం ముందు ఫ్లూ వ్యాక్సినేషన్స్ చేయించాలి.

న్యుమోకోకల్ వ్యాక్సిన్ జీవిత కాలంలో ఒకసారి లేదా ప్రతి ఐదేళ్లకోసారి వేసుకోవాలి.

65 ఏళ్లు దాటిన వారు ఊపిరి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వైద్యులను సంప్రదించి వ్యాక్సినేషన్ చేయించుకోవడం మంచింది.

శ్వాసకోశ వ్యాధిగ్రస్థులు ఇతర వ్యాధుల బారిన పడకుండా చికెన్ ఫాక్స్ వ్యాక్సిన్ వేసుకోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి: దయాసాగర్, సత్యనారాయణపురం యూపీహెచ్‌సీ వైద్యులు

ఊపిరితిత్తులతో కఫం చేరుతుంది. ప్రతి రోజు గోరువెచ్చని నీరు, వేడి అన్నం తీసుకోవాలి. చలికాలంలో రక్తకణాల పనితీరు మందగించి గుండెనొప్పి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# జవాను పేరిట 'జాగా'న్నాటకం

కర్నూలు : కల్లూరు గ్రామంలోని సర్వే నంబరు 172లో ఉన్న ఐదెకరాల భూమిని మాజీ సైనికుడి పేరుతో కొట్టేశారు. ప్లాట్లువేసి రూ.కోట్లు ఆర్జించారు. దాని విలువ ప్రస్తుతం రూ.25 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. సర్వే నంబరు 172లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఐదెకరాలను ఆదోనికి చెందిన ఎస్.గోరంట్ల అనే మాజీ సైనికుడికి 1975లో కేటాయించినట్లు చూపించారు. ఆ మేరకు కొన్ని రికార్డుల్లో ఆయన పేరును నమోదు చేశారు.

ఎస్.గోరంట్ల ఆ భూమిలో 2.75 ఎకరాలను తన కుమారుడు ఎస్.గణేశ్‌కు రిజిస్ట్రేషన్ చేసిచ్చారు. గణేశ్ ఆ భూమిని వెబ్‌ల్యాండ్, అడంగల్‌లో నమోదు చేయించుకున్నారు. తన వద్ద మిగిలిన 2.25 ఎకరాల భూమిని కూడా గోరంట్ల తన కుమారుడు గణేశ్‌కు జీపీఏ ఇచ్చారు. దాని ఆధారంగా ఆయన కుమ్మరి వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి జీపీఏ రాశారు. ఆయన ఆ భూమిలో 94 ప్లాట్లు వేసి విక్రయించారు.

**గుట్టుగా రిజిస్ట్రేషన్**

కల్లూరు పరిధిలోని సర్వే నంబరు 172లో ఉన్న స్థలాలు ప్రభుత్వ భూములైతే వాటికి సబ్ రిజిస్ట్రారు కార్యాలయ అధికారులు ఎలా



రిజిస్ట్రేషన్ చేశారో అంతుచిక్కడం లేదు.

నిబంధనలకు విరుద్ధంగా మొత్తం 256 రిజిస్ట్రేషన్లు జరిగాయి.

సర్వే నంబర్లు 172/2, 172/1బి2లు నిషేధిత భూముల జాబితాలో ఉన్నా రిజిస్ట్రేషన్లు చేయడం గమనార్హం.

దీనిపై నగరానికి చెందిన మురళీధర్‌రెడ్డి అనే వ్యక్తి లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. కల్లూరు తహసీల్దారు ఆంజనేయులు విచారణ చేశారు.

**ఇలా గుట్టురట్టు**

గోరంట్ల అనే మాజీ సైనికుడికి 1975లో భూమి కేటాయించినట్లు నిర్ధారించేలా తహసీల్దారు కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులేవీ లేవు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ రికార్డుల ఆధారంగా సర్వే నంబరు 172లో మొత్తం 11.95 ఎకరాల భూమి ఉందని, దాన్ని ప్రభుత్వ డ్రై ల్యాండుగా చూపించారని, ప్రభుత్వ భూమి కావడంతో ఆ సర్వే నంబరులోని భూమి మొత్తాన్ని 22(ఎ)లో ఉంచారని నిర్ధారించారు. " అక్రమాలు జరిగిన విషయం వాస్తవమే. ఈమేరకు ఆర్డీవోకు, లోకాయుక్తకు నివేదిక ఇచ్చా. తదుపరి చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు నివేదించామని" తహసీల్దార్ కె.ఆంజనేయులు తెలిపారు.

**అమ్ముకుంటున్నా అటువైపు చూడలేదు**

తప్పుడు పత్రాలు సృష్టించి ప్రైవేటు వ్యక్తులు భూమిని తమ ఆధీనంలోకి తీసుకున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. వాగు బఫర్ జోన్‌లోకి వచ్చే ఆ భూమిని వాస్తవానికి ఎవరికీ కేటాయించకూడదు. దానిని కొందరు చదును చేసి నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ వేసి విక్రయిస్తున్నా ఎవరూ అటువైపు చూడలేదు. విద్యుత్తు స్తంభాలు, కచ్చా రహదారులూ వేశారు. వాగు కనిపించకుండా గోడకట్టేశారు. నాటి తహ సీల్దారు టి.వి.రమేశ్‌బాబు నిబంధనలకు విరుద్ధంగా ఆ ప్రాంతంలోని కొంత భూమిని మ్యుటేషన్ చేసినట్లు కొందరు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు.

# చెరువు గట్టున 'భూ'తాలు

నంద్యాల : జిల్లా కేంద్రంలో స్థిరాస్తి వ్యాపారుల అక్రమాలకు అడ్డూఅదుపులేకుండా పోయింది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను కాజేస్తున్నారు. ఏకంగా చెరువు గట్టును ఆక్రమించుకొని తమ స్థిరాస్తి వెంచర్లలో కలిపేసుకొని విక్రయిస్తున్నారు. నంద్యాల పట్టణ శివారులో పెద్ద చెరువు వందల ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇక్కడ ప్రస్తుతం సెంటు రూ.15 లక్షలు పలుకుతోంది. ఇక్కడ స్థలాలకు డిమాండ్ ఉండటంతో చెరువు చుట్టూ ప్రైవేటు స్థలాల్లో పదుల సంఖ్యలో వెంచర్లు వెలిశాయి. చెరువు దిగువన వెంచర్ల నిర్వాహకులు 'కట్ట'ను తమ దారిగా చూపిస్తున్నారు. సర్వే నంబర్లు 2320, 2321, 2322, 2311, 2312లోని 10 ఎకరాల భూమిని కబ్జా చేశారు. కట్టను ఆక్రమించి, రోడ్లు ఇతర నిర్మాణాలు చేపట్టారు. ఈ స్థలం కేసీ కాల్వ పరిధిలో ఉంటుంది.

**సెంటు రూ.15 లక్షల పైమాటే**

పెద్ద చెరువు దగ్గర వెలిసిన వెంచర్లలో ప్రస్తుతం సెంటు ధర రూ.15 లక్షలుగా ఉంది. ప్రస్తుతం ఆక్రమిత ప్రాంతం సుమారు ఎకరం వరకు ఉంది. అంటే రూ.15 కోట్ల కేసీ కెనాల్ భూమి ఆక్రమణలో ఉంది. కేసీ కెనాల్ పోరంబోకు భూమిని ఆక్రమించి వెంచర్లు వేస్తున్నా.. అధికారులు అనుమతులు ఇవ్వడంతో అనుమానాలకు తావిస్తోంది. రాజకీయ అండదండలతోనే అక్రమార్కులు చెలరేగిపోతున్నారనే



విమర్శలున్నాయి.

**40 అడుగుల రోడ్డు**

పెద్ద చెరువును ఆనుకొని ఉన్న పోరంబోకు భూమిని తమ వెంచర్లలో కలిపేసుకొన్నారు. ఏకంగా ఫెన్సింగ్ వేసి తమ వెంచర్ల వరకు 40 అడుగుల మేర రహదారి నిర్మించుకున్నారు. కట్ట మీద నుంచి పోరంబోకు భూమి మీదుగా వెంచర్లలోకి వెళ్లే విధంగా దీన్ని నిర్మించడం గమనార్హం. వెంచర్‌దారులు పట్టణ ప్రణాళిక విభాగం, 'కుడా'కు సమర్పించిన పత్రాల్లోనూ చెరువు కట్ట రోడ్డును తమ భూమిగా చూపించి అనుమతులు పొందారు.ఎస్‌బీఐ కాలనీ నుంచి ఎన్జీవో కాలనీ వరకు (పెద్ద చెరువు ఒక వైపు) 6 కి.మీ.ల పొడవునా ఉన్న 40 అడుగుల రోడ్డును ఆనుకుని వెంచర్లు వేసిన వ్యాపారులు కొందరు బండ్‌ను తమకు అనుకూలంగా మలుచుకున్నారు. కట్ట నుంచి వెంచర్లకు బాటలు వేసుకున్నారు. దీన్నే ప్రధాన రహదారిగా చూపుతూ స్థలాలు విక్రయించడంతోపాటు ఇళ్లు నిర్మించారు.

చురకలు



# ప్రమాదాలతో 'సెల్'గాటం

కర్నూలు : అనంతపురానికి చెందిన యువకుడు (28) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేసేవారు. సెలవులు రావడంతో ద్విచక్ర వాహనంపై సొంతూరికి బయలుదేరారు. కర్నూలు సమీపంలో 44వ జాతీయ రహదారిపైన సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఒంటిచేత్తో వాహనం నడుపుతున్నారు. అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో అదుపుతప్పి కింద పడిపోయారు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఇలా.. వాహనాలు నడిపే సమయంలో చరవాణుల్లో మాట్లాడుతూ ప్రమాదాల బారినపడుతున్న సంఖ్య క్రమంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అదుపుతప్పుతున్నారు ప్రమాదాల బారిన పడుతున్న వారిలో ఎక్కువగా ద్విచక్ర వాహనచోదకులే ఉంటున్నారు. సెల్‌ఫోన్ రింగ్ చెవినపడగానే జేబులోంచి ఫోన్‌తీసి మాట్లాడుతూ వాహనం నడుపుతున్నారు. చాలామంది వాహనంలో చరవాణి పెట్టుకునేందుకు ప్రత్యేక స్టాండ్లు సైతం ఏర్పాటు చేయించుకున్నారు.

చరవాణి వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వల్ల చోదకుడిలో ఏకాగ్రత లోపిస్తోంది. చెవి, భుజానికి మధ్య సెల్‌ఫోన్ పెట్టుకొని వేగంతో వాహనం నడిపే క్రమంలో రహదారిపై వెళ్లే మిగతా వాహనాలను సరిగా గుర్తించలేకున్నారు. హఠాత్తుగా రోడ్డుపైకి వచ్చే జంతువులు, స్పీడ్‌బ్రేకర్లు, గుంతలను గుర్తించలేక అదుపుతప్పి పడిపోతున్నారు. 2025లో జిల్లా వ్యాప్తంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసిన 1091 మందికి రూ.12.85 లక్షల జరిమానా విధించారు.

**చాటింగ్ చేస్తూ.. రీల్స్ చూస్తూ..**



కర్నూలు జిల్లాలో 40, 44, 340సీ, 167వ జాతీయ రహదారులు వెళ్తున్నాయి. వీటితో పాటు రాష్ట్ర, గ్రామీణ రహదారులు ఉన్నాయి. ఈ రహదారులపై ఇటీవల కాలంలో అతివేగం, మద్యం మత్తులో డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలామంది యువత వాహనం నడుపుతూనే ఫోన్ మాట్లాడటంతో పాటు సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూడటం, చాటింగ్ చేయటం, పాటలు వినడం వంటివి చేస్తున్నారు. మరికొందరు డ్రైవింగ్ చేస్తూనే సెల్ఫీలు దిగుతున్నారు. కొందరు హెడ్‌ఫోన్స్ పెట్టుకుని ఎక్కువ శబ్దంతో పాటలు వింటూ డ్రైవింగ్ చేస్తున్నారు. వెనుక వెళ్లే వాహనదారులు హారన్ కొడుతున్నా వినిపించుకోకుండా వెళ్తున్నారు. క్రికెట్ మ్యాచ్‌లు జరిగే సందర్భాల్లో స్మార్ట్‌ఫోన్లలో మ్యాచ్ లైవ్ చూస్తూ వాహనాలు నడుపుతున్నారు. కొందరు గూగుల్ మ్యాప్ ద్వారా దారిని అనుసరిస్తూ సెల్‌ఫోన్‌పై దృష్టి పెట్టడంతో వాహనంపై నియంత్రణ కోల్పోయి అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.

# గడువు సమీపిస్తున్నా.. పుష్కర కార్యాచరణేదీ..?

రాజమహేంద్రవరం : గోదావరి పుష్కరాలకు గడువు సమీపిస్తున్నా.. సమావేశాలతోనే సరిపెడుతున్నారు తప్ప సరైన కార్యాచరణ కానరావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నారు. యంత్రాంగం అనుసరించాల్సిన విధి విధానాలపై ప్రభుత్వం వివరణ కోరడం, నిధుల వినియోగం, ఆవశ్యకతపై నివేదిక అందజేయాలని ఆదేశించడం ఇందుకు ఉదాహరణగా పేర్కొంటున్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం ఆదేశాల మేరకు నగరపాల సంస్థ అధికారులు మంగళవారం అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన విభాగం అధికారులతో సమావేశమై పుష్కరాలకు సంబంధించి తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికన చేపట్టాల్సిన పనులపై వివరించారు. నగర పాలక సంస్థ రూ. 2105 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలు అందజేశారు. పుష్కరాలకు చేపట్టే ముందస్తు పనులపై నివేదిక ఇవ్వాల వారు కోరినట్లు తెలుస్తుంది.

**సమావేశాలు జరిగినా..**

రాజమహేంద్రవరంలో రెండు సార్లు సన్నాహక సమావేశాలు నిర్వహించినప్పటికీ ఇంకా పుష్కరాల నిర్వహణపై తుది నివేదిక అందించలేని పరిస్థితి. మొదటి సమావేశంలో ప్రతిపాదించిన పనులు కేవలం పుష్కర ఆతిథరి?య నగరం రాజమహేంద్రవరానికే పరిమతమయ్యాయి. మలివిడత సమావేశంలో ముందు ప్రతిపాదించిన పనులను పుష్కర ప్రత్యేక అధికార బృందం తిరస్కరించి గోదావరి



పరివాహక ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని నివేదిక ఇవ్వాలని కోరింది. తాజాగా రాష్ట్ర ఉన్నతాధికారులు మాత్రం త్వరలో సమావేశం ఏర్పాటు చేసి తుది నివేదికన ఆమోదించి దశ-దిశ నిర్దేశిస్తామని సూచించినట్లు తెలుస్తుంది.

**కొరవడిన సమన్వయం**

పుష్కర పనులు ఇంకా పట్టాలెక్కలేదు. ఏఏ పనులు చేట్టాలనే అంశంపైనా నిర్ధారణకు రాలేని పరిస్థితి. శాఖల మధ్య సమన్వయం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అధికారిక సమావేశాల్లో తప్ప మిగిలిన సందర్భాల్లో ఎక్కడా వీటి ప్రస్తావన లేకుండా పోతోంది. ఇప్పటి వరకు ఎన్ని ఘాట్‌లు సిద్ధం చేయాలి, ఏయే ఘాట్‌లకు మరమ్మతులు చేపట్టాలనే దానిపైనా స్పష్టత కొరవడింది. గోదావరి ఘాట్‌లకు అనుసంధానంగా ఉన్న రహదారుల విస్తరణ, ట్రాఫిక్ రద్దీని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన పనులపై కూడా అంచనా లేని పరిస్థితి ఉంది. గత పుష్కరాలకు రెండేళ్లు ముందుగానే ఘాట్‌ల నిర్మాణం చేపట్టి మూడు నెలలు ముందే సిద్ధం చేశారు.

# అలా ఆలస్యం.. నాణ్యత అపహాస్యం



అనకాపల్లి: విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథరిటీ (వీఎంఆర్‌డీఏ) ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు.. ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్నచందంగా సాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో గుత్తేదారులు ఆడింది ఆటగా.. పాడింది పాటగా తయారైంది. నిధులిచ్చినా కొన్ని పనులు ప్రారంభించకపోగా.. చేసిన అరకొర పనుల్లోనూ నాణ్యతా ప్రమాణాలు కనిపించడం లేదు.

**పట్టాలెక్కని సెంట్రల్ పార్క్**

అనకాపల్లి పట్టణ పరిసర ప్రాంతాల్లో వారాంతాల్లో కుటుంబసమేతంగా ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు ఒక్క పార్కు కూడా లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొన్నాళ్లకే సెంట్రల్ పార్కు నిర్మించేందుకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు అనకాపల్లి మండలం కొత్తూరు గ్రామంలోని సర్వే నం. 608లో ఏడు ఎకరాలకు పైగా ఉన్న జీవీఎంసీ స్థలంలో 5.68 ఎకరాల్లో మెగాపార్కు నిర్మించేందుకు సిద్ధమైంది. రూ.5.35 కోట్లు దీని నిర్మాణానికి వెచ్చించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి శంకుస్థాపన జరిగి కొన్ని నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ ఒక్కటీ అడుగు ముందుకు పడింది లేదు.

**కొలిక్కిరాని కళాక్షేత్రం**

అనకాపల్లిలోని డాక్టర్ రావుగోపాలరావు కళాక్షేత్రం పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనిని ఆధునికీకరించేందుకు 2022లో రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో వీఎంఆర్‌డీఏ అధికారులు ప్రతిపాదించారు. పనులు చేపట్టేందుకు పరిపాలన అనుమతులు లభించినప్పటికీ.. నిధుల విడుదలలో వైకాపా పాలకులు తీవ్ర జాప్యం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కళాక్షేత్రం పనులు త్వరితగతిన పూర్తవుతాయని అంతా భావించినా పనులు ఆలస్యమవుతున్నాయి. కళాక్షేత్రం ఆధునికీకరణతోపాటు దీని ఆవరణలో రోడ్డును ఆనుకుని దుకాణ సముదాయం, విశ్రాంతి గదులు నిర్మిస్తున్నారు. గుత్తేదారులు అశ్రద్ధ చూపడం, పనులు పర్యవేక్షంచాల్సిన అధికారులు మిన్నకుండిపోవడంతో పనుల్లో విపరీమైన జాప్యం జరుగుతోంది.

**ప్రమాణాలు లేని రోడ్లు**

గత ప్రభుత్వంలో విశాఖ వాసులకు ఇళ్లు ఇచ్చేందుకు అనకాపల్లి మండలం కుంచంగిలో భారీగా ల్యాండ్ పూలింగ్ చేశారు. భూములిచ్చిన సాగుదారులకు ఎకరాకు 18 సెంట్ల చొప్పున సర్వే నం. 318, 322, 334, 335లో ప్లాట్లు కేటాయించారు. ఈ లేఅవుట్లకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నది అప్పట్లో ఒప్పందం. ఇందుకు సంబంధించి బీటీ రోడ్లు వేసేందుకు వీఎంఆర్‌డీఏ రూ. 3.28 కోట్లు కేటాయించింది. టెండర్ ప్రక్రియలో ఓ గుత్తేదారు దక్కించుకుని.. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా రోడ్లు వేశాడు. వేసిన రెండు నెలలకే రోడ్లు దెబ్బతిన్నాయి. కొన్నాళ్ల తర్వాత దెబ్బతిన్న చోట్ల ప్యాచ్‌వర్కులు చేశారు. తారుతేలి.. గుంతలు పడుతున్నాయి.

**పక్కాగా నిర్మాణ పనులు**

కొత్తూరులోని సెంట్రల్ పార్కుకు సంబంధించి హద్దులు నిర్ణయించాం. త్వరలో చుట్టూ ప్రహరీ కట్టి.. నిర్మాణాలు ప్రారంభిస్తాం. కళాక్షేత్రం పనులు కూడా త్వరితగతిన అవుతున్నాయి. అతిత్వరలో వాటిని కూడా పూర్తిచేస్తాం. వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పక్కాగా నాణ్యతా ప్రమాణాలు పర్యవేక్షస్తున్నాం. నిబంధనలు పాటించకుంటే.. చర్యలు తీసుకుంటాం.

శంకరరావు, డీఈ, వీఎంఆర్‌డీఏ

# వెలుగుల సిరి.. శంకుస్థాపనతో సరి



అచ్యుతాపురం : ఆంధ్రప్రదేశ్ వెలుగు రేఖలను మార్చే గ్రీన్ హైడ్రోజన్ హబ్ నిర్మాణ పనులు ఏడాదిగా శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. గత ఏడాది జనవరి 8న విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ పూడిమడక సమీపంలో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పాల్గొన్నారు. దేశ ప్రధానే స్వయంగా శంకుస్థాపన చేయడంతో ప్రాజెక్టు పనులు వేగంగా పట్టాలెక్కుతాయని.. నిర్వాసితులు, మత్స్యకారులకు చక్కటి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంతా భావించారు. అందుకు భిన్నంగా ఏడాదైనా ప్రాజెక్టు పురోగతిలో ఒక్క అడుగు ముందుకు పడకపోవడంతో ముందుకెళ్తుందో? లేదో? తెలియక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**1.2 లక్షలమందికి ఉపాధి లక్ష్యం**

రాష్ట్రానికి వెలుగులు అందివ్వడంతోపాటు లక్షలాది మందికి ఉపాధి కల్పించి, రాష్ట్ర కీర్తికెరటాన్ని విశ్వ వ్యాప్తంచేసే ప్రాజెక్టు ఇది. రూ. 1.2 లక్షల కోట్లతో 60 వేల మందికి ప్రత్యక్షంగా.. మరో 60 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని ప్రాథమిక అంచనా. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభమైతే అచ్యుతాపురం పేరు అంతర్జాతీయ స్థాయిలో మారుమోగుతుంది. దేశంలో మొట్టమొదటి అతిపెద్ద హైడ్రోజన్ హబ్ ఇదే కావడంతో దీని ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా ఉంటుంది. దీనికి అనుబంధంగా పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. దీంతోపాటు ఉపాధి, అభివృద్ధి పరంగా ఉమ్మడి విశాఖ జిల్లాకు ఇది తలమానికంగా మారనుంది. ఇంతటి ప్రసిద్ధి ప్రాజెక్టు ఏడాదిగా ఒక్క అడుగు ముందుకెళ్లలేదు.

**టెండర్ దశలోనే...**

పూడిమడక సమీపంలో ప్రాజెక్టు నిర్మాణానికి 1200 ఎకరాల స్థలం, 12 కిలోమీటర్ల మేర చుట్టూ రక్షణగోడ నిర్మించుకోవడంతోపాటు సాంకేతిక సాయం అందివ్వడానికి అస్ట్రేలియాకు చెందిన నిపుణులు సైతం దీని కోసం ముందుకొచ్చారు. అయినా.. ఈ ప్రాజెక్టు ఏడాదిగా టెండర్ దశలోనే ఉంది. ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే అనుమతులను అధికారులు తీసుకురాకపోవడంతోనే నిర్మాణం జరగడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. అనుమతులు తీసుకురావడంలో అధికారులు ఉదాసీనత, పనులు పర్యవేక్షంచే ఉన్నతస్థాయి అధికారి విజయవాడ నుంచే పనులు పర్యవేక్షంచడం, స్థానిక అధికారులు చలనం లేకుండా ఉండటంతో ఇది మరింత ఆలస్యం కావడానికి కారణమవుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాజెక్టును ప్రధానమంత్రి మోదీ, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా భూమిపూజ చేసినా అధికారులు ఆస్థాయి ప్రాధాన్యం దీనిపై పెట్టకపోవడమే ఆలస్యానికి ప్రధాన కారణంగా అందరూ భావిస్తున్నారు. ఇప్పటికైనా పనులను పట్టాలెక్కించి అందరి ఆశలను తీర్చాలని కోరుతున్నారు.

# దేవరా.. కొండ పిండవుతోందయ్యా!



బుక్కరాయసముద్రం : దేవుడు వెలసిన కొండనూ అక్రమార్కులు వదలడం లేదు. ధనదాహంతో బరితెగిస్తున్నారు. యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తూ.. కొండను పిండి చేస్తూ.. కబ్జాకు పాల్పడుతున్నారు. బుక్కరాయసముద్రం శివారులో వెంకటరమణ స్వామి కొలువుదీరిన దేవరకొండకు వందల ఏళ్లనాటి చరిత్ర ఉంది. కొండపైన శ్రీవారు సతీసమేతంగా వెలిశారని భక్తులు విశ్వసిస్తారు. అలాంటి పవిత్రమైన కొండపై కన్నేసి.. కొల్లగొడుతున్నారు. ఎక్కడికక్కడ జేసీబీ, హిటాచీ యంత్రాలతో తవ్వేసి.. చదును చేసి తమ భూముల్లో కలిపేసుకుంటున్నారు. అనంతపురం జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే దేవరకొండ ఉంది. ఈ కొండ దాదాపు 100 ఎకరాల్లో విస్తరించి ఉంది.

**ఎకరం రూ.కోటి పైగానే..**

అనంత నగర శివారులో ఉండటంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. చుట్టుపక్కల ఎకరం విలువ రూ.కోటి పైగానే పలుకుతోంది. దీంతో దేవరకొండను అనుకుని, చుట్టుపక్కల భూములు ఉన్న చాలా మంది యంత్రాలతో తవ్వేసి ఆక్రమించుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, దేవాదాయశాఖ అధికారులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై స్వామి భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీ కొండమీద రాయుడి బ్రహ్మోత్సవాలకు మరో 25 రోజులు మాత్రమే సమయం ఉంది. వేలాది భక్తులు ఉత్సవాల్లో పాల్గొంటారు. ఇప్పటికైనా దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులు చొరవ తీసుకుని... బాధ్యులపై చర్యలు చేపట్టి కొండ పవిత్రతను కాపాడాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దారు శ్రీధరమూర్తిని వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి.. తవ్వుతున్న అక్రమార్కులపై కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో బరితెగింపు

ఒంటిమిట్ట : గ్రామీణాభివృద్ధి కోసం కేంద్రం విడుదల చేసిన నిధులను వైకాపా పాలనలో అడ్డగోలుగా దోచేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని లక్షణంగా మింగేశారు. ఇప్పటికే అక్రమార్కులపై అధికారులు కొరడా ఝుళిపించారు. అక్రమార్కులపై నమోదైన కేసులో మొన్నటి వరకు ఎలాంటి పురోగతి లేదు. ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఇలాంటి తరుణంలో విచారణ నివేదికలను ధ్వంసం చేయాలనే కుట్రతో ఎంపీడీవో కార్యాలయంలోకి దుండగలు చొరబడినట్లు సర్వత్రా చర్చ సాగుతోంది.

**అక్రమార్కుల పనేనా!:**

మండల పరిషత్తు కోటాలో విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులను మూడేళ్ల కిందట రూ.19 లక్షలకు పైగా దుర్వినియోగం చేశారు. ఈ దోపిడీ పర్వంపై వెలుగులోకి తేవడంతో జిల్లా అధికారులు స్పందించారు. చేపట్టిన పనులు, నిధుల విడుదల, బిల్లుల చెల్లింపుల్లో తేడాలు ఉన్నట్లు తేల్చారు. కొలతల పుస్తకంలో నమోదు చేయకుండానే దొరికినంత మేసేశారని తేల్చారు. పరిపాలన అనుమతి పొందకుండానే అక్రమ మార్గంలో నచ్చినోళ్లకు అడ్డగోలుగా బిల్లులు చెల్లించినట్లు గుర్తించారు. ఇప్పటికే బాధ్యులైన వారిపై వేటు వేశారు. మరోవైపు ముగ్గురు కీలకపాత్ర పోషించారని గతేడాది ఏప్రిల్ 25న క్రిమినల్ కేసు నమోదు చేశారు. రాజకీయ ఒత్తిడి రావడంతో నిన్నటి వరకు విచారణలో ఎలాంటి పురోగతి సాధించలేదు. మూడు రోజుల కిందట సీఐ నరసింహరాజు, ఎస్సై శ్రీనివాసులు ఈ కేసు రికార్డులపై దృష్టి సారించారు. వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ



నేపథ్యంలో ఎంపీడీవో కార్యాలయంలోకి గుర్తు తెలియని వ్యక్తులు పొద్దుపోయిన తర్వాత చొరబడ్డారు. అక్రమాలపై విచారణ చేసిన నివేదికలను పట్టుకెళ్లాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చినట్లు తెలుస్తోంది. మండలంలో 13 గ్రామ పంచాయతీలున్నాయి. పల్లెసీమల్లో మౌలిక వసతుల కల్పనకు వచ్చిన 15వ ఆర్థిక సంఘం పద్దు కూడా రూ. 55 లక్షలకు పైగా దుర్వినియోగం చేసినట్లు తేల్చారు. ఇప్పటికే 13 మంది సర్పంచులకు చెక్‌పవర్ రద్దు చేశారు. వీరిలో కొంతమంది న్యాయపోరాటం చేసి తిరిగి చెక్‌పవర్‌ను పునరుద్ధరించుకున్నారు. బాధ్యులైన సిబ్బందిపై వేటుకు రంగం సిద్ధమైంది. ఇక్కడ ఉన్న రికార్డులు కనిపించకుండా చేస్తే తమపై ఎలాంటి చర్యలు ఉండవనే భావన కొందరిలో ఉంది. ఎం.బుక్కులు, ఇతర రికార్డులు కనిపించకుండా చేయాలని కుట్ర పన్నినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ విషయమై ఒంటిమిట్ట ఎస్సై శ్రీనివాసులు మాట్లాడుతూ.. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టమన్నారు. ఈ రెండు ఘటనలపై అందిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి సమగ్రంగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

# తీగల మార్గం సుగమం

నందికొట్కూరు : కృష్ణానదిపై తీగల వంతెన నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి..దీంతో ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య మార్గం సుగమంకానుంది. శ్రీశైలం జలాశయం నిర్మాణంతో తెలుగు రాష్ట్రాల పరిధిలోని తీరప్రాంతాల్లో రాకపోకలు నిలిచాయి. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం కొల్లాపూర్ తీరాన సోమశిల, ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా సిద్ధేశ్వరం గుట్టల నడుమ కృష్ణానదిపై తీగలవంతెన నిర్మాణానికి కేంద్రం ముందుకొచ్చింది. తెలంగాణ రాష్ట్రం కల్వకుర్తి నుంచి కృష్ణానది మీదుగా వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు వరకు రూ.1,080 కోట్లు వెచ్చించి జాతీయ రహదారి (167కే) నిర్మిస్తున్నారు. ఇందులో తీగల వంతెనకు రూ.816 కోట్లు వెచ్చించనున్నారు. ఫిబ్రవరి



16వరకు టెండర్ ప్రక్రియకు అవకాశం కల్పించింది. అదేనెల 17న టెండర్లు ఖరారు చేసి పనులు చేపట్టనున్నారు.

**మూడు నెలల్లో పనులు మొదలు**

కొల్లాపూర్‌లోని వరిదేల రెవెన్యూ శివారు వరకు నిర్మించిన 167కే జాతీయ రహదారి నుంచి సోమశిల గుట్ట వరకు 8 కిలోమీటర్లు, ఏపీలో కపిలేశ్వరం వైపు 5 కిలోమీటర్ల మేర అప్రోచ్ రహదారి నిర్మాణానికి రూ.436 కోట్లు కేటాయించారు. తొలుత తీగలవంతెనకు ప్రాధాన్యం ఇస్తూ టెండర్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఈ ఏడాది మార్చిలో నిర్మాణ పనులకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. అప్రోచ్ రహదారి, తీగల వంతెనలో కొల్లాపూర్ వైపు 59 హెక్టార్లు భూమి అవసరం ఉండగా ఇందులో 25 హెక్టార్లు అటవీశాఖకు చెందినది..కాగా ఏపీ అవతల 29 హెక్టార్ల అటవీశాఖ భూమి కావాల్సి ఉంది.

# జలవనరుల 'బలోపేతం'!

కంభం : మొంథ తుపాను ప్రభావంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దెబ్బతిన్న చెరువులు, కుంటలు, కాలువల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. జిల్లాలో 799 చెరువులుండగా, వాటిలో 543 తటాకాలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వీటి మరమ్మతులకు ఎఫ్‌డీఆర్ కింద రూ.36.45 కోట్లు మంజూరు చేశారు. మార్కాపురం జిల్లాలోని గిద్దలూరు, యర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి నియోజకవర్గాల్లో 290, ప్రకాశం జిల్లా ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి, దర్శి నియోజకవర్గాల్లో 253 పనులు చేపట్టనున్నారు.

టెండర్లకు ఆహ్వానం

కంభం సబ్‌డివిజన్ పరిధిలోని కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల్లో 34 పనులకు రూ. 2.34 కోట్లు మంజూరు చేశారు. జిల్లాలోని అన్ని చెరువులకు పాలక మండళ్లు ఉన్నప్పటికీ రూ.5 లక్షల విలువైన పనులు దాటిన వాటిని టెండర్లు పిలిచి పనులు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రూ. 5 లక్షల కంటే తక్కువగా ఉన్న పనులను నీటి సంఘాల ద్వారానే చేపడతామన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన పనులు, నిధులను ఈఈలకు అప్పగించామని, వారే నిర్వహణ బాధ్యతలు చూస్తారని ఎస్ఈ వరలక్ష్మి తెలిపారు. దెబ్బతిన్న చెరువులు, కుంటలు, కాలువల్లో ప్రస్తుతం నీళ్లు లేకుంటే పనులు ప్రారంభించవచ్చునని ఆమె వివరించారు.

## ట్రెండీ అవుట్ ఫిట్ లో మృణాల్ అందాలు.. ఆ లుక్ చూసారా?

టాలీవుడ్‌లో 'సీతారామం'తో ప్రతి ఇంటి అమ్మాయిగా పేరు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్, ఇప్పుడు తన గ్లామర్ , స్టైలిష్ లుక్స్‌తో సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. సంప్రదాయబద్ధమైన పాత్రల్లో ఎంతగా ఒదిగిపోతుందో, మోడ్రన్ బోల్డ్ లుక్స్‌లోనూ అంతే ధైర్యంగా తన బ్యూటీని ఎలివేట్ చేయగలగడం ఆమె ప్రత్యేకత. కేవలం నటనకే పరిమితం కాకుండా, ఫ్యాషన్ ఐకాన్‌గా మారుతూ యువతలో భారీ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. భాషతో సంబంధం లేకుండా తన ప్రతిభతో నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్న ఈ భామ, ఫ్యాన్స్ మనసుల్లో చెరగని ముద్ర వేస్తోంది.

**మోడ్రన్ లుక్‌లో వెలిగిపోతున్న మృణాల్:** తాజాగా ఇన్స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్న ఫోటోల్లో మృణాల్ ఠాకూర్ సరికొత్త స్టైలిష్ మేకోవర్‌తో కనిపిస్తోంది. ఈ పిక్స్‌లో ఆమె ధరించిన మోడ్రన్ అవుట్‌ఫిట్ ఆమె పర్సనాలిటీకి పర్ఫెక్ట్‌గా సరిపోయింది. కెమెరా కళ్లకు తన చూపులతో మంత్రముగ్ధులను చేస్తూ, ఆమె ఇచ్చిన కాన్ఫిడెంట్ ఫోజులు ఫ్యాషన్



ప్రియులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఆమె హెయిర్ స్టైల్, ఇయర్ రింగ్స్, సింపుల్ మేకప్ మరియు ఆ యాటిట్యూడ్ ఈ ఫోటోలకు ఒక వింటేజ్ క్లాసిక్ టచ్ ఇచ్చాయి. ఆధునికతను, క్లాస్‌ను మిక్స్ చేస్తూ మృణాల్ చేసిన ఈ ఫోటో షూట్ చూస్తుంటే, ఆమె కేవలం నటి మాత్రమే కాదు, ఒక పర్ఫెక్ట్ మోడల్ అని కూడా నిరూపిస్తోంది.

**సినిమా ప్రయాణం:** కెరీర్ హిట్స్ , క్రేజీ ప్రాజెక్ట్స్ తో మృణాల్ కెరీర్ ప్రస్తుతం గోల్డెన్ ఫేజ్‌లో ఉంది. తెలుగులో 'సీతారామం', 'హాయ్ నాన్న' వంటి క్లాసిక్ సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్న ఈమె, గత ఏడాది తెలుగులో సినిమా లేకపోయినా బాలీవుడ్ లో సన్ ఆఫ్ సర్దార్ 2 మూవీతో అలరించింది. 2023 లో వచ్చిన హాయ్ నాన్న సినిమా సక్సెస్ తరువాత వరుసగా ఆమె నుండి మూవీస్ వస్తాయి అని అనుకున్నారు. అనుకున్నట్లు గానే విజయదేవరకొండ సరసన 2024లో ఫామిలీ స్టార్ వండి మూవీ లో నటించారు.కానీ సినిమా అంతగా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఇక తెలుగులో ఆమె సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక ఆమె రాబోయే చిత్రాల విషయానికి వస్తే, తెలుగులో అడవి శేష తో డెకాయిట్ మూవీలో నటిస్తున్నారు. ఇక బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ప్రభాస్ 'ఫౌజి' సినిమాలో ఆమె కథానాయికగా నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి, ఇది నిజమైతే టాలీవుడ్‌లో ఆమె క్రేజ్ ఆకాశాన్ని తాకడం ఖాయం. అలాగే హిందీలో వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్‌ను చాలా ప్లాన్డ్‌గా ముందుకు తీసుకెళ్తోంది. అందానికి కేవలం రూపమే కాదు, ఆత్మవిశ్వాసం కూడా తోడైతే ఎలా ఉంటుందో మృణాల్ ఠాకూర్‌ను చూస్తే అర్థమవుతుంది. అటు వెండితెరపై నటనతో, ఇటు సోషల్ మీడియాలో తన స్టైల్‌తో మృణాల్ చేస్తున్న హంగామా ఇప్పుడప్పుడే తగ్గేలా లేదు. భవిష్యత్తులో మరిన్ని గొప్ప చిత్రాలతో ఆమె మనల్ని అలరించాలని కోరుకుందాం.

## అదెప్పుడూ ఇబ్బందనిపించలేదు!

మొదట్నుంచి కూడా టాలీవుడ్ లో తెలుగు హీరోయిన్లు తక్కువగానే ఉండేవారు. అందుకే పక్క భాషల నుంచి హీరోయిన్లను తీసుకురావడం కామన్ అయిపోయింది.

ఈ నేపథ్యంలోనే ఎంతోమంది వేరే భాషల నుంచి వచ్చిన భామలు తెలుగులో సత్తా చాటారు. చాటుతూనే ఉన్నారు. అలాంటి వారిలో హరిద్వార్ కు చెందిన శ్రియా శరణ్ కూడా ఒకరు.

**సౌత్ స్టార్ హీరోల సరసన నటించిన శ్రియా...** శ్రియా నార్త్ అమ్మాయి అయినప్పటికీ సౌత్ లో ఆమె రెండు దశాబ్దాల పాటూ ఓ వెలుగు వెలిగారు. ఇక్కడి లాంగ్వేజ్, కల్చర్ కొత్త అయినప్పటికీ శ్రియా సౌత్ లోని స్టార్ హీరోలందరి సరసన నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడమే కాకుండా తనదైన ముద్ర వేయగలిగారు. ఇంకా చెప్పాలంటే, తన అందం, అభినయంతో ఎంతో మంది అభిమానుల్ని సంపాదించుకున్న శ్రియ సౌత్ స్టార్ గా పేరు తెచ్చుకున్నారు.

**సౌత్ స్టార్ గా గుర్తింపు...** ఇష్టం మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన శ్రియా తర్వాత ఛత్రపతి, శివాజీ, మనం లాంటి ఎన్నో బ్లాక్‌బస్టర్



సినిమాల్లో నటించారు. హిందీలో కూడా శ్రియ పలు హిట్ సినిమాల్లో నటించారు కానీ, శ్రియాకు ఎక్కువగా సౌత్ నుంచే గుర్తింపు రావడంతో ఆమె నార్త్ భామ్ అయినప్పటికీ సౌత్ హీరోయిన్ అనే అంటుంటారు. ఈ ట్యాగ్ పై శ్రియా రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో స్పందించారు.

**మనసు కూడా సౌత్ ఇండియన్ గా మారింది**... ఆడియన్స్ తనను సౌత్ స్టార్ అని పిలవడం తనకెప్పుడూ ఇబ్బందిగా అనిపించలేదని, నిజానికి సౌత్ ఆడియన్స్ తనపై కురిపించిన ప్రేమ వెలకట్టలేనిదని, ఇప్పుడు తన మనసు కూడా పూర్తిగా సౌత్ ఇండియన్ గా మారిపోయిందని శ్రియా చెప్పుకొచ్చారు. కాగా శ్రియా శరణ్ తాజాగా ఓ వెబ్‌సిరీస్ చేయగా, ఆ వెబ్‌సిరీస్ ప్రమోషన్స్ లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. శ్రియా చేసిన కామెంట్స్ పై ఆమె ఫ్యాన్స్ అందరూ ఎంతో సంతోషిస్తుండగా, శ్రియ సెకండ్ ఇన్నింగ్స్ కు రెడీ అయ్యారని, అందులో భాగంగానే ఇప్పుడు మళ్లీ ఆమె టాలీవుడ్ ను టార్గెట్ చేస్తున్నారని కొందరు అభిప్రాయపడుతున్నారు.

ఏదేమైనా శ్రియాకు సౌత్ లో ఉన్న ఫాలోయింగ్, క్రేజ్ చాలా ఎక్కువనే సంగతి అందరికీ తెలిసిన విషయమే.




## పల్లెటూరి అమ్మాయి పాత్రల్లో ఒదిగిన భామలు వీళ్ళే!



తెలుగు తెరపై హీరోయిన్లు అంటే కేవలం గ్లామర్ తారలే కాదు, మట్టి వాసన ఉన్న పాత్రల్లోనూ ప్రాణం పోయగలరని మన ముద్దుగుమ్మలు నిరూపించారు. 'ఫిదా'లో సాయి పల్లవి తెగువ, 'రంగస్థలం'లో సమంత మాస్ మేనరిజమ్స్ ప్రేక్షకులను ఇప్పటికీ మంత్రముగ్ధులను చేస్తూనే ఉన్నాయి. ఇప్పుడు అదే బాటలో 'జాతిరత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా 'భగవంతుడు' సినిమా కోసం పక్కా పల్లెటూరి పిల్లలా మారిపోయి అందరికీ షాక్ ఇచ్చింది. తన హైట్, మోడ్రన్ ఇమేజ్‌ను పక్కన పెట్టి ఆమె చేస్తున్న ఈ సరికొత్త ప్రయోగం ఇండస్ట్రీలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మరి పల్లెటూరి అమ్మాయి పాత్రల్లో ఒదిగిన భామల పైన ఓ లుక్ వేద్దాం..

**గ్లామర్ కన్నా.. పల్లెటూరి పరిమళం మిన్న :** తెలుగు సినిమాల్లో హీరోయిన్ అంటే అల్ట్రా మోడ్రన్ లేదా రిచ్‌గా ఉండాలనే రూల్ ఏమీ లేదు. కొన్నిసార్లు పచ్చని పొలాల మధ్య, లంగా ఓణి కట్టిన అమాయకత్వం కూడా బాక్సాఫీస్‌ను షేక్ చేస్తుంది. 'ఫిదా'లో సాయి పల్లవి భానుమతి గా చూపించిన తెలంగాణ పల్లెటూరి తెగువ, 'రంగస్థలం'లో రామలక్ష్మిగా సమంత పండించిన మాస్ పల్లెటూరి హావభావాలు ప్రేక్షకులకు ఇప్పటికీ గుర్తే. దేవర మూవీలో జాన్వీ కపూర్ మొదటిసారి తెలుగు మూవీ చేస్తూ గ్లామర్ కన్నా పల్లెటూరు మిన్న అన్నట్టు ఫుల్ మూవీ అంతా అదే పాత్రలో కొనసాగింది. ఇక అప్పట్లో వచ్చిన 'చందమామ'లో కాజల్, 'మిర్చి'లో అనుష్క, 'కరెంట్ తీగ'లో రకుల్, 'అ ఆ'లో అనుపమ.. ఇలా ప్రతి ఒక్కరూ తమ గ్లామర్ ఇమేజ్‌ని పక్కన పెట్టి మట్టి వాసన కలిగిన పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్నారు. ఈ పాత్రలే వారి కెరీర్‌కు మైలురాళ్ళుగా నిలిచాయి.

**చిట్టి ఇక పల్లెటూరి గుమ్మ:** 'జాతి రత్నాలు' సినిమాతో చిట్టిగా అందరి మనసు దోచుకున్న ఫరియా అబ్దుల్లా, ఇప్పుడు 'భగవంతుడు' చిత్రంతో సరికొత్త ప్రయోగానికి సిద్ధమైంది. తాజాగా విడుదలైన టీజర్‌లో ఆమె లుక్ నెటిజన్లను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎత్తుగా ఉండే ఫరియా, పల్లెటూరి లంగా ఓణిలో ఎంతో ఒద్దికగా కనిపిస్తూనే, మరోవైపు తనదైన శైలిలో రొమాంటిక్ సీన్స్‌లో గ్లామర్ టచ్ కూడా ఇచ్చింది. సాధారణంగా పల్లెటూరి పాత్రలు అంటే కొంత రిస్క్ అని భావిస్తారు, కానీ సాయి పల్లవి, సమంతల మాదిరిగానే ఫరియా కూడా ఈ సినిమాతో తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించి సక్సెస్ బాట పడుతుందని టీజర్ చూస్తే అర్థమవుతోంది. హీరోయిన్లు పల్లెటూరి పాత్రలు చేయడం వల్ల వారిలోని నటనా సామర్థ్యం బయటపడటమే కాకుండా, మాస్ ఆడియన్స్‌కు మరింత దగ్గరయ్యే అవకాశం ఉంటుంది. 'భగవంతుడు' సినిమాలో ఫరియా చేస్తున్న ఈ పల్లెటూరి ప్రయత్నం తప్పకుండా ఆమెకు మంచి బ్రేక్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుంటేనే ఇండస్ట్రీలో సుదీర్ఘ కాలం రాణించవచ్చని భావించి, ఇప్పుడు ఫరియా కూడా అదే బాటలో నడుస్తోంది. మరి ఈ 'పల్లెటూరి భామ' బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు మేపిస్తుందో చూడాలంటే సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే..

## కొలీగ్స్‌తో తమన్నా స్నేహం ఇలా కలిసొచ్చింది!



భారతదేశంలో అత్యంత లాభదాయక వ్యాపారం ఏది? అని ప్రశ్నిస్తే, జువెలరీ వ్యాపారం అని చాలా మంది చెబుతుంటారు. నమ్మకంగా లాభాలు ఇచ్చే వ్యాపారం బంగారం- ఆభరణాల వ్యాపారం. నైపుణ్యం, దక్షత ఉంటే ఈ రంగంలో ప్రవేశించిన ఎవరికీ అన్యాయం జరగదు. ఇప్పుడు దీనినే ఆలంబనగా చేసుకుని పలువురు కథానాయికలు జువెలరీ వ్యాపారంలోకి ప్రవేశిస్తున్నారు. అంబానీలు, రతన్ టాటాలే కాదు జువెలరీ రంగంలో చాలా దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి. అయినా ఎప్పటికప్పుడు సెలబ్రిటీలు ఈ రంగంలో ప్రవేశిస్తూ ఆశ్చర్యపరుస్తున్నారు. తాజాగా తమన్నా భాటియా తన కొత్త జ్యువెలరీ బ్రాండ్ -తమన్నా ఫైన్ జ్యువెలరీ-(టీజే) స్టోర్‌ను ముంబై జుహులో ఘనంగా ప్రారంభించారు. ఈ వేడుకకు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై సందడి చేశారు. స్టోర్ లాంచ్ కి హాజరైన వారిలో పలువురు అందాల కథానాయికలు ఉన్నారు. పూజా హెగ్డే, మృణాల్ ఠాకూర్, ఫాతిమా సనా షేక్ సహా పలువురు అందాల భామలు స్టోర్ లాంచ్ లో సందడి చేయగా వారి నడుమ సఖ్యత ఆశ్చర్యపరిచింది. ముఖ్యంగా ఫాతిమా, మృణాల్ లతో తమన్నా స్నేహం అందరినీ ఆశ్చర్యపరచగా, పూజా హెగ్డే మాత్రం కాస్తంత దూరంగానే నిలబడి ఫోజులిచ్చింది. అయితే మిల్కీ బ్యూటీ తన సహచరులందరితో ఎంత స్నేహంగా ఉంటుందో ఈ ప్రచార వేదిక స్పష్టంగా చెబుతోంది. తన కొలీగ్ కోసం ఇంతమంది భామలు నమ్మకంగా లాంచింగ్ ఈవెంట్ కి వచ్చి సహకరించారంటే అది తమన్నా కలుపుగోలుతనం ఫలితం అని అనుకోవాలి. తమన్నా ఫైన్ జువెలరీ బ్రాండ్ ప్రమోషనల్ ఈవెంట్ కి హాజరైన వారిలో సిద్ధార్థ్ మల్హోత్రా, సమంత రూత్ ప్రభు,కాజల్ అగర్వాల్, ఆర్యన్ ఖాన్, ఫరా ఖాన్ , శిబానీ దండేకర్, అన్యా సింగ్, ప్రగ్యా యాదవ్ , ఫల్గుణి పీకాక్ (ప్రముఖ డిజైనర్), నచికేత్ బార్వే (డిజైనర్) తదితరులు ఉన్నారు. ఇదే ఈవెంట్లో తమన్నా తల్లిదండ్రులు సంతోష్ భాటియా - రజనీ భాటియా కూడా ఉన్నారు. తమన్నా తన తండ్రి సంతోష్ భాటియాతో కలిసి ఈ వెంచర్‌ను ప్రారంభించారు. మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా తదుపరి ఓ రోమియో, పురుషన్ లాంటి చిత్రాలలో నటిస్తోంది. ఇవన్నీ ఈ ఏడాది థియేటర్లలో సందడి చేయనున్నాయి. -ఓ రోమియో- చిత్రంలో షాహిద్ కపూర్ కథానాయకుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. విశాల్ భరద్వాజ్ ఈ థ్రిల్లర్ ని తెరకెక్కిస్తున్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్ 13 ఫిబ్రవరి 2026న వాలెంటైన్స్ వీక్ కానుకగా విడుదల కానుంది. ఇందులో తృప్తి డిమ్రీ మరో కీలక ధారి. ఈ చిత్రంలో తమన్నా -రాబియా- అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుంది. యాక్షన్ హీరో విశాల్ సరసన పురుషన్ అనే చిత్రంలోను తమన్నా నటిస్తోంది. ఇది యాక్షన్-కామెడీ ఫిల్మ్. దీనికి సుందర్ సి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం 2026 వేసవిలో విడుదలయ్యే అవకాశం ఉంది. దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో రూపొందుతున్న -వివాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్- అనే చిత్రంలోను నటిస్తోంది. ఈ చిత్రం మే 15, 2026న విడుదల కానుంది. ఇది ఒక విభిన్నమైన అడ్వెంచరస్ థ్రిల్లర్. చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న క్వీన్ రీమేక్ - దట్ ఈజ్ మహాలక్ష్మి కూడా ఈ ఏడాది చివరిలో విడుదలయ్యే ఛాన్సుందని సమాచారం. భారతీయ సినీ దిగ్గజం వి. శాంతారామ్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కే చిత్రంలో తమన్నా ఒక ముఖ్య పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది.

## గ్లామర్ టచ్ తో మెస్మరైజ్ చేస్తున్న తెలుగమ్మాయి!

సినిమా రంగంలో తెలుగమ్మాయిల సందడి ఈ మధ్య కాలంలో బాగా పెరిగింది. ఆ జాబితాలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న భామ శివాని నగరం. చూడగానే ఆకట్టుకునే రూపం, చురుకైన కళ్లతో కుర్రకారు మనసు గెలుచుకుంటున్న ఈ చిన్నది, కేవలం అందంతోనే కాకుండా తన నటనతోనూ విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. స్వచ్ఛమైన తెలుగింటి కళతో పాటు గ్లామర్ టచ్ ఇస్తూ టాలీవుడ్‌లో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారిన ఈ బ్యూటీ, తనదైన శైలిలో రాణిస్తూ అగ్ర కథానాయికల సరసన చేరేందుకు సిద్ధమవుతోంది. తాజాగా ఆమె ఫొటోషూట్ సోషల్ మీడియా లో షేర్ చేసింది..ఆ ఫొటోలతో కుర్ర కారు మతి పోగొడుతుంది.



**'లిటిల్ హార్ట్స్' నుండి 'హే భగవాన్' వరకు:** శివాని నగరం ఇటీవల విడుదలైన 'లిటిల్ హార్ట్స్' సినిమాతో తన అద్భుతమైన నటనను ప్రదర్శించి అందరి దృష్టిని ఆకర్షించింది. మొదటి సినిమాతోనే మెచ్యూర్డ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చి, పరిశ్రమలో తనకంటూ ఒక బలమైన పునాదిని వేసుకుంది. ఈ విజయంతో ఆమెకు అవకాశాలు క్యూ కడుతున్నాయి. తాజాగా టాలెంటెడ్ హీరో సుహాస్ సరసన 'హే భగవాన్' సినిమాలో కథానాయికగా నటిస్తోంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమాతో శివాని కెరీర్ మరో మలుపు తిరుగుతుందని, సుహాస్-శివానిల కెమిస్ట్రీ తెరపై కొత్తగా ఉంటుందని ఫాన్స్ ఆశిస్తున్నారు.

**ఫోటో షూట్ సందడి:** ఆధునికతతో కూడిన సంప్రదాయ సౌందర్యం అభిమానులను ఆకట్టుకుంది..ఇక తాజాగా శివాని షేర్ చేసిన ఫోటో షూట్ విషయానికి వస్తే, ఆమె తన గ్లామరస్ లుక్స్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. సోషల్ మీడియాలో కనిపిస్తున్న ఫోటోల్లో శివాని స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో మెరుస్తూ, తన స్టైలిష్ పోజులతో నెటిజన్లను కట్టిపడేస్తోంది. లేత రంగు దుపట్టలో కూడా ఒక రకమైన హుందాతనాన్ని, రాజసాన్ని ఒలికిస్తూ ఆమె ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ హైలైట్‌గా నిలిచాయి. వెలుగునీడల నడుమ ఆమె కళ్ళలోని మెరుపు, ఆ కాన్ఫిడెంట్ స్మైల్ చూస్తుంటే వెండితెరపై మరో గ్లామర్ స్టార్ రాణిస్తుంది అని అనిపించక మానదు. మరి ఈ ఫోటోలు చూసిన అభిమానులు 'నేచురల్ బ్యూటీ' అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు.

## స్నేహా రెడ్డి స్టైలిష్ లుక్.. హీరోయిన్ కు మించిన అందంతో..

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ భార్య స్నేహ రెడ్డి పేరు చెప్పగానే సోషల్ మీడియాలో ప్రత్యేక క్రేజ్ గుర్తుకు వస్తుంది. సినీ రంగానికి నేరుగా సంబంధం లేకపోయినా.. స్టార్ హీరోయిన్ లకు ఏమాత్రం తీసిపోని ఫ్యాన్ ఫాలోయింగ్ ఆమె సొంతం. స్నేహ ఏ ఫోటో పోస్ట్ చేసినా క్షణాల్లోనే లక్షల్లో వ్యూస్, వేలల్లో లైక్స్ రావడం సహజం. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే స్నేహ... తన ఫ్యామిలీ మూమెంట్స్, ట్రావెల్ పిక్స్, పర్సనల్ అప్డేట్స్ ను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. ముఖ్యంగా ఆమె స్టైలిష్ ఫోటో షూట్స్ నెటిజన్లను ఆకట్టుకుంటుంటాయి. తాజాగా షేర్ చేసిన కొన్ని లేటెస్ట్ ఫోటోలు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్ గా మారాయి. బేబీ పింక్ కలర్ లాంగ్ ఫ్రాక్ లో స్నేహ రెడ్డి ఎంతో ఎలిగెంట్ గా కనిపించారు. సింపుల్ మేకప్, నేచురల్ హెయిర్ స్టైల్ తో క్లాస్ లుక్ లో మెరిసిపోయారు. డ్రెస్సుకు మ్యాచ్ అయ్యేలా ఆమె క్యారీ చేసిన చిన్న హ్యాండ్ బ్యాగ్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సింపుల్ అయినా స్టైలిష్ గా ఉన్న ఆ బ్యాగ్ మొత్తం లుక్ కు మరింత గ్రేస్ తీసుకొచ్చిందని



ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. అల్లు స్నేహ ఫోటోలు షేర్ చేసిన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మేడమ్ సో ప్రెట్టీ, గార్జియస్, లుకింగ్ ఫ్యాబులస్, హీరోయిన్ లకు ఏమాత్రం తగ్గట్లేదు అంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. సెలబ్రిటీలు, అల్లు అర్జున్ అభిమానులు కూడా కామెంట్లతో హంగామా చేస్తున్నారు. సూపర్ వదినమ్మ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. నెట్టింట తెగ షేర్ చేస్తూ.. ట్రెండింగ్ లోకి తీసుకొచ్చారు. పొలిటికల్ ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ ఉన్నప్పటికీ... అల్లు అర్జున్ ను ప్రేమించి పెళ్లి చేసుకున్న తర్వాత స్నేహ రెడ్డి మరింత పాపులర్ అయ్యారు. ఆ జంటకు కుమారుడు అయాన్, కూతురు అర్హ ఉన్నారు. కుటుంబ బాధ్యతలను చక్కగా చూసుకుంటూనే సోషల్ మీడియాలో కూడా ఫుల్ యాక్టివ్ గా ఉంటూ అభిమానులను అలరిస్తుంటారు. ఫ్యాషన్ విషయంలో స్నేహ ఎంపికలు ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటాయి. ట్రెండీ డ్రెస్సులు, క్లాసిక్ స్టైలింగ్, సింపుల్ యాక్సెసరీస్ తో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అందుకే ఆమె ఫోటో షూట్స్ యువతకు ఫ్యాషన్ ఇన్‌స్పిరేషన్ గా మారుతున్నాయనే చెప్పాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536